దీపావళి సంచిక

ఈ యేడాది నవంబరులో దీపావళి రాబోతోందనేది మీ కెలా న్యూస్ కాదో, దీపావళికి "జ్యోతి" ప్రత్యేక సంచిక రాబోతోందనేది కూడా మీకు న్యూస్ కాదు. ఇప్పటికి మూడు దీపావళి "జ్యోతి" సంచికలు మీరు చూశారు. నాలుగోదికూడా దీపావళి దీధితులతో రానున్నది.

కాని, ఒక వార్త — ఈ సారి "జ్యోతి" నవంబరు సంచిక మామూలుగానే వెలువడుతుంది. దీపావళికి మరొక విశేష సంచిక వస్తుంది.

నవంబరు మొదటి వారంలో విడుదల. సాధారణ సంచికలకు రెట్టింపు [1/4 డెమీ] సైజులో 250 పేజీలు.వెల నాలుగు రూపాయలు.

సుప్రసిద్ధ రచయితల కథలు, పద్యాలు, గేయాలు, సారస్వతాది విషయాలపై వ్యాసాలు, త్రివర్ణ చిత్రాలతో, సర్వాంగ మనోహరంగా, మెదడుకు విందుగా, కనులకు పసందుగా వెలువడుతుంది.

అడ్వర్టయిజ్‌మెంట్ రేట్లు

పూర్తిపేజీ	—	రూ. 200
అరపేజీ	—	రూ. 110
ఓపెనింగ్ పేజీ	—	రూ. 250
వెనుకఅట్ట మూడు రంగులలో	—	రూ. 800

ఇతర వివరాలకు : మేనేజరు "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, కాంగ్రెసు ఆఫీసురోడ్డు, విజయవాడ-2 చిరునామాకు వ్రాయగోరాము.

తొలిమాట

మన పంచతంత్రం కథలవంటివే ఈసప్ కథలు కూడా. అవి ఎన్ని శతాబ్దాలైనా విసుగుగాని, ఆసక్తిగాని మాసిపోని కథలు. "ప్రపంచ తంత్రం" అనే కొత్త శీర్షిక క్రింద ఈ సంచిక నుంచి అవి "జ్యోతి"లో (25వ పేజీ) వెలువడుతున్నాయి. "కొత్త సీసాలో పాత సారా" అని మీరు వాటిని నిరాకరించరని మా నమ్మకం (సారా పాతబడినకొద్దీ రుచి ఎక్కువవని అభిజ్ఞులంటారు. పాత చింతకాయ పచ్చడి పథ్యానికి మంచిదంటారు కూడా.)

* * *

అటువంటిదే ఈ సంచికలో మీరు చదవనున్న "బంగారు బాతు" కథ (29వ పేజీ)

* * *

రాష్ట్రంలో రాజకీయ ప్రహసనం ఆగస్టులో "క్లయిమాక్స్" చేరుకుంది. ఇకపై జరగబోయేది "యాంటీ క్లయిమాక్స్" కావచ్చు. (11వ పేజీ)

* * *

"మిస్ శోభాదేవి" (97వ పేజీ) కథ టెన్నిస్ ఆడేవారికి, ఆడనివారికి, కేవలం అభిమానులకు, అందరికీ ఆసక్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాము.

వేమూరి రాధాకృష్ణ

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్ పేట పోస్టు

విజయవాడ-2.

విడిప్రతి వెల

75 పైసలు

ఏడాది చందా

9 రూపాయలు

సంపుటి 4

సెప్టెంబరు 1966

సంచిక 9

ముఖచిత్రం:
శ్రీ కృష్ణసాయి ఫిలిమ్స్‌వారి
"మనసే మందిరం" దృశ్యాలు

మేనేజింగ్ ఎడిటర్:
వి. వి. రాఘవయ్య

ఉత్తరాలు

ఆగస్టునెల సంచిక సర్వాంగ సుందరంగా తయారైంది. బహుమతి కథలు ఈ నెల నాకు బాగా నచ్చాయి. ఇలాంటి బహుమతులిచ్చి ప్రోత్సహిస్తున్నందుకు నా కెంతో సరదాగా వుంది. కాని కాలేజివారికే గాకుండా యస్. యస్. ఎల్. సి. వారికి కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. దేవుడు గొప్పవాడు, మంచి మనిషి చెడ్డ మనసు కధానికలు చాలా బాగున్నవి. కాని ఇంత సుందరంగా వెలువడుతున్న పత్రికలో తప్పులుండటం చింతించ తగ విషయం. 119 పేజీలో, భూలోకంలో యమలోకానికి బదులు యమలోకంలో భూలోకం అని ప్రచురించారు. ఇకనైన ఇలాంటి తప్పులు రానివ్వరని ఆశిస్తున్నాను.

ఎర్నేని రామారావు,
సూర్యాపేట.

జ్యోతి పత్రిక దిన దినాభివృద్ధి పొందుచున్నందులకు చాలా సంతోషము. టిట్ బిట్స్ బొమ్మలతో (కార్టూనులతో) వేస్తే యింకా బాగుంటుందని అనుకొనుచున్నాను. శ్రీమతి యద్దనపూడి సులోచనా రాణిగారు వ్రాసిన విజేత బాగానే వుంటూ వున్నది. జరిగిన కథ కూడా క్లుప్తముగా ప్రచురించిన క్రొత్త, పాత పాఠకులకూ కొంచెం వీలుగావుంటుంది. ఆప్రకారము పై సంచిక నుంచి ప్రచురిస్తారని తలుస్తాను.

పొలిసెట్టి సత్యనారాయణ,
విశాఖపట్టణం.

హమెకి తెగ్(గు)లుగు హంతా బాగా రాదు. అహినా మీ "జ్యోతి" కితాబ్, కుంచెము, కుంచెము సదువుతుంటాము. "అందే" సాబ్ రాసినా కత హమెకి బహూత్ నచ్చింది. దాని పేరు "దేవుడు గొప్పవాడు". అది కత కాదు సాబ్, జరూర్ హెక్కడో జరిగి వుంటాది. గరీబ్ "రాఘవయ్యా" సాబ్ పడిన బాదలు, సదివినపుడు నాకు కల్లల్లో నీరు వచ్చినాయి.

"అందే" సాబ్‌కి బహూత్ సలామ్. మీకి కూడా నా సలామ్.

సఫీర్ అహమ్మద్,
రూర్కెలా.

ఆగస్టు నెల జ్యోతిలో ప్రచురించిన రాకెట్టులో వాడే ఇంధనం ఏమిటి ?— అన్న వ్యాసం చాలా బాగున్నది. దీనిని రచించిన డాక్టర్ మహీధర నళినీ మోహన్ గారికి నా అభినందనలు.

ఈ నెల జ్యోతిలో మొదటి బహుమతి పొందిన 'మల్లెలు నవ్వాయి' అన్నకథ చాలా బాగున్నది.

పి. యల్. యస్. సుధీర్,
విశాఖపట్నం-5.

ముప్పాళ రంగనాయకమ్మగారి "చదువుకున్నకమల"ఆగస్టు సంచికలో లేక పోవడంతో చాలా వెలితి అనిపించింది. ఆమె వ్రాసిన నవల లన్నిటివలె ఈ సీరియల్ కూడా చక చకా సాగింది. ఈ సీరియల్ ప్రచురించి నందుకు మీకు, రచయిత్రికి నా అభినందనాలు.

ఎం. వి. రమణమూర్తి,
బొంబాయి.

మీరు నిర్వహించిన కథలపోటీలలో "మల్లెలు నవ్వాయి" "బ్యాక్ కారు బొచ్చుకుక్క" "జగదేక సుందరుడి కథ"లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నిర్ణయించుటలో న్యాయం చేకూర్చారు.

"పిసరైన రాజకీయ వేత్త" ఎడిటోరియల్‌లో అటు "పాము" చావకుండా ఇటు "కర్ర" విరుగకుండా ఉంది. మిగతా కథలు సంతృప్తికరంగా ఉన్నాయి.

మండవ రామమోహనరావు,
ఆంధ్ర సిమెంటు, విజయవాడ-౯.

ఈ నెల జ్యోతిలోని కథలన్నీ బాగున్నవి. ముఖ్యంగా 'మంచిమనసు చెడ్డ మనిషి' అను కథ నన్నాకర్షించినది. రచయిత శ్రీ రంగం రాజేశ్వరరావు గారు ఈ కథ వ్రాయడంలో నాగరాజు లాంటి వారిని బాగా అర్థం చేసుకొన్నారని చెప్పక తప్పదు. మనుషు లెవర్లోనూ మంచితనం లేదు, మంచితనాన్ని అర్థం చేసుకొనే స్తోమత కూడా వీరికి లేదూ అనునది అక్షరాలా నిజం.

ఎన్. నరసింహారావు,
తిరుమల.

ఈ నెల సంచికలోని కథలన్ని చాల బాగున్నవి. వానిలో మంచి మనసు, చెడ్డ మనిషి కథ చాల బాగున్నది. నాగరాజు పాత్ర చాలా బాగున్నది. రచయితకి "జ్యోతి" ద్వారా నా ధన్యవాదము లర్పిస్తున్నాను. ఇటువంటి కథలు ప్రచురిస్తున్న మీకు మా హృదయ పూర్వకాభివందనలు. ఇటువంటి కథలు ముందు కూడా ప్రచురించెదరని ఆశిస్తాను.

వీరమల్లు వీరభద్రారావు,
యన్. యస్. డామ్.

మీరు ఆగస్టు నెల జ్యోతిలో ప్రచురించిన కొడవటిగంటి కుటుంబరావుగారి "మారిన జీవితం" పెద్దకథ చాలా బాగుంది. వచ్చే సంచికకోసం ఎదురు చూడాలనిపిస్తున్నది. మీరు చిన్నకథల పోటీతో విద్యార్థులలోని భావాలు కథల రూపమున బయటకు వచ్చునట్లు చేసినారు అది నాకు చాలా నచ్చినది. మీరు విభిన్న మనసులు ప్రదర్శించగల సంధ్యారాణిని మాకు పరిచయం చేసినందుకు నా కృతజ్ఞత. వీలయితే ఈలాగుననే జయలలిత గార్ని గురించి కూడా తెలియజేయ గలందులకు ప్రార్థన.

బి. సుబ్బారావు,
శ్రీకాకుళం.

రాజకీయాలు

ఆగస్టు నెలలో రాష్ట్ర కాంగ్రెసు రాజకీయాలు వేడినపడ్డాయి. ఈ పిడి భాగవతం క్రమంగా 18వ తేదీ నాటికి క్లయిమాక్స్ స్థాయిని చేరుకుంది. ఇక జరగబోయేదంతా యాంటీ క్లయిమాక్సే.

మూలంగా రెండు వర్గాలు. ఒకటి బ్రహ్మవర్గం. రెండోది సంజీవర్గం. మొదటిదానిలో తిమ్మారెడ్డి, సిద్దారెడ్డి, వి. బి. రాజు వగైరాలు. రెండోదానిలో సంజీవయ్య, రఘురామయ్య వగైరాలు ప్రధానపాత్రలు. కొందరు అలీన విధానం అవలంబించినవారున్నా వారి మాట ఎక్కడా వినబడడం లేదు.

రెండువర్గాలున్న తర్వాత బలాబలాలు తేల్చుకోవాలిగా! దానికి అవకాశం ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీలో స్వర్గీయ అలపాటి స్థానాన్ని భర్తీ చేయడానికి జరగవలసిన ఉప ఎన్నికతో వచ్చింది. ఇప్పుడున్న పది మందిలో అయిదుగురటు, అయిదుగురిటు. అందుచేత, వచ్చే ఎన్నికలలో అభ్యర్థుల నిర్ణయం, అధికారంలోకి ఎవరు వచ్చేది ఈ పదకొండవ సభ్యుడు ఎటు వుంటాడనే దానిపై ఆధారపడి వుంది. అందుకే ఈ పోరాటమంతా.

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ తాను విదేశాలనుంచి తిరిగి వచ్చాక ఎన్నికతేదీ నిర్ణయించమన్నారు. కాని, బ్రహ్మానంద రెడ్డి వర్గం ఈ లోగానే ఆగస్టు 18వ తేదీన ఎన్నిక జరగాలని నిర్ణయించింది. కాంగ్రెసు నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం పి. సి. సి. కార్యదర్శితో పి. ఆర్. వో. సంప్రదించి చేయాలి. పి. ఆర్. వో. బ్రహ్మవర్గం వాడైతే ఏ గొడవా వుండేదికాదు. కాని, అతడు సంజీవర్గం వాడు. అందుచేత అతడు అభ్యంతరం లేవదీశాడు. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ సాదిక్ అలీ పి. సి. సి. కి రెండు లేఖలు వ్రాశారు. కాని, వారిని, పి ఆర్ వో కూడా సమర్థిస్తున్నట్టు గోడమీద పిల్లివాటంగా వ్యవహరించారు.

పి. సి. సి సమావేశాన్ని, ఎన్నికను వాయిదా వేయాలని సంజీవర్గం; వీల్లేదని బ్రహ్మవర్గం. వాయిదా వేస్తే, ఆ వ్యవధిలో సంజీవర్గం బలాన్ని కూడ గట్టుకుంటుంది. వెంటనే ఎన్నిక జరిపించేస్తే అధికార వర్గం గెలుస్తుంది.

ఏమైనా సరే ఎన్నిక జరిపించడానికే బ్రహ్మవర్గం నిశ్చయించింది. జిల్లాలలో పర్యటించి తమ వర్గాన్ని కూడ గట్టుకున్నారు. సంజీవర్గం కూడా ఆఖరి నిమిషంలో హడావిడిగా పర్యటనలు చేశారుగాని, లాభం లేకపోయింది.

ఈ లోగా శ్రీ కామరాజ్ విదేశాల నుంచి తిరిగివచ్చారు. ఉభయ వర్గాలు చెప్పింది విన్నారు. పి. సి. సి. సమావేశాన్ని వాయిదా వెయ్యండని సలహా ఇచ్చారు. అయితే, ముఖ్యమంత్రి అభ్యర్థిని శ్రీ సంజీవరెడ్డి అంగీకరిస్తారనే ప్రాతిపదికపై వాయిదా వేయాలని శ్రీ కామరాజ్ సలహా ఇచ్చినట్టు బ్రహ్మవర్గం వారి వాదన. తాను అలా అనలేదని శ్రీ సంజీవరెడ్డి చెబుతున్నట్టు సంజీవర్గం వాదన. ఏది నిజమో తెలియదు.

ఏమైతేనేం, బ్రహ్మానందరెడ్డి గారు అనుకున్న ప్రకారం పి. సి. సి. సమావేశం జరిపించారు; కానైతే, కాంగ్రెసు అధ్యక్షుని సలహా ప్రకారం ఎన్నికను వాయిదా వేశారు. పి. సి. సి. సమావేశానికి బ్రహ్మవర్గం పూర్తిగా తయారై వచ్చింది. సంఖ్యాబలంతో, రెండో వర్గాన్ని నోరెత్తకుండా చేసి, [illegible]త్తినా వినబడకుండా చేసి, వాకౌట్ చేయించారు.

18వ తేదీ సంఘటనలు తమ విజయాన్నే సూచిస్తున్నాయని వారూ వీరూ కూడా చెప్పుకుంటున్నారు. సమావేశం జరిగింది కనుక బ్రహ్మ వర్గానిది గెలుపు. ఎన్నిక వాయిదా పడింది కనుక సంజీవర్గానిది విజయం.

నిజానికి అప్పుడు ఎన్నిక జరిగివుంటే బ్రహ్మ వర్గం గెలిచేదని, ఇక ముందెప్పుడో జరిగితే చాణక్య వర్గం గెలవ వచ్చునని పరిశీలకుల ఊహాగానం.

రెండు వర్గా[illegible] శ్రీ కామరాజ్ [illegible]న్నస్తున్నారు. ఈ వాక్యాలు వ్రాస్తున్న నాటికి ఆ ప్రయత్నాల ఫలితం ఇంకా తెలియలేదు. తాత్కాలికంగా రాజీ కుదిరినా, మరేమైనా ఒకటి మాత్రం ఖాయం: ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసులో అనైక్యం కొనసాగుతుంది. ఈ విభేదాల ప్రభావం ఇటు రాష్ట్ర పరిపాలన మీద, అటు వచ్చే ఎన్నికలలో కాంగ్రెసు మీద పడక తప్పదు.

* * *

బ్రహ్మానందరెడ్డిగారిని నిన్నమొన్నటిదాకా ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కల మనిషిగా ఎవరూ పరిగణించేవారు కాదు. సంజీవరెడ్డి గారి నీడగా, అంతేవాసిగా, అనుయాయిగా మాత్రమే భావించేవారు. కిట్టని వారు ఆయనచేతి కీలుబొమ్మగా కూడా వర్ణించేవారు.

అటువంటిది సుమారు నాలుగు నెలలలో శ్రీ బ్రహ్మానందరెడ్డి ఉన్నట్టుండి ఒక్కసారిగా సొంత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం, సొంత గొంతుకతో సొంత మాటలు పలకడం ఒక విచిత్ర పరిణామంగానే చాలమంది భావిస్తున్నారు. ఏమిటీదీని రహస్యం, అని ఆరాలు తీయడం మొదలు పెట్టారు.

పెద్దగా ఆరా తీయవలసింది ఇందులో లేదేమో. శ్రీ బ్రహ్మానందరెడ్డే స్వయంగా ఆ మధ్య ఒక ప్రకటనలో తన రహస్యం కాస్త చెప్పేశారు. ఆయన ముఖ్యమంత్రి పదవి స్వీకరించి రెండున్నర ఏళ్ళయింది. శ్రీ సంజీవ

రెడ్డి ఆయనకు ఆ పదవిని కట్టబెట్టి తాను తప్పుకున్నారు — ఎప్పుడు పడితే అప్పుడు తిరిగి రాష్ట్రానికి రావడానికి వీలుగా.

అయితే, ముఖ్యమంత్రి అయిన నాట నుంచి శ్రీ బ్రహ్మానందరెడ్డి వ్యక్తిత్వం పెరిగింది. నిర్భయంగా తనకు తోచింది చేయడం, తోచింది మాట్లాడడం, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం దగ్గర నీళ్ళు నమలకుండా ఉన్న దున్నట్టు చెప్పడం, పరిపాలనలో ఏ ఒడుదుడుకులు లేకుండా, అన్ని వర్గాలవారిని కూడగట్టుకుని అందరి మన్ననలు చూరగొనడం — ఇవన్నీ చేశారు. మొత్తంమీద రాష్ట్రంలో, ప్రజలలో, కాంగ్రెసు సంస్థలో, పార్టీలో ఆయన పలుకుబడి పెరిగి పోయింది. వచ్చే ఎన్నికల తర్వాత కూడా ఆయనే తిరిగి ముఖ్యమంత్రి కావచ్చునని ప్రజలకు అనిపించడం కూడా సహజం.

అయితే, ఇలా సాఫీగా సాగి పోతున్న రథానికి శ్రీ సంజీవరెడ్డి (ఆయన పేరు చెప్పక పోయినా) బ్రేకులు వేయడం మొదలెట్టారని, ఆయన రెండు మూడేళ్ళ కొకసారి ఇలా చేయడం ఆనవాయితీయేనని శ్రీ బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. అకస్మాత్తుగా శ్రీ సంజీవయ్య వర్గంతో కలిసిపోవడం, తనను గద్దెనుంచి దింపి వేయడానికేనని, తనకు ఎసరు పెట్ట డానికే సమైక్యత పేరిట శ్రీ సంజీవ రెడ్డి ఎత్తు వేశారని ఆయన అనుమానించారు. దానితో ఆయన ఎదురు తిరగక తప్పిందికాదు. ఈ కలతలన్నీ శ్రీ సంజీవరెడ్డి కావాలని తెచ్చిపెట్టినవేనని బాహా టంగా ప్రకటించారు. ఆయనతో పై అంటే పై అని. ఏ లెక్కేమిటని ఎదురు నిలిచారు. నువ్వు సంజీవరెడ్డి వైతే నేను బ్రహ్మానందరెడ్డి నన్నారు. తనకూ రాజకీయపు ఎత్తులు, జిత్తులు తెలుసునని నిరూపించుకున్నారు.

నిజానికి ఆయనకు ఎత్తులు, పై యెత్తులు తెలియవని ఎవరూ అనుకో నక్కర్లేదు.

ఎంతైనా కాంగ్రెసు రాజకీయాలలో పుట్టి పెరిగిన వ్యక్తి కదా : 27 ఏళ్ళ చిన్న వయస్సులో ఆయన గుంటూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటు. 1946 నుంచి 52 వరకు మద్రాసు అసెంబ్లీలో సభ్యుడు. 1955 లో ప్రదేశ్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి. అప్పటిలో శ్రీ అల్లూరి పి. సి. సి. అధ్యక్షుడు. శ్రీ సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రి. సంజీవరెడ్డిగారి మొదటి మంత్రివర్గంలో ఆయన స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి. శ్రీ గోపాలరెడ్డి కేంద్రా నికి వెళ్ళిపోగానే శ్రీ బ్రహ్మానందరెడ్డి ఆర్థిక మంత్రి అయ్యారు. అది 1956లో. నాటి నుంచి వరసగా ఆరు బడ్జెట్లను ప్రవేశపెట్టిన ఖ్యాతి ఆయనకు దక్కింది.

శ్రీ సంజీవరెడ్డి కాంగ్రెసు అధ్య క్షుడుగా వెడుతూ రాష్ట్ర రాజకీయా

లలో తన ప్రతినిధిగా శ్రీ బ్రహ్మానంద రెడ్డిని నిలిపి మరీ వెళ్ళారు.

మరి, నాటి నుంచి ఈయన ఆయన కనుసన్నలలో మెలగినవారే. సంజీవయ్యగారి నాయకత్వానికి వ్యతిరేకంగా యూనిటీ ఫ్రంటును స్థాపించినవారే. అంతకుముందు గోపాలరెడ్డిగారి నాయకత్వానికి వ్యతిరేకంగా సంజీవరెడ్డి గారితో పని చేసినవారే.

ఆనాడు శ్రీ సంజీవరెడ్డి తన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా శ్రీ బ్రహ్మానంద రెడ్డిని ఉపయోగించుకున్నట్లే, ఈనాడు తదితరులను శ్రీ బ్రహ్మానంద రెడ్డికి వ్యతిరేకంగా ఉపయోగించుకుంటున్నాడు. ఇదంతా పాలిటిక్స్ మహాత్యం. ఇందులో వింతలేదు, విస్తుపోవలసింది లేదు.

ఈనాడు శ్రీ బ్రహ్మానంద రెడ్డి పట్ల ప్రజలలో - బహుశా కాంగ్రెసు వాదులలో కూడా — ఒక సానుభూతి వున్నమాట నిజం. కాంగ్రెసు పరిపాలన పట్ల వున్న అసహనం, అసంతృప్తి ఆయన పట్ల కూడా వున్నదనుకోండి. దానినుంచి ఆయన కాదు, మరే కాంగ్రెసు ముఖ్యమంత్రీ తప్పించుకో లేడు. ఇరవై యేళ్ళ కాంగ్రెసు ప్రభుత్వాల అవకతవకలను అనుక్షణం అనుభవిస్తున్న ప్రజలు శ్రీ బ్రహ్మానందరెడ్డి మాత్రం తమను కన్న బిడ్డల వలె పరిపాలిస్తున్నారని ఎట్లా అనుకుంటారు?

అయినా, ఆయనపట్ల ఒక కొంత సానుభూతి వున్నమాట వాస్తవం. శ్రీ సంజీవరెడ్డి చాణక్య నీతిపై ద్వేషం వల్ల కావచ్చు; స్వతహాగా శ్రీ బ్రహ్మానందరెడ్డి సరసుడు, సహృదయుడు, కొన్ని "లాయల్టిస్" కలవాడు కావడం వల్లకావచ్చు; ఆయన పరిపాలన మిగతా వారికి ఏమీ తీసిపోనిది కావడం వల్ల కావచ్చు. ఏమైనా సానుభూతి వుంది.

ఇక కాంగ్రెసు వాదులంటారా? వీరిలో ఎక్కువమంది నిన్న మొన్నటిదాకా సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డిగార్లను అంటి పెట్టుకుని తిరిగిన వారే. ఈనాడు వారిద్దరి మధ్య స్పర్థలు రావడంతో కొంతకాలం ఎటు మొగ్గాలో నిశ్చయించు కోలేక తికమక పడ్డారు. గెలిచే కోడిపైపే వుండడం శ్రేయస్కరం కదా! ప్రస్తుతం శ్రీ బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి. అధికారం ఆయన చేతిలో వుంది. ఆయనవల్ల కావలసిన పనులు చాలా వుంటాయి. ఈ విధంగా "సినికల్" దృక్పథంతో ఆలోచించి ఆయన పంచ చేరినవారు ఆయన వర్గంలో చాలా మంది కనిపిస్తారు. ఆయనకూడా ఎంత లేదన్నా కాంగ్రెసు వాడు కదా! వారికి నయానా భయానా నచ్చచెప్పి తన బలం వృద్ధి చేసుకున్నారు. ప్రస్తుతం అదీ పరిస్థితి. ఇది ముందు ముందు ఎట్లా పరిణమిస్తుందో, చివరికి ఎవరిది పై చెయ్యి అవుతుందో చూడవలసిందే.

★★★

ఆంధ్రలో ఆధునిక దేవాలయం

నాగార్జున సాగర్‌ను జవాహర్లాల్ నెహ్రూ ఒకసారి "ఆధునిక దేవాలయ"మని వర్ణించారు. ఒకనాడు దేవాలయాలను అద్భుత శిల్ప కళాఖండాలుగా తీర్చిదిద్దేవారు. ఇంజనీరింగ్ శాస్త్రాన్ని కూడా ఒక కళగా అంగీకరించగలిగితే నాగార్జునసాగర్‌ను ఒక మహత్తర శిల్ప సృష్టిగా పేర్కొనవచ్చు.

ఒకనాడు, బహుశా రెండువేల ఏళ్ళక్రిందట కృష్ణానదీ తీరానగల ఆ ప్రాంతంలో ఇక్ష్వాకు రాజుల రాజధాని విజయపురి వర్ధిల్లింది. ఆ తర్వాత విష్ణుకుండినులు, పల్లవులు ఇంకెందరో ఆ ప్రాంతాన్ని పాలించారు. మహాయాన బౌద్ధంలో మాధ్యమిక వాదానికి ప్రవక్త అయిన, నాగార్జునాచార్యుడు అక్కడ విశ్వవిద్యాలయం స్థాపించాడు. వందలాది బౌద్ధులు దేశదేశాలనుంచి అక్కడికి వచ్చి తమ మత, తత్వశాస్త్రాలలో విద్యాభ్యాసం చేసివెళ్ళేవారు.

ఈనాడు నాగార్జునుడి పేరుమీద వెలసిన ప్రాజెక్టునుకూడా చూడడానికి అనుదినం వందలాది యాత్రికులు వచ్చిపోతున్నారు. వారందరు తీర్థ యాత్రికుల వంటివారే. మేమూ తీర్థ యాత్రగానే నాగార్జున సాగర్‌ను సందర్శించడానికి మొన్న ఆగస్టు మొదటివారంలో వెళ్ళాము. మాది నిజంగా "తీర్థయాత్రే" అయింది.


ప్రాజెక్టు పరిసరాల ప్రకృతి రామణీయకం వర్ణించనలవి కానిది. ఇటీవలి వరకు నిర్జనంగా వున్న ఆ ప్రదేశం కృష్ణానదికి అటునిటు, వేలాది ప్రజలతో కలకలలాడుతున్నది.

ఆరు జిల్లాలలో లక్షలాది ఎకరాల మెట్టభూమిని సస్యశ్యామలం చేయనున్న నాగార్జునసాగర్‌ను ప్రారంభించి పదకొండేళ్ళు దాటింది. రెండుదశలలో దీన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికి మొదటి దశ పూర్తి కావస్తున్నది.

ప్రపంచంలో కల్లా ఎత్తైన రాతి డామ్‌గా దీన్ని పేర్కొంటున్నారు. మొదటి దశలో దీని రిజర్వాయరు ఎత్తు 546 అడుగులుంటుంది. దీనితో కృష్ణానది డామ్‌కు ఎగువవైపున 110 చదరపు మైళ్ళ సరస్సుగా మారిపోతుంది.

ఆనకట్టకు రెండువైపులా రెండు కాల్వలు త్రవ్వుతున్నారు. మొదటి దశలో కుడివైపు కాల్వపొడవు 127 మైళ్ళు, ఎడమ కాల్వ 111 మైళ్ళు. కుడికాల్వ గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలలో 12 లక్షల 70 వేల ఎకరాలకు, ఎడమ కాల్వ నల్గొండ, ఖమ్మం, కృష్ణాజిల్లాలలో 8 లక్షల 80 వేల ఎకరాలకు జలదానం చేస్తాయి. మొత్తం 8 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండగలవని అంచనా.

రెండవ దశ బహుళార్థ సాధకమైనది. కుడి కాల్వ పొడవు 235 మైళ్ళకు పెరిగి 20 లక్షల 60 వేల ఎక



ఆగస్టు మొదటివారంలో నాగార్జున సాగర్ (జ్యోతి ఫోటో)

రాలకు నీరు అందుతుంది. ఎడమ కాల్వ 218 మైళ్ళకు పెరిగి 14 లక్షల 40 వేల ఎకరాలకు నీరు లభిస్తుంది, మొత్తం 15 లక్షల టన్నుల వరకు ఆహార ధాన్యాలే కాక, మరెంతగానో వాణిజ్యపు పంటలు కూడా పండగలవు.

ఇంతే కాదు. రిజర్వాయరు ఎత్తును ఇంకా పెంచి, జల విద్యుచ్ఛక్తిని కూడా ఇక్కడ ఉత్పత్తి చేయబోతున్నారు. ఒక్కొక్కటి 50 వేల కిలోవాట్ల చొప్పున ఉత్పత్తి చేయగల 8 జెనరేటర్లను నెలకొల్పుతారు. మొత్తం 400 మెగా వాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తుంది.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఋణ సహాయంపై ఆధారపడి ఈ ప్రాజెక్టు నిర్మాణం సాగుతున్నది. ఖర్చు మొత్తం 140 కోట్ల రూపాయలకు పైమాటే. ఇప్పటికి కేంద్రం ఇచ్చిన ఋణం 107 కోట్ల డాలర.

ఇటీవల కృష్ణానదికి బాగా వరదలు వచ్చిన ఫలితంగా 495 అడుగులపైన స్పిల్‌వే మీదుగా నీరు అపార శక్తితో ప్రవహిస్తున్నది. అదిచూసి తీరవలసిన దృశ్యం. గాలిలోకి ఎగసిన నీటి తుంపర్లలో సూర్యకిరణాలు నిర్మించిన ఇంద్రధనుస్సు మూడున్నరకోట్ల ఆంధ్ర ప్రజలు కంటున్న సప్తవర్ణ స్వప్నం వలె వుందని మా బృందంలో ఒక మిత్రుడు కవిత్వం ఒలకబోశాడు.

ఆగస్టు 3వ తేదీన కుడి, ఎడమ కాల్వల లోకి నీరు వదిలారు. ఈ నీరు 579 వేల ఎకరాలకు అందగలదని రాష్ట్ర ప్రభుత్వం అంచనా. కాని, దాన్ని ఉపయోగించుకునే బాధ్యత, అదనంగా ఆహారోత్పత్తి చేయవలసిన కర్తవ్యం ఆ ప్రాంతపు రైయకటుదార్ల పైనే వుంది. అప్పుడే ఈ ఆధునిక దేవాలయం కోరిన వరాలిస్తుంది.

★★★

ఉదయంనుంచి పడుతున్న వర్షం సాయంత్రమైనా తగ్గు ముఖం పట్ట లేదు. చల్లని ఈదురుగాలి ఉధృతంగా వీస్తోంది. సన్నని జల్లు పడుతూనే ఉంది. అలా కూర్చోవడంవల్ల, బద్ధకంగా ఉంటే. ఆ చలి, వర్షంలోనే బయలుదేరాను—గొడుగు పట్టుకొని. రోడ్డుమీద పారుతున్న నీటిలో పాదాలు మునిగిపోయాయి. రోడ్డు ప్రక్కనున్న యింట్లోంచి యిద్దరు పిల్లలు పడవలు తెచ్చి గుమ్మం ముందు నీటిలో వదిలి చోద్యం చూస్తున్నారు.

"శర్మగారూ! ఎవరో పిలిచేసరికి వెనక్కి తిరిగాను.


సైకిలు దిగి "ఉత్తరం వచ్చింది సార్ మీకు—" అంటూ పోస్టుమన్ కవరందించి పోయాడు.

కవరు చింపాను ఆత్రుతగా.

"శ్రీ శర్మగారికి,

ఈ ఉత్తరం చూసి ఆశ్చర్య పోతున్నారు కదూ! అవును. నన్ను మరచిపోయి ఉంటారు. అయిదు సంవత్సరాల వెనక్కిపోయి జ్ఞాపకాల పుటల్ని తిరగేస్తే. వెంటనే గుర్తు కొస్తాను.

ఆనాడు నలుగురిలో-నిండుక్లాసులో మీరునాకు ప్రేమలేఖ వ్రాశారనిఅవమానించిన మూర్ఖురాలిని. నే నానాడు చేసిన ద్రోహం గుర్తుకొచ్చిందా? ఏ ముఖం పెట్టుకొని ఉత్తరం రాశావు మళ్ళీ — అని అడుగుతోంది కదూ మీ మనసు? మీ యిష్టమొచ్చిన శిక్ష విధించండి — అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను. నేను పాపాత్మురాల్ని శర్మా!



యవ్వనపు పొంగులో, చదువుకొనే రోజుల్లో, అందంగా, సుకుమారంగా, లావణ్యంగా ఉండే నాకోసం ఎందరో పరితపించేవారు. వారందరిలోకీ మీరు అందమైనవారు, తెలివైనవారు. నావైపు కన్నెత్తి చూసేవారుకారు. మీ నిరసనభావమే నన్ను మీ వైపు మొగ్గేలా చేసింది. నేనెన్ని వేషాలేసినా మిమ్మల్ని ఆకర్షించలేక పోయేదాన్ని. మీకు గర్వమని, అందంగా ఉన్నాననే అహంకారమని అపోహపడ్డాను.

మీ పొగరు అణగ ద్రొక్కాలని. నాకో ప్రేమలేఖ మీరు రాసినట్లు రాసి నా ఎడ్రస్సుకి పోస్టు చేసుకున్నాను. అదిచూపి మిమ్మల్ని అందరిలోనూ అవమానంపాలు చేశాను. కానీ తిరిగి

మొదటి బహుమతి రూ. 50

ఎ. వి. కె. శర్మ,

[ఎమ్. ఏ. (క్లాసు), సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్, ఆర్ట్సు కాలేజీ, వాల్తేరు.]

పల్లెత్తుమాటన్నారా మీరు? దూషించారా? లేదే. ఎందుకూరుకున్నారు శర్మా? అనాడే తగిన శిక్ష విధించవలసింది. తప్పు చేయకపోయినా చేసినట్లు ఊరుకున్నారు. ప్రిన్సిపాల్ మిమ్మల్ని డిబార్ చేశారు. ఆనాటి నుంచినేనుపడిన బాధ వర్ణనాతీతం. అనుక్షణం మీరూపే కళ్ళముందు మెదిలేది. మీకు ద్రోహం చేశానని....

ఆదిగులు, బాధతో మంచం పట్టాను. మీకుచేసిన అన్యాయానికి భగవంతుడే నాకుశిక్ష విధించాడేమో. ఎంత అందంగా వుండేదాన్నని మురిసి పోయానో, ఎంత సుకుమారినని పొంగిపోయానో, మసూచికం పడి లేచేసరికి మారి పోయాను. చిత్రవధని అనుభవించాను శర్మా! నా తల్లితండ్రుల సంతోషం కోసం పెళ్ళి చేసుకున్నాను. కాపురాని కెళ్ళిన తరువాత తెలిసింది. ఆయన అసలు రూపం. ఆయనకులేని దురల వాటంటూ లేవు.

తెచ్చిన, డబ్బంతా, పేకాటకి పోసే వారు. తాగివచ్చి నన్ను చితకబాదేవారు. అలాంటప్పుడు మీ జ్ఞాపకాలు మనసుని పలకరిస్తూ వుంటే సంతోషంతో భరించే దాన్ని. రెండు సంవత్సరాలు చితగ్గొట్టి వదిలేశారు ఈ శరీరాన్ని. ఇక నాకు జీవించాలనే ఆశలేదు. కానీ, ఒక్క కోరిక మిగిలిపోయింది. కడసారిగా మిమ్మల్ని చూసి శాశ్వతంగా ఈ లోకాన్ని వదిలేస్తాను. అందుకే బయలు దేరి వస్తున్నా. ఈ అభాగ్యురాలికి దర్శన మిస్తారా శర్మా?

ఇట్లు,
కస్తూరి.

ఎవరీ కస్తూరి ??. అర్థంకాక కవరు మీద ఎడ్రస్ చూశాను.

ఎ. కె. శర్మ విశాఖ-4, వాల్తేరు ఆర్. యస్. అని వుంది.

వీధి,. యింటి "నెంబరులేని" ఎవరి ఉత్తరమో నాకిచ్చేశాడు పోస్టుమన్.

ఎలాగైనా యిది ఆ వ్యక్తికి అందాలి. లేకుంటే ఒక నిండుప్రాణం బలైపోతుంది. ఆ వ్యక్తి ఆదరిస్తాడో? తృణీకరిస్తాడో ? !

నేనైతే ఏం చేసేవాడిని ???

ఆలోచిస్తూ వెనక్కి తిరిగాను పోస్టుమన్ కోసం.

★ ★

రైల్లో ఒక ఆసామీ మరొక ఆసామీతో :- "మిమ్మల్నింతకుముందు ఏదో వూళ్ళో చూసినట్టు గుర్తు."

రెండో ఆసామీ :- "చూసే వుంటారు. నేను చాలా కాలంగా ఏదో వూళ్ళో వుంటూనే వున్నాన్లెండి."

జ్యోతి

ప్రియమయిన వొదినకు,

కుశల ప్రశ్నలనంతరం వ్రాసేది: నాకు రీసెర్చి ఫెలోషిప్ వచ్చింది. ఈ లెక్చరర్ వుద్యోగం వొదులుకొని ఫెలోషిప్‌తో యూనివర్సిటీలో చేరా లనుకుంటున్నాను. ఫెలోషిప్ విలువ నెలకు మూడు వందల రూపాయలు. నీకు తెలియ గలందులకు వ్రాశాను. అది వస్తూ,మతిమరపునుతీసుకొచ్చింది. నా మతిమరపు గురించి వ్రాసేముందు మా ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్ గురించి వ్రాస్తాను.

ఒకరోజు మా ప్రొఫెసర్‌ని, ఆయన స్నేహితుణ్ణి వొకరు డిన్నరుకి పిలిచారు. మా ప్రొఫెసర్‌కి పాత బ్యూక్ కారొకటుంది. 'సంసారం' సినిమా లోని బాలసరస్వతి కారులా మధ్య మధ్య ఆగిపోవటం దానికి అలవాటు. ఆగితే కొంతదూరం తోస్తేనేగాని కద లదు. డిన్నరు రోజునఆయన, స్నేహితునితో కారులో బయలుదేరాడు. బయలుదేరిన కాస్సేపటికి ఆగిపోయింది. మా ప్రొఫెసరు స్నేహితుడు కారు దిగి తోయటం మొదలు పెట్టాడు. కాస్త దూరం పోయిన తరువాత కారు తిరిగి స్టార్టయింది. అంతే, తిన్నగా వచ్చి అతిథి యింటి దగ్గర ఆగింది. కారు దిగి దానిని నెట్టిన స్నేహితుడు దారి లోనే వుండిపోయాడు. ఆయన దారిలో వుండిపోయినట్లు అతిథి యింటి దగ్గర జ్ఞాపకం వచ్చింది మా ప్రొఫెసర్‌కి. తిరిగి వెనక్కి-పోయి క్షమాపణ చెప్పుకున్నాడట.



ఆయన సంగతలా వుంచు, ఆయన మేధావి. మతిమరుపుతనం ఆయనకు చెల్లింది. కాని, జీవితంలో అభివృద్ధిని ఆశించే నాలాంటి వాళ్ళకు మతిమరుపు తనం అనర్థకం కదా? సరే, అసలు విషయం వ్రాయనీ. ఆ రోజు మూడో అవర్ బి. యస్సికి ఇనార్గానిక్ క్లాసుంది. రెండో అవర్ జరుగు తుండగా ఫెలోషిప్ గ్రాంట్ అయినట్లు తెలిసింది. కొలీగ్సు అభినందనలలో గంట విన్పించింది. క్లాసుకి పోదామని ఎడమచేతిలో ఎటెండన్సు రిజిస్టరు, కుడిచేతిలో డస్టరు పట్టుకుని సుద్ద ముక్కల కోసం వెతుకుతున్నాను. ఒకటి రెండు నిమిషాలు గడిచాయి కని పించలేదు.

"ఏంవిటి వెతుకుతున్నారు; కొత్తగా

రెండవ బహుమతి రూ. 25

పి. వి. సత్యప్రసాద్,
[యమ్. ఎస్ సి., రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వ విద్యాలయ కళాశాలలు, విశాఖపట్నం-3.]

చేరిన డిమాన్‌స్ట్రేటర్ నిరంజనం అడిగాడు.

"చాక్ పీసెస్"

"మీ చేతిలోనే వున్నాయిసార్"

వ్యంగ్యంగా మళ్ళీ అతనే అన్నాడు. అక్కడవున్న నలుగురూ నవ్వారు. అవి యెడమచేతిలో రిజిష్టరు కింద ఉన్నాయ్. బయటకు పోతుండగా 'అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్' అని యెవరో అంటే మిగిలినవారు నవ్వటం వినిపించింది. సిగ్గుగా ఫీలయ్యాను.

ఆ క్లాసులో చెప్పాల్సిన పాఠం 'గంధకం.' అటెండన్సువేసి, బోర్డు మీద Sulfur అనివ్రాశాను. విద్యార్థులందరు పగలబడి నవ్వుతున్నారు. గొడవగావుంది. స్పెల్లింగు తప్పు రాశానని భావించి నవ్వుతున్నారని. 'వియ్‌కెన్ ఏజ్‌వెల్ Sulphur అని అన్నా విడివిడిగా అక్షరాలు నొక్కి పలుకుతూ. అయినా నవ్వులాగ లేదు.

"వాట్ మేడ్ యూ లాఫ్?" క్లాసు మొత్తాన్ని వొకసారి చూశాను.

ఓ క్షణం నవ్వు లాగాయి.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పెండ్యులమ్ మాలతి విలబడింది. ఆ క్లాసులో యిద్దరు మాలతులున్నారు. ఇద్దరూ రెండు జడల మాలతులే, ఈ మాలతి నడుస్తుంటే ఆమెరెండు జడలు పెండ్యులమ్స్‌లా వూగు తుంటాయి. అందుకని ఈమెను 'పెండ్యులమ్ మాలతి' అనటం మాకు (లెక్చరర్సుకి) అలవాటు.

అందరిరోకి ఈవిడ కాస్త తెగువయినది. తీరయినది. కొద్దిగా అలజడి రేగి మరో క్షణంలో నిశ్శబ్దం ఆవరించింది.

నత్తిగా "అ అ అదికాదు సార్.... మి మీ.... మిరు బోర్డు మీద ...." అంటూ బోర్డు వైపు చూపింది. వెనక్కి తిరిగి చూశాను.

మళ్ళీ అందరూ నవ్వారు

ఆశ్చర్యం! బోర్డుమీద నే వ్రాసిన అక్షరాలు లేవు. చేతిలో సుద్ద ముక్కబదులు కలం వుంది. కలంతో బోర్డు మీద వ్రాసినట్లుగా అప్పటికి అర్థమయింది.

ఆ రోజు పాఠం పూర్తయిందని పించాను అసంతృప్తిగా.

ఇంత మతిమరపయితే రిసెర్చి యెలా చేస్తానో అని సంశయంగా వుంది. అయినా నీ ఆశీర్వచనాలతో త్వరలోనే డాక్టరేటు పొందగలనని ధైర్యంగా వుంది.

చిరంజీవి జయసేనకు దీవెనలు. అన్నయ్యకు నీకు నమస్కారాలు. వెంటనే జవాబు వ్రాయ కోర్తాను.

నీ మరది,

పరమహంస.

తా॥ క॥ ఈ జాబుని మీ చెల్లెలు సునీతకు చూపించకు.

హంస.

***



రైలు చాలా వేగంగానే కదులుతోంది. నా మదిలో ఆలోచనలు అంతకంటే వేగంగానే కదులుతున్నాయి. ఐనా అంత అర్జంటుగా రమ్మని నాన్నగారు ఉత్తరం ఎందుకు వ్రాసినట్లు? మొన్ననే కదూ తను వెళ్ళివచ్చింది. మళ్ళీ ఇంతలోనే ఏమి రాచకార్యాలూడి పడుంటాయి? ఏదైనా ప్రమాద మయినదే జరిగితే టెలిగ్రాం ఇచ్చి ఉండేవారు కదా! మనసును కుదుట పరుచుకుంటూ కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాను. రైలుతోపాటే వేగంగా కదులుతున్నట్లుండే చెట్లను. ఆ ప్రకృతి దృశ్యాలను చూస్తుంటే కనీసం వాటిని వర్ణించడానికన్నా నే నొక రచయిత్రిని ఎందుకు కాలేక పోయానా అని కోపం వస్తూంటుంది.

నా ఆలోచనల్లో నే నుంటే వెనుక నుంచి ఎవరిదో కంఠం వినిపించింది: "చూడమ్మా! ఆకిటికీ తలుపు కొంచెం వేస్తావా" అంటూ! ప్రత్యేకంగా కిటికీ ఎక్కడ ఉందో ఎంచుకుని కూర్చున్న నన్ను కిటికీ మూయ మనడంతో చిరాకు వేసింది. 'వెయ్యను' అని చెబుదామని వెనక్కి తిరిగి చూశాను. ఆవిడ కూడా నా వైపు నవ్వుతూ చూచింది. మర్యాదస్తురాలి లాగానే ఉంది. 50 ఏళ్ళు ఉంటాయేమో అని అంచనా కట్టేశాను నేను. 'చూడమ్మా! నువ్వు కూడా ఒంటరిగానే ఉన్నట్లున్నావు. కాసేపిలా కూర్చో. ఏమీ తోచడంలేదు. ఏవైనా కబుర్లు చెప్పుకోవచ్చు' అందావిడ ఎంతో పరిచయమున్నట్లు. నాకూ అలా కూర్చోటం బోర్‌గనే ఉంది. పైగా ఆవిడ మాటను కాదనలేక వెళ్ళికూర్చున్నాను. "ఎక్కడిదాకా వెళుతున్నావమ్మా నువ్వు?" చెప్పాను. ఓ. ఐతే మనిద్దరం వెళ్ళేది ఒక ఊరికే నన్నమాట. "మా అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడు అక్కడ". అడక్కుండానే చెప్పిం దావిడ. "నీ పేరేమిటమ్మా?" అడిగిందావిడ. "సుమిత్ర." "మీ అత్తారి దేవూరు?"

ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను నేను. ఏమిటీ చొరవ అనిపించింది. కనీసం పెళ్ళయిందా అనన్నా అడక్కుండా అత్తారి దేవూరు అని అడిగేస్తుం దేమిటి? ఐనా నన్ను చూస్తుంటే పెళ్ళి అయిన దానిలా కనిపిస్తున్నానా! ఒక్కసారి నన్ను నేను పరిశీలనగా చూసుకున్నాను. వాచ్

రెండవ బహుమతి రూ. 25

ఎస్. స్వరాజ్యలక్ష్మి,
ఫైనల్ బి. ఎస్సి., (సి. బి. జడ్)
ఎ. ఎన్. ఆర్. కాలేజీ, గుడివాడ.

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థుల నిమిత్తం "చిన్నచిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైనస్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందని రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరం లేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా: ఎడిటర్, "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2."

8. రూ. 50లు ప్రథమ బహుమతి. రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.


రిపేరికి ఇవ్వటంవల్ల రెండు చేతులనిండా గాజులు వేసుకున్నాను. జడలో పువ్వులు నిండుగా ఉన్నాయి. బొట్టూ, కాటుకా మామూలే. ఏదో మామూలు చీరే కట్టుకున్నాను. మెడలో ఒక గొలుసు ఉంది. దాన్ని పమిట లోపల వేసుకున్నాను. బహుశా అందువల్లే ఆవిడ పొరబడి ఉంటుంది. సంసారం చేసేవాళ్ళు తప్ప చదువుకునే వాళ్ళు అలా తయారవరని ఆవిడ ఉద్దేశ్యమేమో! అయినా ఏమీ ఆలోచించకుండానే అలా ప్రశ్నలు వేసేస్తుంటే జవాబుల చెప్పలేనిది నేనేనా అనిపించింది. ఐనా నాకు చిన్నప్పటి నుంచి చిన్నచిన్న అబద్ధాలు చెప్పి అందరినీ ఏడిపించటం ఒక హాబీ.. (ఎవరికీ ప్రమాదం కలిగించనివి మాత్రమేసుమండీ!) అదే చిలిపికోరిక ఇక్కడా ఉదయించింది. ఆవిడ పెదవికం అందుకు వ్యతిరేకత చూపుతున్నా నోటికి వచ్చినపేరు చెప్పేశాను ధీమాగా 'కాకినాడ'అని. "మీనాన్నగారిపేరేమిటి? ఏం చేస్తుంటారు?" అడిగిందావిడ. అదిమాత్రం కరెక్టుగానే చెప్పేశాను.. నాన్నగారిపేరు వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడింది దావిడ. నావైపు పరీక్షగా చూసింది. మొహం ప్రక్కకు తిప్పి ఊరుకున్నాను. 'ఇప్పుడు మీ పుట్టింటికి వెళుతున్నావా' అంది ఆవిడ నవ్వుతూ! 'అవునండీ' అన్నాను వినయంగా! కాసేపు ఆవిడ మొహంలో ఏదో ఆలోచన కదులాడింది. 'ఏమైనా చదువుకున్నావమ్మా' అని అడిగింది కాసేపు వూరుకుని. "ఆ! ఏదో వానా కాలం చదువులెండి. సెకండ్ ఫారం

ప్యాసయ్యాను. తరువాత నాకిష్టం లేక నేనే మానేశాను" అన్నాను. నేను చదివే బియ్యేస్సీ చదువు ఓ పెద్ద చదువని అనుకోకపోయినా నా అబద్ధాలకు నాకే నవ్వొస్తోంది. నా మట్టుకు నేను చాలా సిన్సియర్‌గా, ఆవిడ నమ్మేట్లుగానే జవాబులు చెబుతున్నాను అనుకున్నాను గాని ఆవిడ మాత్రం నాకేసి ఏదో అనుమానంగా చూస్తున్నట్లు అనిపించింది. అంతలోకి స్టేషనే వచ్చేసింది. "మరి వెళ్తానమ్మా! మళ్ళీ కలుద్దాం!" అందావిడ. మీ పిచ్చిగాని మనం మళ్ళీ ఎందుకు కలుస్తాములే అని మనసులో అనుకుని నవ్వుకున్నాను నేను.

తీరా ఇంటికి వచ్చాక అసలు కారణం తెలిసింది. మా నాన్నగారు నాకు అర్జంటుగా పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారని. పెళ్ళికొడుకు వాళ్ళు నాన్నగారికి చాలా తెలిసిన వాళ్ళట. ఈ సంబంధం తప్పకుండా ఖాయమవుతుందని అమ్మ, అన్నయ్య అనుకుంటుంటే వినబడుతోంది. నాకు పెళ్ళంటే పెద్ద ఇష్టమూ లేదు. అయిష్టమూ లేదు.

అన్నయ్య వుడికించే మాటలనూ, చెల్లాయి హాస్యంగా నవ్విస్తుంటేనూ వింటూ చాలా తాపీగా హాజరయ్యాను పెళ్ళి చూపులకు. చూడగానే ఆకర్షించే విగ్రహమే అతనిది. మెల్లగా ప్రక్కకు మళ్ళించాను చూపులను. ఒక్క సారిగా గతుక్కుమన్నాను. ప్రక్కన నవ్వుతూ కూర్చుని వుంది ఆవిడ. సాక్షాత్తు ఆవిడే. మళ్ళీ కలుద్దాం అన్నమాటను ఇంత త్వరగా నిజం చేస్తుందని నేను అనుకోనే లేదు. నా ముఖం పాలిపోయింది. ఈ సంబంధం కాకపోతే మానె. నాకేమీ నష్టంలేదు. కాని ఆవిడ అలా నవ్వుతూ నా ఎదురుగా కూర్చుని వుంటే నా వంటి నిండా తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్లయింది. ఆవిడ అతనితో మెల్లగా ఏదో చెబుతోంది. అతను అడుగుతున్నాడు. పేరేమిటి? ఏమి చదువుతున్నారు? ఎక్కడ చదువుతున్నారు? అని. చెప్పాలనిపించలేదు. కాని ఎదురుగా నాన్నగారు వున్నారు. మరి అన్నీ నిజాలే చెప్పాల్సి వస్తోంది. ఈ పెళ్ళి జరగదనే నాకనిపించింది. తల దించుకుని కూర్చున్నాను. నాన్నగారు లోపలకు వెళ్ళమ్మా అనగానే ఒక్కసారి అతని వైపు చూచి లోపలకు వచ్చేశాను. ఆ కళ్ళు నన్ను చూసి నవ్వుతున్నట్లనిపించింది. "అమ్మాయి నచ్చింది. మరి ముహూర్తం పెట్టించండి." ఆవిడకంఠం వినిపిస్తోంది. ఆశ్చర్యపోయాను నేను. ఐతే, ఐతే ఆవిడకు నా మీద దురభిప్రాయం లేదన్న మాట. వెళ్ళేముందు ఆవిడలోపలకు వచ్చింది. 'క్షమించండి' అన్నాను ఇంకే మనాలో తెలియక. "మీ నాన్నగారి పేరు చెప్పగానే నువ్వెవరో నాకు తెలిసింది. అయినా నాది పొరబాటే. పెళ్ళయిందా అని అడక్కుండానే మిగతావన్నీ అడిగేశాను. ఇంతకూ మావాడు నీకునచ్చాడా!" అంది ఆవిడ నవ్వేస్తూ! సిగ్గుతో తల దించుకున్నాను. అప్పటినుంచీ నా హాబీని మాత్రం మానేశాను.

***



అతిపరిచయం

అడవిలో దూరంగా గర్జన వినబడింది నక్క ఉలికిపడి తలెత్తి చూసింది—మబ్బు పట్టిందేమో ఉరుముతోందేమో అని.

కాని ఆకాశం అద్దంలా నిర్మలంగా వుంది. ఇంతలో మళ్ళీ గర్జన వినిపించింది నక్క ఆ ధ్వని వచ్చిన దిక్కుగా నడిచింది. దూరాన సింహం కనబడింది.


ఆ అడవిలోనే పుట్టి పెరిగిన నక్క చిన్నప్పటనుంచి సింహాన్ని గురించి వినడమేగాని చూడలేదు. ఈ సింహం ఇవాళే ఇంకొక అడవినుంచి ఇక్కడికి వచ్చినట్టుంది.

దాన్ని చూడగానే నక్క హడలిపోయింది. తోక ముడిచి వచ్చిన దారినే వెనక్కి పోయింది.

మర్నాడు సింహం మళ్ళీ కనిపించింది. నక్కకు భయం వేసిందిగాని, నెమ్మదిగా తమాయించుకుంది. పరకాయించి చూసింది. 'అదీ మనలాంటి జంతువే కదా; భయందేనికి' అనుకుంది. కాసేపు చూసి తన దారిన తాను పోయింది.

మూడో రోజున సింహం సెలయేటిలో నీళ్ళు తాగుతూ కనిపించింది. ఈసారి నక్కకు భయం వెయ్యలేదు సరికదా—సరాసరి మృగరాజును సమీపించింది. భుజంమీద తట్టి "ఏం మేష్టారూ! కులాసాగా వున్నారా?" అని అడిగింది.

"అతి పరిచయంవల్ల అనాదరం" అన్నారు మరి.



ఎలకప్ప

ఒక ఎలుక, ఒక కప్ప స్నేహం చేశాయి. ఆ రెండూ కలిసి సులభంగా ఆహారం సంపాదించుకునేవి. ఒకరెక్కువ సంపాదించినా, మరొకరు తక్కువ సంపాదించినా, సమానంగానే పంచుకునేవి.

ఉన్నట్టుండి కప్పకు దుర్బుద్ధి పుట్టింది. "మనిద్దరం ఎంతకాలంగానో స్నేహంగా వుంటున్నాము. మన స్నేహానికి గుర్తుగా నీకాలు, నాకాలు కలిపి కట్టేసుకుందాము. అప్పుడు మనిద్దర్నీ చూసినవాళ్ళంతా 'ఎలకప్పా!' అని పిలుస్తారు. మన మనస్సులు వేరైనా శరీరాలు ఒకటేనంటారు. ఏమంటావ్?" అంది. ఎలుక అమాయకంగా సరేనంది. కప్ప తన కాలు, ఎలుకకాలు కలిపి కట్టేసింది.

ఆ తర్వాత కప్ప ఎలుకను ఆ మాటా ఈ మాటా చెబుతూ కొలను వద్దకు తీసుకువెళ్ళింది. ఒడ్డుదాకా వెళ్ళి గభాలున నీటిలో దూకింది. ఎలుక ఉక్కిరి బిక్కిరై చనిపోయింది. కప్ప నీటిలో హాయిగా ఈదుతోంది.

కాని, కాసేపటికి ఎలుక మృత కళేబరం నీటిలో తేలింది. దాన్ని పైన ఎగురుతున్న డేగ చూసి రివ్వున వచ్చి తన్నుకుపోయింది. ఒక దెబ్బకు రెండు పిట్టలన్నట్టు దానితోపాటు కప్పకూడా వచ్చింది. డేగ చెట్టుమీద వాలింది. ముందు కప్పని పొడిచిచంపి, తిని, ఆకలి తీర్చుకుంది. ఎలుకను తీరుబడిగా ఆ రాత్రికి తిన్నది.

ప్రతి క్రియకు ప్రతిక్రియ వుంటుంది. చేసిన ద్రోహం ఊరికేపోదు; వెనక్కి తంతుంది.



అనుకోని ఆపద


ఒక దుప్పికి చిన్నప్పుడే ఎప్పుడో ఏదో ప్రమాదంలో ఒక కన్ను లొట్టపోయింది. అందుచేత అది తా నున్న అడవిని వదలిపెట్టి నెమ్మదిగా సముద్ర తీరం చేరుకుంది.

అక్కడ బాగా గడ్డీ గాదం పెరిగిన చోటు చూసుకుంది. గుడ్డి కంటిని ఎప్పుడూ సముద్రంవేపే వుంచేది. అటునుంచి ఎవరూ రారుగదా; వేటగాళ్ళైన రైనా వస్తే నేలవైపు నుంచే వస్తారు. అందుచేక నేలవైపు మంచి కన్ను వుంచి మేతమేస్తూ వుండేది,

ఇలా చాలారోజులు సుఖంగానే గడిచాయి. నేలవైపు నుంచి ఏ దుష్ట జంతువైనా, వేటగాడైనా వస్తున్నట్టు పసిగట్టగానే పారిపోయేది, అందుకవి ఈ ఉపాయం బాగానే పనిచేస్తున్నట్టు భావించేది.

కాని, ఒకనాడు ఆ సముద్ర తీరానికి ఒక ఓడ వచ్చింది. అందులో దొంగ సరుకును రవాణా చేసేవాళ్ళు వచ్చారు. వారిలో ఒకడు దుప్పిని చూశాడు. విల్లు ఎక్కుపెట్టి బాణం వేశాడు. అటువైపు గుడ్డి కన్ను మాత్రమే వుంచిన దుప్పి అదేమీ చూడనే లేదు. బాణం తగిలి చనిపోయింది.

అందుకే "ఆపద లెప్పుడూ అనుకోని వైపునుంచి వస్తా"యని పెద్దలు చెబుతారు.



నీవు నేర్పిన నడకయే నీరజాక్షి!

ప్రకృతి మనోహరంగా వుంది. సముద్రంలో అలలు ఎగిరెగిరి విరగబడి పోతున్నాయి, చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. చెట్లమీద పక్షులు కూస్తున్నాయి.

తల్లిపీత, పిల్లపీత బీచిలో షికార్లు చేస్తున్నాయి.

శ్రీమతి పీత ఉన్నట్టుండి ఆగింది. కుమారి పీతను చూసి, ముక్కుమీద వేలేసుకుని, చిరాగ్గా ఇలా అంది. "అమ్మాయ్! ఏమిటా వంకరనడకా నువ్వూను? తిన్నగా నడవలేవూ? పెళ్ళీడొచ్చిందిగదా, ఇలా నడిస్తే ఎవడు చేసుకుంటాడు నిన్ను?!"

పీతాబాల తల్లి వంకచూసి నవ్వుతూ "అమ్మా! తిన్నగా నడవడం ఎలాగో చూపించవే! అలాగే నడుస్తాను!" అంది.



మనసు చెప్పిన కథ

తల్లావఝ్ఝల పతంజలి

క్రొత్త ఇంట్లో పాత సంసారాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంలో ఉన్నాను. ఉన్నవూరికి దూరంగా, తెలిసిన మనుషులకి ఎడంగా క్రొత్తప్రాంతంలో పెద్ద ఊళ్ళోనే అడుగుపెట్టినా ఎందుకో ఇద్దరం ఏకాంతంగా ఉన్నామన్న అనుభూతి పోలేదు. చుట్టూ ఉన్నప్రపంచం కంటే ఓ మెట్టుపైనో కిందో, మొత్తానికి దాంతో సంబంధం లేని చిన్న మరో లోకంలో విచిత్ర ఏకాంతవాసం. కనీసం మా అనుభూతి, మొదటిరోజే పొయ్యి రాజెయ్యడం మన కిష్టంలేదు.

"పోనీ హోటల్నించి తెప్పిస్తాను, ఏం ?" అనేశాను.

"ఎందుకండీ ? చేసుకుంటే ఏం పోతుంది ?"

అసలు సిసలైన భార్య అనవల

సిన మాట తను అనేసింది. "మొదటి రోజే ఈ పొదుపెందుకులే?" మొత్తానికి ఆమె శ్రమ పడ్డం ఇష్టం లేకపోతేనేమి, నాకు బజారు వెతుక్కుంటూ వెళ్ళి సరంజామా తేవడానికి బద్ధకం వల్ల అయితేనేమి ఓ ఉడిపి వంటవాడి హస్తపాకం ఆరగించాం.

బడలిక వల్లా, ఏవో ఆలోచనల వల్లా, అన్నిటినీ మించి క్రొత్తస్థలం తాలూకు ఓ క్రొత్తదనం - వెరసి బద్ధకం, నిద్ర ఇత్యాదులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి నన్ను. లోపల సవరిస్తున్న సామాను మధ్య [illegible] యతో మెల్లగా జోకొడుతున్నాయి. నిశ్శబ్దంగా సమిధ వెలిగించి వేసుకున్నాను. తను వచ్చింది. మాట్లాడే ఓపిక ఇద్దరికీ ఉన్నట్టు తోచలేదు.

సగం సగం సర్దిన సామానుల మధ్య, విశాలమైన గదిలో మంచాలు పరుచుకుని నిద్రారంభం చేసే ప్రయత్నాలు ఆరంభించాం. నాతో ఏవో కబుర్లు చెపుతూనే మెల్లగా కళ్ళు మూసుకుని త్వరలోనే సుషుప్తిలో మునిగిపోయింది నళిని. రెండు మూడు సార్లు పిలిచి ఊరుకున్నాను.

నాకు నిద్ర తాలూకు మగత తప్ప నిద్ర వచ్చే సూచనలు కనబడ్డం లేదు. వోర్లా పడుకుని ఏదో ఆలోచిస్తూ ఆమె వైపే చూస్తున్నాను....

పెళ్ళై రెండు ఏళ్ళు దాటిపోయింది. అప్పుడే ఆమె ముఖంలో వివాహిత యొక్క ఓ విధమైన గాంభీర్యం, ఏదో హుందాతనం వచ్చాయి: చలాకీ తనం, చిలిపి తనం ఎటువటే మటు మాయమయిపోయి, బాధ్యతలు బరువును పుంజుకోక ముందే. ఆమెను చూడగానే, బరువు బాధ్యతల కోసం సంసిద్ధపడినట్టే కన్పిస్తుంది. బడలిక వల్ల మొహం కించిత్ వాడిపోయి ఉంది. సుఖ సుషుప్తి వల్ల దీర్ఘంగా ఆమె నిట్టూర్పులు విడుస్తూ తాత్కాలికంగా ఈ చరాచర ప్రపంచపు టంచులను దాటి వెళ్ళిపోయింది. .... కళ్ళ కింద లేతగా, సన్నటి నలుపు ప్రసరించింది. శ్రమపడిన తరువాత ఓ విధమైన వింత సౌందర్యాన్ని ప్రదర్శిస్తారు ఆడవాళ్ళు. ఎందుకో చిన్న నవ్వు నా పెదవులమీద నిలిచింది. మెత్తగా, సున్నితంగా చేత్తో ఆమె ముంగురులను పైకి నెడుతూ కపోలాలను స్పృశించాను. ఆలోచనలు, భావనలు ఎక్కడి వక్కడే కరిగిపోయాయి. నా కళ్ళు కూడా మెల్లగా మూతలు పడ్డాయి. అలాగే చెయ్యి ఆమె మీదకు జారవేసి, నేనూ నిద్రలో మునిగిపోయాను.

* * *

మెలకువ వచ్చి చూసేసరికి చెయ్యి ఖాళీ మంచంమీద విశ్రాంతి తీసుకుంటోంది. బరువుగా రెప్పలను ఎత్తి చూశాను. చుట్టూ అప్పుడే పరిశుభ్రంగా ఎక్కడి వక్కడ అన్నీ సర్దేసి ఉన్నాయి. మెల్లిగా లేచి కీళ్ళను ఓసారి కిర్రుమనిపించి, బొంగురుగా పిలిచాను. కాఫీ కప్పుతోసహా ఎదురుగా వచ్చి నిలుచుంది నళిని.

"అయిందా నిద్ర?"

ఏ సెప్పుడయింది?"



"ఓ అరగంట కింద."

"అవున్లే. నీకు నిద్రా భద్రా ఎందుకు? అసలు ఓ పెద్ద స్లైజు మెషిన్ని పెళ్ళి చేసుకున్నాను."

"పాపం" నవ్వేసిం దామె.

బాగా సాయంకాలం అయిపోయింది. నిద్ర విడిచిన ఉత్సాహం, బద్ధకం రెండూ మొహాన్ని, ఆలోచనల్ని చుట్టేశాయి. ఒంటరిగా బయలుదేరాను. కోలాహలం. రిక్షా గంటలు. పక్షం కిందటి పళ్ళను, తాజావని కొనమని ఆహ్వానాలు. మొలతాళ్ళు, రిబ్బన్లూ వగైరాలు కేవలం ప్రజలకు దానం చేస్తున్నట్టుగా భావిస్తూ గొంతు చించుకోవడం—అన్నిటి మధ్యనుంచీ చొక్కా మీద వలసినంత దూళి పేరుకోగా, ఓ గ్రంథాలయం తాలూకు చెరిగిపోయిన బోర్డు చూసి లోపల ప్రవేశించాను. పేపరు చదువుతూ కూచున్నాను. వెనక కిటికీలోనుంచి వాడీ, వేడి తగ్గిన సూర్య కిరణ పుంజాలు సున్నితంగా చెవుల మీదనుంచి బుగ్గలను తాకుతున్నాయి. పేపరు మడిచి కూచున్నాను. చుట్టూరా నిశ్శబ్దంగా ఉంది. గదిలో ఇద్దరు ముగ్గురికంటే లేరు. నా యెదుట కుర్రవాడు గుణించుకుంటూ పిల్లల బొమ్మల భారతం పారాయణ చేస్తున్నాడు. మరొకాయన 'అశ్వమేధానికి' సంబంధించిన బొమ్మలను గమనిస్తున్నాడు.

ఆఫీసులో రేపు మన దర్శనం ఇవ్వాలి. వీలైతే మరో వారంరోజులు నిద్రపోదామని ఉంది. పరిచయాలూ, స్నేహితులూ లేని ఊరు అరణ్యం లాగ ఉంది. అన్ని వందల మొహాలలో గతంలో [illegible] మొహం ఒక్కటీ కనుపించదు. మెల్లగా కళ్ళు మూసుకుని, చేతులు కట్టుకుని అనవసర యోచనా సమాధి గదిలో ప్రవేశించాను....

ఒక్కసారి, చటుక్కున శరీరానికి చిన్న కంపం కలిగింది. బద్ధకం రెక్కలు వచ్చినట్టయి ఎగిరిపోయింది. మెదడులో, ఆలోచనల్లో ఒక్కసారి చిలికినట్టయింది. చప్పున కళ్ళు తెరిచి ఓసారి గడియారంవేపు చూశాను. ఆరున్నర దాటిపోయింది.

శారద ఇక్కడే ఉంది.... అవును. కనీసం ఇక్కడే ఉన్నట్టు జ్ఞాపకం. ఉదయంనుంచీ గుర్తు రానందుకు నన్ను నేను శపించుకున్నాను. ఆమె పేరు గుర్తుకు రాగానే ఇంతవరకూ చెవులనూ, ఆలోచనలనూ వేధిస్తున్న కోలాహలాభరిత లోకం నా నుంచి వేల మైళ్ళు దూరం పారిపోయింది. అనిర్వచనీయ భావ తరంగాలు నన్ను వశపరుచుకున్నాయి. ఇదమిత్థంగా నేను ఆమె గురించి గానీ, ఆమె జీవితం గురించిగానీ ఏమీ ఆలోచించడం లేదు.

కానీ నాకు తెలియకుండా మనసు పాత జీవితంలోకి సాగిపోయింది. ఓ ఆలోచన - భావపుంజాలు - గట్టిగా ఇదని నేను చెప్పలేను. ఆనందం? ఏమో. ఏదో, మొత్తానికి ఏదో కావాలనుకున్న ఆలోచన - మనః పరిధుల నుంచీ దూరం కాకూడదని కోరుకునే ఓ నిబిడ భావ వితతి. ఏమి అనుకుంటున్నానో నాకు తెలియదు. ఆ అనిర్వచనీయ

యోచనా సమాధిలోనే స్థాయిగా ఉండా లనిపిస్తోంది.

వెచ్చటి ఆలోచనలు, మనస్సునీ, మెదడునీ సంపూర్ణంగా వశపరుచుకున్నాయి. మనిషినిర్వచించలేని అనుభవాలను వెలువరించే సాధనం ఉంటే బాగుండును. గుండెలోని ఈ తియ్యటి అనుభూతి సంబంధమైన సాంద్రతను కొలిచే సాధనం ఉంటే బాగుండును. ఏదో, చేతినుంచి జారిపోయిన అనుభవం, దూరంఅయిన భావన, మళ్ళీ ఒకనాటి అధికారం, తద్వారా అహంకార సమ్మిళితమైన ఆనందం, బాధ కూడా — అన్నీ సన్నటి మబ్బు తెల్లా నన్నూ మనస్సునీ సున్నితంగా పెనవేసుకుపోయాయి. నేను పూర్తిగా లోబడిపోయాను. ఆలోచనలను దూరం చేసుకుందామని ప్రయత్నించలేదు. అలాగే కూచుని, కళ్ళు మూసుకుని నాకు తెలియని. చెప్పలేని వెచ్చటి భావపరిధుల్లో ఉండిపోయాను. ఎందుకో నాకు ఆ లోకం నుంచి బయటపడా లనిపించలేదు; ఇష్టంలేదు.

శారద .... అదే .... నేను పేరు తప్పించీ, నిజానికి ఆమె రూపం కూడా జ్ఞప్తికి తెచ్చుకోవడంలేదు. ఆమె పేరు, దానితోపాటు సహస్ర అనుభూతి పరంపరలు నన్ను ఆ పైన ఆలోచించ నీయకుండా చేసి వేస్తున్నాయి. శ్రమించి నా మనసు కూడా మరేమీ గుర్తు చేసుకునే ప్రయత్నమూ చెయ్యడంలేదు. కల—భావన—ఊహ— అన్నీ!

బాగా చీకట్లు పరుచుకున్నాయి.

నేను లేచేసరికి బొమ్మల భారత పారాయణ ముగించి కుర్రవాడు ఎటో పారిపోయినా, అశ్వమేధ సోమయాజి మాత్రం అతి జాగ్రత్తగా, ఆశ్చర్యకరమైన శ్రద్ధతో అటూ ఇటూ బొమ్మలను తదేకంగా పరిశీలిస్తున్నాడు. లేచి బయటకు నడిచాను. వీధులనిండా దీపాలు వెలుగుతున్నాయి. కాళ్ళు పెద్దగా నా ప్రయత్నం లేకుండానే గుర్తు చేసుకుంటూ ఇంటివేపు నడిచిపోతున్నాయి. గుమ్మం దగిరే, నా కోసమే కాబోలు ఎదురువస్తూ నళిని కనిపించింది...

"నయమే. ఇల్లు గుర్తుంచుకుని మనింటికే వచ్చారు. మరో ఇంటికి ఉడాయించారు కారు — రండి, దయ చెయ్యండి"

నవ్వుతూ లోపలకు అడుగు పెట్టాను—వెనకాల తలుపు వేసిన శబ్దం అయింది.

* * *

ఉదయం, ఇంకా ఆఫీసు గడప తొక్కకుండానే ఎప్పుడు ముగుస్తుందా అని ఆలోచించేస్తూ, స్నాన యజ్ఞం, భోజనయజ్ఞం, వీడ్కోలు వేడుక, వగైరా రెండేళ్ళనుంచీ అలవాటయిన ఆనవాయితీ తోరణాలను దాటుకుని, రిక్షా యెక్కి— దానికంటె ముందు ఆలోచనలతో ఆఫీసువేపు బయలుదేరాను.

పని చేయించే బాధ్యత తప్పించి, చెయ్యవలసిన అగత్యం లేకపోవడంతో మళ్ళీ నన్ను ఆలోచనలు ముసురుకున్నాయి.

మా అవసరాలకు నాన్నగారి జేబు ఎన్నడూ అభ్యంతరాలు రాకపోగా, అమ్మ మమ్మల్ని వెనక్కు వేసుకొచ్చే ఆసరా ఉండగా ఎన్నడూ బరువు బాధ్యతల బాధలు తలపుకు రాని భూత కాలంలో నేను బి. యే. వెలగపెడుతుండే వాణ్ణి. ఇంట్లో, బయటా కూడా వలసినంత స్వేచ్ఛ. స్వాతంత్ర్యం ఎన్నడూ నాముంచి దూరం కాలేదు. అప్పుడూ, ఇప్పుడూ కూడా.

నాన్నగారు, పిత్రార్జితానికి మరి కొంచెం కలపడం వల్ల స్వగృహం అంటూ ఒకటి ఉండేది మాకు. మేం కాక మరో ఒక మాదిరి సైజు కాపురం ఉండ తగ్గదిగా ఉండేది — ఎప్పుడూ ఏదో ఒక పోరుగు....సరిగ్గా ఎప్పుడు బి. యే. లో చేరేనో ఇంకా మర్చిపోక ముందే, మూడేళ్ళు మమ్మల్ని వెనక పడవేసి గబగబా ముందుకు సాగిపోయాయి. పరీక్ష గట్టు కీడ్చిం తరువాత పై చదువు సమస్య చర్చించడంతోనే సగంపైగా కాలం వ్యర్థం అవడం వల్లా, తరువాత అమ్మ అభ్యంతరాల వల్ల సగం, వగైరా చిల్లరకారణాలన్నీ కలగలసి మన యం. ఎ. విద్యాభ్యాసం ఓ సంవత్సరం వెనక్కూ ముందుకూ ఊగి, చివరకు వెనకే ఆగిపోయింది — కాబట్టి చూడవలసిన వ్యవహారాలు లేక పూర్తిగా ఖాళీగా ఉండిపోయాను.

ఇంకా మూడు నెల్లు గ్రీష్మం ఉందనగానే, ఏదో స్నేహితుడి పెళ్ళికని చల్లగా నాన్నగారికి నచ్చ చెప్పవలసిన బాధ్యత అమ్మమీద వదిలేసి జారుకున్నాను. పెళ్ళిపేరున నాలుగైదు రోజులూ ఇంటినీ పరిసరాల్నీ మర్చిపోయి, నూతన వధూవరుల్ని ఏకాంతానికి వదిలివేసి ఆఖరికి మిత్రబృందం అందరం తిరుగుముఖం పట్టాం.

చాలాకాలంగా అప్పటికే కారణాంతరాల వల్ల పక్క భాగానికి వేసి వున్న తాళం అదృశ్య మవడం చూస్తూ మెల్లగా లోపలకు అడుగు పెట్టాను. చెప్పిన, ఒప్పుకున్న, కాలం కంటే ఆలస్యంగా వచ్చిన కారణాలు సాధ్యమైనంత వరకూ ఊహించి చెప్తుతూ, స్నానం ముగించుకుని, చెవిలో తేమను తువాలుతో తుడుచుకుంటూ ఇంట్లోకి అడుగు పెడుతూ ....

"అమ్మా, నాన్న ఉత్తరం రాసేరేమ్."

ఎక్కడ నుంచో ఆడగొంతు అందులో అమ్మాయి కంఠస్వరాన్ని నా చెవులు వెంటనే పట్టేశాయి. ఒక్క క్షణం నుంచుని గబగబ లోపలకి వెళ్ళాను.

పచ్చడి కలుపుతూ అన్నాను. "అమ్మా, పక్కన ఎవరైనా చేరారా ?"

"ఆ. ఆయనకు ఏదో — అదేం ఉద్యోగం చెప్మా..." తన జ్ఞాపకశక్తిని తిట్టుకుంటూ అంది అమ్మ.

"ఎప్పుడూ కేంపుల మీద ఉంటార్ట. నువ్వెళ్ళిన రోజే చేరారు. చాలా మంచి కుటుంబం."

నిజానికి నాకు వారి కుటుంబం మంచి మర్యాదల మీద కన్నా, నా చెవులు విన్న కంఠస్వరం తాలూకు యజమాను

రాలు ఎవరనే ఉత్కంఠే ఎక్కువగా ఉంది. కానీనిశ్శబ్దంగా భోజనంముగించి ముందు హాల్లో ఏదో పుస్తకం తెరచి కూచున్నాను.

"అమ్మా, నే కాలేజీకి పోతున్నాను."

మళ్ళీ అదే స్త్రీ కంఠస్వరం పారా హుషార్ వినిపించింది. చదువు పేస్తున్న నా ఏకాగ్రత చెదరి కకావికలై పోయింది. చిన్నగా ఓ సారి దగ్గి వరండాలో వెళ్ళి నిలుచున్నాను. అప్పుడే, రోజారంగు బట్టల్లో ఉన్న ఓ తెల్లటి మధ్యరకపు పెత్తు ఆకారం నాకళ్ళ చివరల్ని దాటి వెళ్ళిపోయింది. ఏదో సుగంధ పరిమళాల్ని మాత్రం నాసికా పుటాలకు అందించి. మళ్ళీ చదువు... మొత్తానికి వరసగా రెండు రోజులామెను నేను చూడ్డం జరగలేదు. నే హాల్లో ఉండగా అమ్మ కంఠం పక్కనే కిలకిలమనే నవ్వు తాలూకు శబ్దం, ఇంట్లో కూర మాడిపోతోందనో, స్నానానికి పోతున్నాననో అందచేసే పారాహుషార్లు తప్పించి, నాకు ఆ అశరీరవాణి దర్శనం కాలేదు. కానీ పొరపాటున కూడా అమ్మతో ఆ మాట నేను ఎత్తలేదు.

నేను వచ్చి వారం గిర్రున వెళ్ళి పోయింది. హఠాత్తుగా, పదకొండు గంటల తరువాత ఉదయం అశరీరవాణి వినిపించింది, ఏదో హిందీ పాటను పునః పలుకుతూ. వెంటనే కళ్ళు క్యాలెండరుమీదకి పోయాయి. ఆదివారం! ఎందుకో ఆనందం...గబగబా వెళ్ళి మొహం కడుక్కుని. సరిగ్గా తల దువ్వుకుని వచ్చి మళ్ళీ పక్షం క్రితమే వదిలేసిన పుస్తకం పట్టుకుని కూచున్నాను. అమ్మ వంటింట్లో ఉంది. తెలియకుండానే పుస్తకంలో మునిగిపోయిన నన్ను మళ్ళీ అశరీరవాణి మేలుకొల్పింది.

"ఏం చదువోనండీ. ఫైనలియరన్న పేరేగానీ అన్ని సబ్జక్టులు మరిచిపోయాను. అర్మ అవును గానీ మనకి సొజ్జప్పాలు చేసి పెడతానన్నారు. మాటదాటేయకండి — నాకు గుర్తుంది లెండి " కిలకిలలు

చదువు చాలానే ఉంది. నాకు పుస్తకం మీద ఏకాగ్రత ఎన్నడో మపి అయిపోయింది.

"చూడమ్మా శారదా! హాల్లో టేబిలు మీద కొత్త పత్రిక ఉంది, పట్రా,"

అమ్మకి మనసులో తొలిసారిగా. చాలాసార్లు నమస్కారాలు పెట్టాను. ఎవరో వ్యక్తి వస్తున్న ఛాయలు కనిపించాయి. చీర తాలూకు గరగరలు.... చటుక్కున వెళ్ళి టేబిలు ముందు నుంచుని, సొరుగు గాలించడం ఆరంభించాను. గాజుల చప్పుడు గుమ్మం దగ్గిర ఆగిపోయింది. సొరుగు మూసి వెనక్కు తిరిగాను.

"పత్రిక....." ఒకటి రెండు క్షణాలు తటపటాయించి సున్నితంగా అడిగిందామె.

"ఆహా — తీసుకోండి" నవ్వుతూ ఆమెకు అందించి, అచేతనంగా

కుర్చీలో కూచుండి పోయాను శారద! మంచి పేట తెల్లని ఆకారం అనంతాకాశం విరిగి కిందపడ్డా పరుచుకోగల కళ్ళు—మెత్తదనం తియ్యదనం కాదుగానీ మళ్ళీ ఓసారి వినాలనిపించే కంఠస్వరం వెరసి ఆమె

రోజులు గడిచిపోతున్నాయి పెద్దగా చనువు ఏర్పడకపోయినా శారద మొదట్లోలాగ నా తాలూకు ఛాయలు కనిపిస్తే అదృశ్యమవడం లేదు కంఠస్వరం మాత్రం తగ్గుతోంది నేను కూడా సాధ్యమైనంత వరకూ అమ్మ మాటలమధ్య స్నానాల గదివేపు వస్తూనో వెడుతూనో ఏదో ఒక ఛలోక్తి విసిరి మరీ వెడుతూండేవాణ్ణి

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది లేచి బయటకు వెళ్ళి కాంటీన్ కాఫీ తాగి వచ్చి కూచున్నాను తలంతా బరువుగా ఉంది బద్ధకంగా కదలడానికి ఇష్టంలేని స్థితిలో ఉన్నాను వచ్చిన రెండు మూడు కాగితాలు చూసి అవసరమైన హుకుం జారీ చేసి మళ్ళీ కుర్చీలో జారగిల బడ్డాను

జీవితంలో కొన్ని కొన్నిటిని కొన్ని కారణాలవల్ల చూస్తూనే పోగొట్టుకుంటూంటాము తెలిసి చేజారిన పెన్నిధిని చూస్తే బాధగా ఉంటుంది కానీ చెయ్యి దాటిన తరువాత విలువను గుర్తించిన వేదన వర్ణనాతీతం మనసుకి సంబంధించిన ఓ విధమైన బలహీనత భయం ఇత్యాదులు కళ్ళయెదుట కనుపించే విషయాల్నే దాటవేస్తాయి

పునశ్చరణ చేసుకున్న త రు వా త, కలిగే బాధకంటే సరిగా ఆలోచించి గమనిస్తే ఓవిధమైన గర్వమే మిగులు తుంది

నాకు సంబంధించి నంతవరకూ సరిగా ఇలాగే జరిగింది. ఆశించడం మన వంతు, ఆశ పెట్టడం మనవంతు. కానీ వీటన్నిటి కంటే ముఖ్యమైనది మరొకటున్నదన్న సంగతి నేను తర చుగా విస్మరించాను. స్త్రీ ల కు సంబం ధించి నంతవరకూ నేను పెంచుకున్న ఆలోచనలుఅదోలా, ఉండేవి. విలువైన వాటివేపు ఆశగా చూడ్డం మానవ సహ జం. కనీసం 'సహజ' మానవ సహ జం. అందమైన ప్రతిస్త్రీ వేపు క ళ్ళు పెద్దవి చేసుకుని చూచినంతగా, చేరు వకు వచ్చినపుడు చొరవ చెయ్యడం అంత సులభం అనుకోను.

రోజులు గడిచిపోయాయి. బాగా పరిచయం, దాంతో పాటు మనం గమ నించ కుండా పెరిగే చనువు అన్నీ వలసినంతగా వృద్ధి అ య్యా యి. ఆయన చాలా మర్యాదస్తుడు. నె ల అంతటికీ ఓ వారంకంటే సంసార సుఖం ప్రసాదించలేదు ప్రభుత్వం ఆ య న కి. నిత్య కార్యక్రమంతో ఊరూరా తిరుగుతూ కా ల క్షే ప ం చేస్తూండేవాడు.

అమ్మ ఇచ్చిన చొరవవల్ల అయితే నేమి, శారద ప్రార్థనవల్ల అయితేనేమి ఆమెకు నేను గురుత్వం వహించక తప్పలేదు. రోజూ ఆమెకంటే నే ను శ్రద్ధగా పైపుకల్లా సిద్ధంగా ఉండేవాణ్ణి. పాఠాలు ఆరంభించి, సగం కాకముందే కబుర్లతో మిగతాకాలం పూ ర్తి అవు తూండేది. పాఠాలు, శిక్షకుల్ల ఆల వాట్లు- కాలేజీని చాలాకాలంగా పట్టుకు పీడిస్తున్న మాకు తెలిపిన దుష్టశక్తులు వగైరాలు మాత్రమే మా ప్ర స ం గ సారాంశాలుగా తరచుగా ఉ ం డే వి. ఎందుకో, తనలో, నేను చాలా తెలివి గల వాడిననే నమ్మకం పూ ర్తి గా ఏర్పడిపోయింది. నా మేధ మీదా, తెలివిమీదా ఆమెకెందు కంత అచంచల మైన విశ్వాసం కుదిరిందో తెలియదు గానీ, తన్ను తాను నాతో పోల్చుకుని తరచుగా కించ పరచు కుంటూండేది. "నీకేం తెలివి గల వాడివి....", సహ జంగా, మొదటినుంచి ప్రతి విషయాన్నీ చమత్కారంగా చెప్పే అలవాటున్న నన్ను_ నేను ఎప్పుడు మాట్లాడుతున్నా, కదిలించకుండా, అ డ్డు రా కు ం డా, కొంచెంగా నవ్వుతూ శ్రద్ధగా వినే దామె. నా మనోనేత్రాలు మాత్రం ఆమె కళ్ళల్లో మెరుపునూ, నవ్వుతున్నపుడు పెదవుల దగ్గిర వంక రలు తిరిగే సున్నిత మైన గీతలను తదేకంగా గమనిస్తుం డేవి..కళ్ళు తెరచి ఎన్నడూ తనని నేను సూటిగా చూడలేదు.

పాఠం చెపుతూ రెండు మూడు క్షణాలు అప్రయత్నంగా నా చూపులు ఆమె విశాల నేత్రాలలోకి జొరబడినా, అక్కడి చురుకు దనం, వాడిదనం మళ్ళీ వెనక్కి తరిమేసేవి. కను రెప్పలు నిస్సహాయంగా టకటక లాడి, చెపుతున్న వాక్యం మధ్యలోనే....

"ఏం మేస్టారూ దెక్కొట్టేసింది!" చిలిపిగా అన్నదామె.

"పట్టిక ?" కళ్ళు చూపులూ మాత్రం మళ్ళీ ఆమె నేత్ర సముద్రంలో మరి మునగ లేదు.

పాఠాలు చెబుతున్నాను; ఆమె వింటోంది. చనువుగా, తెచ్చుకున్న కోపంతో ఆమెను మందలించాను; ఆనందంగా ఆమె విదిలించేసింది: ఛలోక్తులు విసిరాను, ద్విగుణీ కృతమైన మెరుపుతో, చురుకుతో నాకు తగలగా అనుభవించాను — చూపులను మాత్రం మళ్ళీ ఆ విశాల నేత్రాల తాలూకు ఒరిపిడికి బలి చెయ్య లేదు; లేక, చెయ్య లేక పోయాను. కళ్ళు ఎత్తి సూటిగా, బహుశా ఆమెను చాలా తక్కువసార్లు చూసి ఉంటాను. తల వంచుకున్నా, చూసినా చూడక పోయినా, లేక తను నన్ను చూడక పోయినా నా కళ్ళముందూ, మనస్సుముందూ శారద మాత్రం నవ్వుతూ నిలిచి పోయింది. చనువు పెరిగినా, పరిచయం నలిగినా, నా కళ్ళూ చూపులూ మాత్రం ఆమె పెద్ద కళ్ళ కాట్లను భరించలేదు. అందువల్లే బహుశా నా చూపులు ఆ కళ్ళలోని భావాలన్నీ చదవలేక పోయాయి. నా కళ్ళు ఆమె నేత్రాంచలాల్లో స్ఫుటంగా కనుపిస్తున్న అందమైన కాంతిరేఖల్ని వెతుక్కోడంలో పూర్తిగా ఓడిపోయి గాయపడ్డాయి. మనసునిండా శారద; ఆలోచనలన్నీ ఆమెవి; ఒక్క నా చూపులు తప్ప— అప్రయత్నంగా కూడా అవి నన్ను ఏమరిచి పారిపోలేదు ...

* * *

అతని పేరు గుర్తు చేసుకుంటూ, కొద్ది శ్రమతోనే ఇల్లు గుర్తించాను. సాయంకాలం గడిచి పోయింది. కళ్ళు నలువైపులా చూస్తూండగా ఓ అందమైన చిన్న ఇంటి ముందు తటపటాయిస్తూ నా కాళ్ళ జత ఆగిపోయింది.

ముందుగేటు తోసుకుని చిన్న తోట లాటి ప్రదేశం మధ్యనుంచీ వరండాలో అడుగు పెట్టాను. ఎందుకో శరీరం యావత్తూ జ్వర చిహ్నాలు పొడచూపినట్టుగా వెచ్చగా అయింది. నరాలన్నీ వింతగా, బలంగా లాగి పట్టినట్టు అనుభూతి పొందాను. లోపల్నుంచి ఎవరిదో పాదాల శబ్దం వినబడింది. గుండె ఢక్కుమంది ఒక్కసారి — ద్వారంవేపే సన్నని సవ్వడి పాకివస్తోంది — శరీరం కొంచెంగా జలదరించింది; రెప్పలు టప టప మన్నాయి. ద్వారానికి వేలాడుతున్న తెరకింద నుంచీ ఓ జత పాదాలు కనుపించాయి.

తలఎత్తి చూశాను — వ్చ్!

"అమ్మగా రున్నారా?" గొంతులో ఏదో మార్పు స్పష్టంగా నా చెవులకే క్రొత్తగా వినబడగా, ఎదుట నుంచున్న పనిపిల్లను అడిగాను.

"బాబుగారు అమ్మగారు సినిమా కెళ్లారండి_ఒస్తే ఏం చెప్పమంటారు?"

అతిథులనూ, ఆగంతకులనూ ఆహ్వానించడానికి అలవాటు పడ్డట్టున్న ఆమె మాటలు నా సమస్యల్ని సగం ఛేదించాయి. మొత్తానికి యిల్లు కనుక్కున్నాను. వార్త వినగానే నరాలన్నీ సడలిపోయాయి. నీరసంగా ఆమెవేపు చూశాను. పేరు చెప్పి వెళదా మను

కున్నాను. వెంటనే ఎందుకో ఆ ప్రయత్నం ఆపేసి "ఏం వద్దులే — మళ్ళీ వస్తా"నని గేటువేపు నడిచాను. గేటు దాటుతూండగా తలుపు వేసిన శబ్దం విన్నాను.

కొత్త పరిచయం. స్నేహం చేసుకుందామనే ఉద్దేశంతో అనుకుంటాను, ఆగి ఆగి మాట్లాడుతున్న ఓ ఇద్దరు పక్కిళ్ళ తాలూకు మధ్య వయసు గృహిణుల సంభాషణలను అనిష్టంగా వింటూ, అనుకోకుండా వచ్చిన నన్ను పూర్తిగా కళ్ళు ఎత్తకుండానే చూస్తున్న నళిని చూపులను తప్పించుకుంటూ, నిశ్శబ్దంగా మేడమెట్లు ఎక్కి, గదిలో పడక కుర్చీలో నీరసంగా వాలిపోయాను.

* * *

గుండెమీద చెయ్యి వేసుకుని గట్టిగా శారద అంటే నాకే అభిప్రాయం ఉందో ఎక్కువగా నేను ఆలోచించలేదు. నా మనసు ఒప్పుకోలేదు. ఇంకా చెప్పాలంటే భయపడింది. చర్మానికీ, మాంసానికీ సంబంధించిన కొన్ని అనివార్య అవసరాలకు అందమైన పేర్లు ఏవో పెట్టి నన్ను వంచించుకోవడం నాకు ఇష్టంలేదు. కానీ తదాలోచన ఏ మూలో నా మనస్సులో పాకినప్పుడు మాత్రం వెన్నుమీద చరచినట్టయి ఆత్మవంచన కుపక్రమించాను.

శారద బావుంటుంది — తెలివి తక్కువది కాదు. అయినా చర్మానికీ, మేధకీ సంబంధంలేదు — అక్కడేమో నాకు ఎందుకోగానీ మరో ఆలోచన ఎప్పుడూ రాలేదు. తన అభిరుచులు, ఆశయాలు వగైరాలు నా మనసుకు పెద్దగా పట్టలేదనే చెప్పాలి. మనిషి జీవితంలో జారుడు మెట్లు.... ప్రతి సామాన్యమైన మానవ చర్మానికి సంబంధించిన ఆలోచన. ఆశ. వేడే అప్పట్లో నాకు సోకాయి — నలుగురికీ ఉన్న చర్మ కవచమే మన మాంసాన్నీ, రక్తాన్నీ కప్పి ఉన్నప్పుడు, వాటిమీదకు దాడిచేసే నిప్పు రవ్వలను లేవనుగాని, ఓ మెట్టుపైన ఉన్నామని అనుకోవడం లాటి ఆత్మవంచన — బహుశా సహజమేమో. ఎందుకో ఇంత ఉధృతంగా నాలో చెలరేగిన కోరికల ధాటి ఎన్నడూ పెదాలనూ, మనసునూ, ముఖ్యంగా కళ్ళనూ ఛేదించుకుని బయట పడలేదు. నా లోపలే మిగిలిపోయాయి.

ఈ అనుభవం అసాధారణమైనదీ, అసంభవమైనదీ కాదు. ప్రతి అందమైన కళ్ళ జతా, ముచ్చటైన చిరునవ్వూ సామాన్యులలో రేపే అలజడే కావచ్చును. అయింది కూడా. ఈ నా ఆలోచనలు, ముగింపూ అన్నీ కూడా శారద ప్రదర్శించిన ఒక నాటి వింత ప్రవర్తన ఫలితాలనే చెప్పాలి. నాలో, నా మనస్సులో ప్రభవించిన కెరటాలన్నీ ఆమె కళ్ళకు సంబంధించిన ఒక ఛల్లటి దృక్ప్రసారం. నేనూ, నా మెదడూ ఊహించలేని ఆ విచిత్ర పరిణామం హఠాత్తుగా నేను ఎదుర్కొన్న తరువాత చాలా కాలం ఎందుకో నా మనస్సు కదిలినట్టుగా లేదా, మధ్యతలలో నాకు తెలిసో, తెలియకుండానో ఇమిడి పోయి ఉన్న కల్మషాన్ని బలవంతంగా మనో నేత్రం

ముందు నిలిచింది ఊహను – తరువాత కొంత కాలానికి నేను ఆ వేడి నుంచీ, ఉధృతాన్నుంచీ దాదాపు నన్ను దూరం చేసుకొన్నాను; ఇంకా సరిగ్గా చెప్పాలంటే అవే పారిపోయాయి.

ఎందుకని గానీ, ఎలా జరిగిందని కానీ నేను ప్రశ్నించుకో లేదు; ఊహించనూ లేదు – బహుశా నాకు తరువాత స్ఫురించిన ఒక నిజం సమాధానంగా నిలవడం వల్ల కావచ్చును. సామాన్యమైన అనుభూతులూ, ఆవేశాలూ, వేడీ మనిషినీ మనసునూ సామాన్యంగా బాధించేవీ, చుట్టుకునేవీ, అప్పట్లో వాటి ప్రభావం మన మీద ఉన్నంతగా – కొంత కాలం తరువాత క్రమంగా వాటి వేడినీ, వాడినీ కోల్పోతాయి. ఒకనాటి అనంత కోటి యోచనా శరాలు మన్ని బాధించినా, ఒకప్పుడు శతకోటి ఆలోచనా ప్రవంతులు మనిషిని మునకలు వేయించినా, తాత్కాలిక మైన ఈ అలజడి నుంచి మనసు తేరుకోడానికి ఎక్కువ కాలం పట్టదు.

ఇలాగే జరిగింది సరిగ్గా. జరుగుతుందని నాకు తెలియదు, ఒకవేళ నా హృదయంలో ఏ మూలో నాకు తెలిసినా, మెదడు జ్ఞానేంద్రియాలకు తెలియచేసేంతగా తెలియదనే నా నమ్మకం .. మొత్తానికి ఒక రకమైన శోధనకు గురి అయ్యానని చెప్పక తప్పదు.

చాలా మంది మధ్య తరగతి కుటుంబ ఆర్థిక జీవితానికి సంబంధించిన సమస్యలే, శారద చదువును కూడా ఆ సంవత్సరంతో అంతం చేశాయి. నాకున్న చనువువల్లా, పరిచయంవల్లా ఆమెకు ఇంకా ముందు చదవాలనే కోరిక ఉన్నట్టు గమ



వించడం కష్టంకాదు. స్త్రీ జీవితంలో లేక అమ్మాయిల జీవితాల్లో ఇటువంటి ఒక ముగింపు—ఒక దశకు సంబంధించిన ముగింపు - తరువాత సామాన్యంగా వివాహం, సంబంధాలు వగైరాలు ప్రవేశం, విశ్లేషణ, మన స్థాపం అన్నీ తరచుగా జరిగే విషయాలే.

శారదను చూడ్డానికి ఎవరూ రాలేదు. అంతకుముందే, బహుశా ఆమె చిన్నప్పటినుంచీ, తన అంగీకారంతోగానీ, ఇష్టంతోగానీ, సంప్రతింపులతోగానీ సంబంధం లేకుండా ముడివేయబడ్డ ఈ బాంధవ్యం, శారద జీవితంతో కూడా శాశ్వతంగా ముడివేసే ఆలోచనలు జరిగాయి. ప్రతీ చిన్న పరిణామం నేను అమ్మద్వారానో, శారద తల్లి ద్వారానో వినేవాణ్ని.

శారద పెళ్ళి....నాలో ఏదో తెలియని బాధ—అనే చెప్పాలి. చాలా సంప్రతింపుల తరువాత, మాటల తరువాత, అనుకుంటున్న సంబంధం నిశ్చయించడం, వేగంగా ముహూర్తాలు పెట్టించడం జరిగిపోయింది. నేను మాత్రం నాలో పెరుగుతున్న వింత బాధను గమనిస్తూనే ఉన్నాను .. అతను డాక్టరు. శారదకు కూడా ఈ సంబంధం ఇష్టంలేదు అని నాకు అనిపించలేదు. ఓ రోజు ఆమె అంత పెద్ద కళ్ళనూ సగానికి మూసి, మెల్లగా వరుడి గురించిన వివరాలు చెప్తుంటే, ఆమె కంఠ మార్దవంలో నా చెవులకు తన అంగీకారం స్పష్టంగా ధ్వనించింది.

"మరి నా పెళ్ళికి ఉండవా ?"

హఠాత్తుగా శారద అడిగింది. సమాధానం వెంటనే రాలేదు నా వేపు నుంచి. అంతకుముందే అనేకసార్లు చేసిన ప్రయత్నాల్లో ఒకటి—మరొకటి కలుపుతూ, నేను కళ్ళు ఎత్తి ఆమెను చూడడానికి ప్రయత్నించాను. అనుకోకుండా మరల్చిన ఆమె చూపులు, మళ్ళీ మామూలుగా నా దృక్కులను గాయపరిచాయి ...కనురెప్పలు టకటకలాడాయి.

వింతగా నవ్వుతూ అన్నాను.

"ఎందుకుండనూ ? .... ఉండమంటావా ?"—

నాకు మాట్లాడా లనిపించలేదు.

అప్పుయి వచ్చిన శుభలేఖను చూస్తూ కూచున్నాను నేను. అతన్ని చూడలేదు నేను. ఆమె నోటివెంట వినలేదు. బహుశా వినడం కూడా నా మనసు ఉద్దేశం కాకపోవచ్చును. నేను అడగలేదు; శారద చెప్పలేదు. ఆమెలో నాకు మార్పేమీ కనుపించలేదు, నా పరిచయానికి సంబంధించినంతవరకూ, నా కిష్టమైన మార్పును ఆశించానో లేదో నా కయితే తెలియదుగానీ, తెలిసినంతవరకూ మార్పు లేకపోవడాన్ని మాత్రం నా బెదురు కళ్ళు గమనించాయి — బుర్ర అవగాహన చేసుకుంది.

* * *

భోజనం ముగించి నా చిన్న గదిలో కూచున్నాను. పెళ్ళి దగ్గిర పడ్డంవల్ల పక్క వాటాలో శారద తండ్రి చీరలకు

సంబంధించిన సమస్యలను ఆమెతో తీవ్రంగా చర్చించడం నాకు అస్పష్టంగా వినవస్తోంది. కాళ్ళు మేజామీద బార చాపి, అప్రయత్నంగా ఎదురుగా ఉన్న శుభలేఖ తీసి చూశాను. బంగారు రంగు అక్షరాల్లో వధూవరులపేర్లు గమనిస్తూ అలాగే చాలాసేపు నాకు తెలియని ఆలోచనలు చేస్తూ ఉండిపోయాను. నాన్నగారు ఏదో పార్టీకి వెళ్ళి ఉండడంవల్లా, అమ్మ దొడ్లో ఏదో పనిమీద ఉండడంవల్లా నా ఏకాంతానికి భంగం కలగలేదు.

రాత్రి దరిదాపు తొమ్మిది దాటుతోంది. దొడ్డి వసారా లోంచి సరిగ్గా మాటలు వినిపించడం లేదుగానీ మొత్తానికి అంత ఏకాంతాన్నీ, ఆలోచనల్నీ శాపన కంఠం భగ్నం చేసింది


"ఈ రంగా? _ నాకు అదే బాగుందండీ__"

ఒక వేళ నేను అంతవరకూ ఆలోచనా ప్రపంచంలో ఉంటే వెంటనే ఇహంలో పడ్డాను.

సన్నగా అడుగుల చప్పుడు వినబడింది. గుండెలో ఏదో బలంగా కలుక్కుమంది. సవ్వడి వంటింట్లోంచి నా గదివేపు రావడం వినడం తోటే అమిత విశ్వాసంతో నా కళ్ళు గుమ్మం వేపు దృష్టి సారించాయి.

"కూచో." ఎదుటికుర్చీని చూపిస్తూ నవ్వడానికి ప్రయత్నిస్తూ కాళ్ళు టేబిలు మీద నుంచి తీసి సరిగ్గా కూచున్నాను

"ఏవిటి విశేషం?" విజోనికి



మాట్లాడకుండా అలాగే మౌనంగా ఉండాలనిపించినా - తప్పలేదు. కళ్ళు ఎత్తి చూడబోయి, మానుకుందా మను కుంటూండగానే నాకు తెలియని వింత ధైర్యం, చొరవ నన్ను ఆక్రమించు కున్నాయి. మెల్లిగా కళ్లుఎత్తి చూశాను. కను రెప్పలు టకటక మన్నాయి.

అంతకు ముందు నుంచే ఆమె పెద్ద కళ్ళలోంచి వెలువడుతున్న అసంఖ్యాక మైన చూపులు నన్నుచకితుణ్ణి చేశాయి. కొన్ని క్షణాలపాటు ఆమెకళ్ళ లోతుల్లో నా చూపుల్ని పారవేసు కున్నాను- నాకు తెలియకుండానే, సరిగ్గా నా అనుభూతి



విప్పి చెప్పాలంటే మనస్సునూ గుండెనూ భేదించి పరిశీలించినా చెప్ప లేనేమో. గంభీరంగా, లోతుగా, మెత్తగా, తదేకంగా చూస్తున్న ఆమె పెద్ద కళ్ళనిండా సన్నటి నీటిపొరలు కమ్మడం చూశాను. గుండె హఠాత్తుగా ద్విగుణీకృత శబ్దంచేస్తూ, రక్తప్రసా రాన్ని వేగం చేసింది. శరీరం ఉష్ణ తను పుంజుకోవడం, కొద్దిగా కంపించ డం నాకు తెలియకుండానే జరిగి పోయింది. హఠాత్తుగా నా చూపులు పదునెక్కాయి. మరో రెండు క్షణాలు ఆమె కళ్ళలోకి చూస్తూవుండిపోయాను- నీరు నిండిన___ కన్నీటి పొరల్లోంచి వెలువడిన ఆమె చూపులు నాహృదయం అట్టడుగు పొరవరకూ చిలికి, కెలికి వేశాయి. అలాగే చూస్తూ, ఆ అను భూతిని దూరం చేసుకోకుండా ఉండి పోతే బాగుండు ననిపించింది. చటుక్కున ఆమె రెండుచేతులతో ముఖాన్ని కప్పేసుకుంది. వంగినప్పుడు వీపుమీద నుంచి భుజాల మీదుగా కిందికి జారిపోయిన ఆమె నల్లటి జడ మెడవెనక తెల్లటి భాగాన్ని నగ్నంగా వదిలివేసింది. భుజంమీద కాలుతున్న నా చెయ్యి వేశాను బరువుగా.

నాకు ఎందుకో ఆనందాశ్చర్యాల కంటే, తెలియకుండానే అమూల్యమైన వస్తువులకుస్వామిత్వం వహించినప్పుడు కలిగే ఓ విధమైన గర్వం కలిగింది. అయినా, ఆమెను ఎంతోసేపు చూడ లేను. తన హృదయంలో ఏ మూలో నాకు సంబంధించిన భావం ఒకటి దాగి ఉందని ఆ క్షణం వరకూ తోచలేదు.

ఆమె చూపులూ, కళ్ళూ ఎన్నడూ చెప్పలేదు. చెప్పమని నా చూపులూ నిర్బంధించలేదు ఆమె చెప్పినా, వాటిని వెదుక్కుంటూ వెళ్ళి నా చూపులు తన కళ్ళలోకి చొరబడగల వాడిని ఆక్షణం వరకూ ఎన్నడూ సంతరించుకోలేదు

"నేను గుర్తుంటానా?" చాలాసేపటి తరువాత కంఠంలో ఓ విధమైన మార్పురాగా, అడిగిందామె నా కళ్ళ కొసలు తేమబారాయి

"ఊఁ- ఎప్పుడూ"

చిన్నగానవ్విందామె "ఏమో, నువ్వు అసలే మతిమరుపు వాడివి" ఆ మాటల్లోని ఆత్మీయత నా కంటికొసల్లో తేమను ఉధృతం చేసింది. సమాధానం చెప్పలేదు "ఒట్టు?" దించుకున్న నా కళ్ళ కిందకు ఆమె తెల్లటి చెయ్యి కనుపించింది స్వల్పంగా కంపిస్తున్న నా చేతి నామె చేతిలో ఉంచాను తొలిసారిగా నా జీవితంలో ఉద్రేకరహితమైన, ఆవేశ రహితమైన ఓ అపూర్వ మధుర స్పర్శను నా అరచెయ్యి నరాల కంతకూ వ్యాపింప చేసింది వంగి ఆమె తల నిమురుతూ అలాగే ఉండిపోయాను ఎంతసేపు అలా ఉన్నానో తెలియలేదు నాకు అరచేతిలో తన వెచ్చటి చేతి నలాగే పట్టుకుని తేమబారిన కళ్ళతో, నన్ను నేను విస్మరించి ఉండిపోయాను

"నే వెళతాను" బొంగురుపోయిన ఆమె కంఠస్వరం విన్నాను నా గొంతు పెగలలేదు చెయ్యి విడదీయలేదు— తీయాలనిపించలేదు వెడుతూ వెనుదిరిగి చూసిన ఆమె చూపులు పూర్తిగా నా గుండెను పిండుచేశాయి అచేతనంగా కూచుండిపోయాను శారద పరాధీన!

* * *

పెళ్ళి అయిపోయింది ఆమె చూపులూ, రూపూ నా నుంచి దూరం అయిపోయాయి తరువాత ఎన్నో ఏకాంత ఘడియల్లో శారద చూపులూ, మాటలూ దట్టంగా మబ్బులా మనసును కమ్ముకుని నన్నెంత బాధకు గురిచేశాయి నీరు నింపుకొన్న ఆమె పెద్ద కళ్ళూ, ఆమె కంఠం, చూపులూ విపరీతమైన కల్లోలానికి గురిచేశాయి నన్ను చాలాకాలం నా గుండె, మనసూ, మెదడూ వింత కోరికల బాధను తట్టుకొని నిలబడవలసి వచ్చింది నిజానికి ఆమె నాలో వదలి, రేపి పారిపోయిన కోరికల బాధను

"జ్ఞాపకశక్తి పెరగడానికి ఏదో మందు పుచ్చుకుంటున్నానన్నావ్ ఇప్పుడెలా వుంది?"

"ఫర్వాలేదు, కొంతనయమే ఏదో మరిచిపోయినట్టు అప్పుడప్పుడు జ్ఞాపకం వస్తూ వుంటుంది—అదేదో జ్ఞాపకం రాకపోయినా"

మాత్రమే నేను బహుశా ఎక్కువ అనుభవించి ఉంటాను.

నా మనసు కూడా అవునని సమాధానం తరువాత వినిపించింది.

* * *

రోజంతా, ముభావంగా, ఏదో గడిపాను. మళ్ళీ ఎందుకో నన్నొక్కసారి శారదను ప్రథమంగా చూసిన నాటి స్మృతి బాధించింది. ఆమెమీద అధికారం ఉందనే భావం కలగగానే నా ఆలోచనలూ, భావాలూ మరో మార్గం తొక్కాయి. ఆమెను చూడాలన్న కోరిక నన్ను పూర్తిగా స్వాధీనపరుచుకుంది.

ఊరికి ఓ వేపుగా కొత్తగా కట్టిన డాబాల వెనక సూర్యబింబం ధరాగర్భాన్ని కాల్చివేస్తూ ఎర్రగా దిగిపోతోంది. ఓ పక్కన లేత కాటుక రేఖలు మెల్లగా వింత వర్ణాచ్ఛాదితమైన ఆకాశాన్ని ఆక్రమించు కుంటున్నాయి. నీ రెండ మెట్లమీద ఉన్న కుండీల్లో ఏవో ఎర్రటి పూవులమీద అందంగా పడుతోంది. నాకు తెలియని అంతర్గత కంపంతో అనుమానిస్తూ మెట్లెక్కాను. జోళ్ళ శబ్దం వినికాబోలు—"ఎవరూ?" అన్న కంఠం నాకు అతి స్వల్పదూరం నుంచి వినిపించింది. నా గొంతు నుంచి ఇంకా సమాధానం రాకుండానే, ఎవరో లేచిన శబ్దం వినిపించడం, సున్నితంగా ఎదురుగా ఉన్న ద్వారపు తెరను తొలగించడం వెనువెంటనే జరిగిపోయాయి. స్తంభించి పోయి. హృదయం రెండుమూడు అంగుళాలు

కిందకు జారినట్టయి, అవాక్కయి నిల బడి పోయాను.

"శారదా"

"అరె!" ఆమె గొంతు సంభ్రమంగా ధ్వనించింది. అదే స్థితిలో వెళ్ళి కూచున్నాను. తలెత్తి చూశాను. ఆమెలో పెద్ద మార్పేమీ కనిపించలేదు నాకు. కళ్ళనూ చూపులనూ తదేకంగా నావేపు మరల్చి, మాట్లాడ్డం ఇష్టం లేనట్టుగా ఉన్న ఆమెను చూస్తూ నేనే అన్నాను— "అతనేడీ!"

"డిస్పెన్సరీకి వెళ్ళారు—కులాసాగా ఉన్నావా?" కంఠస్వరంలో మార్పును స్పష్టంగా ప్రదర్శిస్తూ బయటపడ్డాయి మాటలు. ఆప్యాయతనీ, మెత్తదనాన్నీ మనసు వెంటనే పసిగట్టగా, సూటిగా చూస్తూ ఉండిపోయాను.

"నిన్ను చూసి ఎన్నిరోజులయింది." మళ్ళీ ఆమె గుండె లోతుల్లోంచి మార్దవాన్ని మూటకట్టుకు తెస్తూ, మెల్లగా వెలువడిన మాటలను వింటూ "ఆ" అని మాత్రం అనగలిగాను.

"పిల్లలా?"

"లేరు. నీకు?"

"ఇద్దరు."


ఆశ్చర్యంతో ఆమె వేపు చూశాను. పెదవులమీద ఒక్క చిరునవ్వు మినహాయించి, ఆ చూపులలో నాకు మార్పేమీ కనుపించలేదు. మళ్ళీ మెల్లగా అందామె.

"నన్ను గుర్తుంచుకుని వచ్చావు గదూ?"

తలెత్తి చూశాను.

"నయమే. మర్చిపోలేదు."

"శారదా." బొంగురుగా అన్నాను. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి. కనురెప్పలు సున్నితంగా ఆ బిందువులను నున్నని ఆమె బుగ్గల మీదకు నెట్టి



వేశాయి. స్వచ్ఛ నీలమణుల్లా మెరుస్తున్న ఆమె కళ్ళు నా చూపులను మరోసారి చెదరగొట్టాయి.

"ఏమిటిలా అయిపోయావు. చిక్కిపోయావు."

దిగ్భ్రమతో ఆమెను చూస్తూ ఉండిపోయాను. ఆమె పెదవులు అందంగా, సున్నితంగా చిరునవ్వుతో వంకరలు తిరిగాయి. ఆమె వాడిన ప్రతి మాటా గుండె ఆఖరి పొరనుంచీ, అట్టడుగు మాంస కణాల మధ్య నుంచీ వెలువడి నన్ను వెర్రివాణ్ని చేశాయి. అచేతన స్థితిలో గట్టిగా ఆమె చెయ్యి పట్టుకుని నొక్కుతూ ఉండిపోయాను. కొంచెంగా నవ్వుతూ ఆమె కళ్ళను కిందకు దించుకుంది. ఆమె కనురెప్పలకింద నుంచీ వెచ్చటి రెండు మూడు బాష్ప బిందువులు నా చేతిమీదపడి, నాళాల్లో ప్రసరించే రక్తాన్ని ఉడుకు లెత్తించాయి.

"శారదా!" పిలుపు నాకే వికృతంగా వినబడింది. ఆప్యాయంగా నా చెయ్యి అలాగే ఉండిపోయింది. శరీరం హఠాత్తుగా నన్ను విస్మరించింది. చటుక్కున ఆమెను దగ్గరగా లాక్కుని పెదవులమీద బలంగా ముద్దు పెట్టుకున్నాను. సరిగ్గా ఏమైందో నా జ్ఞానేంద్రియాలు తెలుసుకునే స్థితిలో లేవు. కానీ కొన్ని క్షణాల తరువాత, ఆమె ముఖంమీదకు దాడిచేసే నా పెదవులు కొంచెంగా చిట్లి, నేను లేచిన సోఫా మీదకు పడ్డాను.

ఒక్కసారి స్పృహలోకి వచ్చి చూశాను ఎదురుగా. స్మృతి హీన లాగ, నిశ్చేష్టురాలై, పెదవులు గజగజ వణుకుతూండగా శారద అలాగే నన్ను చూస్తూ నించుండిపోయింది. నా చూపులు మళ్ళీ ఆమె ముఖంలోకి ప్రసరించాయి. ఆమె పెద్ద కళ్ళలో నేను గమనించిన కాంతి కరిగిపోయింది. ముఖం రక్తారుణిమను పుంజుకొంది. మరోసారి చూశాను. ఆమె చటుక్కున లేచి నిలుచుంది. మైల పడినట్టుగా, అపవిత్రమైనట్టుగా, శరీరాన్ని కొంగుతో కప్పుకుంటూ అందామె.

"సారధీ."

ఏ ఆప్యాయతా, కోపం, బాధా ధ్వనించలేదా పిలుపులో. మాంస, రక్త రహితమైన స్వరపేటిక ఉచ్చరించిన మూడు పొడి మాటలు నా చెవులను తాకాయి. ఆమెవేపు చూశాను. ఆ క్షణంలో ఆమె చూపులు వ్యక్తం చేసిన భావన గుండెను ఫెళ్ళున బద్దలు చేస్తుందని భయపడ్డాను. నా మనసూ, శరీరం దిగజారిపోయిన నీచమైన లోతులను, అసహ్యకరమైన పరిధులూ హఠాత్తుగా స్ఫురించాయి నాకు. మహాపాపి మనసులా__తల వంచుకు కూచున్న నన్ను ఆమె చూపులు కణకణాన్నీ కాల్చి మసి చేస్తున్నాయి. నా గుండె నెర్రెలు తీసినట్టయింది. ఆ క్షణంలో నన్ను తను శపించినా బాగుండు ననిపించింది. అచేతనంగా, చల్లబడిన శరీరంతో, తల భూమిలోకి దించుకుని ఒకే ఒక్క అడుగుతో చూపులు మరల్చకుండా బయట పడ్డాను.

***

మారిన జీవితం

కొడవటిగంటి కుటుంబరావు

(గత సంచిక తరువాయి)

3

ప్రకాశం చేతులు కట్టుకు కూర్చున్నా, వాడి వైపువాళ్ళు ఊరుకోలేదు. వాడి చిన్నాన్న ఒక సంబంధం ఉందని రాశాడు. అలాగే వాడి పెద నాన్న కూతురూ, మేనమామ కొడుకూ, హైదరాబాదులో ఉన్న వాడి తమ్ముడూ, ఇద్దరు బావమరుదులూ ఏవేవో సంబంధాలు సూచిస్తూ రాశారు. వరులు రకరకాలుగా ఉన్నారు—చదువుండి డబ్బు లేనివాళ్ళూ, డబ్బుండి చదువు లేనివాళ్ళూ, హోదా ఉన్నవాళ్లూ, లేనివాళ్లూ, డబ్బూ హోదా కూడా ఉన్న ఒక రెండో పెళ్ళివాడూ (ముగ్గురు కుమార్తెల తండ్రి), పెద్ద చదువులకు పై దేశాలకు పోదామనుకుంటున్నవాళ్లూ. కట్నాలు అందరూ అడిగారు. ఎవరి తాహతునుబట్టి వారడిగారు; ఒక్క రెండో పెళ్ళాయనే పెళ్ళి గుట్టు చప్పుడు కాకుండా జరగా లన్నాడు.

కొందరు పిల్లను చూడటానికి వచ్చారు, కొందరు వస్తామని రాలేదు. ఒక సంబంధంవాళ్ళు మటుకు పిల్లను తెచ్చి తమకు చూపించమన్నారు; చూడవలసిన బలగం చాలా ఉందిట. వాళ్ళ ఉత్తరం చూస్తూనే ప్రకాశం, "ఇటువంటి దగుల్బాజీ సంబంధాలు వచ్చినా చెయ్యగూడదు" అన్నాడు. ఆ రాత్రి బండికే పిల్లను వెంట బెట్టుకు పోయి చూపించి, వరుణ్ణి తాను చూసి తిరిగి వచ్చేశాడు. ఆ వరుడికన్న కోతి నయమట. అందుకె వాళ్ళు వాణ్ణి పెళ్ళి చూపులకు పంపి ఉండరు.

మొత్తంమీద లీలను చూడవచ్చిన వాళ్ళు అయిదారుగురుంటారనుకుంటాను. వాళ్ళలో ఇద్దరు ప్రకాశం భార్యకు నచ్చారు. మరొకడి ఆస్తి నచ్చింది. లీలను అభిప్రాయం అడిగితే ఎవరికీ నచ్చని వాణ్ణి ఫరవాలేదని పాస్‌చేసి, మిగతా వాళ్ళను గురించి "నాకు తెలీదు" అనేసింది. బొత్తిగా మతిపోయి ఉంటుంది.

ప్రకాశం సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఒక్కరూ నచ్చలేదు — ఎందుకంటే, అందరూ కట్నాలు బేరం పెట్టినవాళ్ళే. రెండో పెళ్ళాయన కట్నం అడగలేదు. పిల్లను చూడనక్కర్లేదని కూడా రాశాడు. అందుచేత ఆయన్ని చూసే అదృష్టం మాకెవరికీ పట్టలేదు.

పెళ్ళిచూపులకు వచ్చినవారిలో ఒక డికి తప్ప లీల అందరికీ నచ్చింది. దురదృష్టవశాత్తూ పిల్ల నచ్చినవాడు ప్రకాశం భార్యకు అంధరికన్నా బాగా నచ్చినవాడు. అలాటి ఆశాభంగాలు జీవితంలో సాధారణంగా జరిగేవే.

ఇంత హడావుడి జరిగాక లీల పెళ్ళి సమస్య, సామెతలో గొంగళిలాగా వేసినచోటే ఉండిపోయింది.

"దాని కింకా పెళ్ళి ఘడియ రాలేదు లాగుంది" అన్నది ప్రకాశం భార్య.

"అసలు ఆడపిల్లల పెళ్ళి ప్రయత్నం జరగవలసింది ఇలా కాదు" అన్నాడు ప్రకాశం.

"ఎలా జరగాలి?" అన్నాను, తెలుసుకుందామని. అది ప్రకాశాని క్కూడా తెలిసినట్టు కనబడలేదు. ఎవ డైనా సర్వలక్షణ సమన్వితుడు ఎక్కడి నుంచో ఊడిపడి, "అయ్యా, నేను మీ లీలను తప్ప చేసుకోదలచలేదు. నాకు కట్నం వద్దు. సాధ్యమైనంత తక్కువ ఖర్చులో పెళ్ళి చేసెయ్యండి అన్నట్టయితే అది సరయిన పద్ధతి అని ప్రకాశం ఉద్దేశం లాగుంది.

నేను తనపట్ల సానుభూతిగా లేనని తెలిసి ప్రకాశం, "నీ సలహా ఏమిటి?" అన్నాడు.

"దాని పెళ్ళిదానికే వదిలెయ్యి. నువ్వ సలు చిన్నతనం నుంచీ లీలకు, నీ పెళ్ళి నువ్వే చేసుకోవాలని నూరి పొయ్యవలసింది. నీ ఇంటి వాతావర ణమూ, నీ అభిప్రాయాలూ దానికి గోడలాగా కట్టేశావు" అన్నాను.

"బాల్లే ఊరుకోండి! ఎవరన్నా వింటే నవ్విపోతారు. దాని పెళ్ళి అది చేసుకోవటమేమిటి? దానికేం తెలుసు, దాని మొహం? కుండపెంకు మొహం వాణ్ణి చూసి వాణ్ణి పెళ్ళాట్టానికి తన కభ్యంతరం లేదనేసిందిగదా!" అన్నది ప్రకాశం భార్య.

"ఇరవయ్యేళ్ళొచ్చి బియ్యే చదివే పిల్లకు ఏమీ తెలీదంటే తప్పెవరిదై ఉంటుంది?" అన్నాను.

"ఒకవేళ దానికి తెలిస్తేమాత్రం, ఆడపిల్ల తన పెళ్ళి తానెట్టా చేసు కుంటుం దన్నయ్యగారూ? ఎక్కడా లేనిమాటా!"

"మీ మగపిల్లలు రేపు వాళ్ళ ఉద్యోగాలు వాళ్ళు చూసుకోరుటమ్మా, పిచ్చిదానా? ఉద్యోగం చూసి పెట్టమని అమ్మనీ, నాన్ననీ అడుగుతారా? దాని పెళ్ళి అది చేసుకోవటమంటే దాని మొగుణ్ణి అది చూసుకోవట మన్న మాట. పెళ్ళి తంతు మనం జరిపిస్తాం" అన్నాను.

"అది అజ్ఞానంచేత తప్పటడుగేసి గోతిలో పడితే?"

"మనం తెలిక దాన్ని గోతిలోకి తోస్తేనో? ఇంకొకరి పొరపాటుచేత గోతిలో పడటంకన్న ఎవరి పొరపాటు చేత వాళ్ళు గోతిలో పడటం మెరుగు కాదూ? అయినా లీలను రహస్యంగా పెళ్ళాడ మంటున్నానా? సలహా ఇవ్వ టానికీ, మరీ పెడదోవన పడితే ఇవ తలికి లాగటానికీ మనం లేమూ?"

ప్రకాశం భార్యకు నా సలహా ఏ మాత్రమూ నచ్చలేదు. ఆవిడ నా మాట లన్నిటికీ తల అడ్డంగా తిప్పి, "అది జరిగేది కాదులెండి" అన్నది.

జరగదని నాకు మాత్రం తెలీదా? ప్రకాశం అడిగిన దానికి నాకు తోచిన సమాధానం చెప్పాను. అసలు వాడు నా చేత ఈ మాటలు చెప్పించి ఉండ నవసరం లేదు, వాడి విశ్వాసాలను సాగదీస్తే నేను చెప్పినట్టే చేసితీరాలి. తన విశ్వాసాలకు పర్యవసానమేమిటో వాడు ఏనాడూ స్పష్టంగా ఆలోచించ లేదు.

చివరకు, ప్రకాశం భార్య అన్నట్టు, లీలను దానికొచ్చేవాడు వెతుక్కుంటూ రానే వచ్చాడు. అలా అనటంలో అతిశయోక్తి ఏమీలేదు. అటువంటి మనిషి ఒకడున్నాడని కూడా మాకెవరికీ తెలియదు. లీలను పెళ్ళిచూపులుచూసివెళ్ళిపోయిన కుర్రాళ్ళలో ఒకడికి అతను స్నేహితుడు దూరపు బంధువూ అని విన్నాను. అతను గేటు దగ్గిరికి వచ్చి, "ప్రకాశం గారిల్లు ఇదేనాండీ?" అని అడిగితే వరండాలో కూర్చుని ఏదో వారపత్రిక చదువుకుంటున్న లీల సరిగా తలఎత్తి అయినా చూడకుండా, "ఇంట్లోలేరండీ" అన్నది.

ఆ సంగతి తెలుసుకున్నవాడు వెళ్ళిపోక, గేటు తెరుచుకుని లోపలికి రావటం గమనించేసరికి లీల అతన్ని పరీక్షగా చూసింది. ఎరిగినవాడు కాడు, చూసిన మొహమైనా కాదు. అతను వరండా మెట్లమీది దాకా వచ్చి, "ఊళ్ళో ఉన్నారుగద?" అన్నాడు.

"ఏదో పనిమీద బయటికెళ్ళారు. త్వరలోనే రావచ్చు" అన్నది లీల. అతను తనకేసి తెగ చూడటం అది గమనించిందిట. అతను వరండాలోకి అడుగు పెడుతూ, "అయితే వారికోసం వెయిట్ చేస్తాను" అన్నాడు.

లీల తాను కూర్చున్న కుర్చీ ఖాళీచేసి లోపలికి పోబోతూ అతని పేరడిగింది. అతని పేరు కోటేశ్వర్రావు. కూతురు వరండాలో ఎవరితోనో మాట్లాడుతూఉండటం ఆలకించి ప్రకాశం భార్య కిటికీగుండా కోటేశ్వర్రావును చూసి, అతను లీలను చూడటానికి వచ్చాడని అప్పుడే అనుకుందిట! ఒకవేళ అనుకుందేమో — మన మెందుకు కాదనాలి?

ప్రకాశం ఇంటికి తిరిగివచ్చి, కోటేశ్వర్రావు పెళ్ళి చూపులకు వచ్చాడని తెలుసుకున్నాడు. ఆ ముక్క చెవిని పడగానే ప్రకాశం భార్య చప్పున రంగంలోకి వచ్చేసిందట — తన మొగుడు ఎక్కడ రసాభాసు చేసిపోతాడోనని.

జరగవలసిన మాటలు జరిగాయి.

పైచూపులకు కోటేశ్వర్రావు అందరికీ తృప్తికరంగా కనపడ్డాడు. అతనికి

పెద్ద కథ

అందరికీ సేవింగ్సు పథకాలు!

వీరిని చూడండి, మీకే తెలుస్తుంది.

శ్రీ రియాజ్ అహమద్‌కు

జీవితంలో ఎట్లా నడుచుకోవాలో బాగా తెలుసు. దుబారా ఖర్చును తగ్గించి పొదుపు చేస్తే కలిగే లాభాలు ఆయన తెలుసుకొన్నారు. ప్రతి నెలా రూ 100/-ల విలువగల జాతీయ పొదుపు సర్టిఫికేట్లు కొంటాడు. పదేండ్ల తరువాత ఆయనకు నెల 1కి క్రమం తప్పకుండా రూ 180/-ల ఆదాయం వస్తుంది.



శ్రీమతి టి. యస్. సుందరమ్మను

చూడండి. పొదుపరితనం నేర్చుకున్న ఇల్లాలు. ప్రతినెలా క్యుములేటివ్ టైం డిపాజిటు లెక్కలో రూ 10/-లు వేస్తూవుంది. 15 ఏండ్ల తరువాత ఈమెకు రూ 2,800/-లు వస్తాయి. తన కూతురు వివాహకాలం నాటికి ఈ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుంది.



చిరంజీవి తపన్ ఘోష్‌ను

చూడండి. ఈ అబ్బాయికి పోస్టు ఆఫీసు సేవింగ్సు బ్యాంకిలో తన పేరుతో ఖాతా తెరవాలని చాల కుతూహలంవుంది. జేబు ఖర్చు డబ్బులోనుంచి కొంత మిగుల్చుకొని దాన్ని తన పేరులో సేవింగ్సు బ్యాంకు లెక్కలో జమకడుతూ వుంటాడు. చిన్నతనంలోనే పొదుపు చేసే అలవాటు చేసుకొన్నాడు.



ఈ ముగ్గురూ తమ అవసరాలకు తగ్గట్లుగా పొదుపు చేసుకొంటున్నారు

జాతీయ పొదుపు పథకాలు అందరికీ అందుబాటులో వుంటాయి. వీటిని గురించి, ఇతర పొదుపు పథకాలను గురించి మీ పోస్టు ఆఫీసులో అడిగి తెలుసుకోండి.

జాతీయ పొదుపు ఉద్యమ సంస్థ

DA 66/22

పాతికేళ్ళు మించవు. చూడటానికి బాగానే ఉన్నాడు. చాలా సాత్విక స్వభావుడూ, మానమర్యాదలు తెలిసినవాడు లాగా కనబడ్డాడు. బాగా ఆస్తి ఉందిట. బి. యస్సి. ఫస్టుక్లాసులో ప్యాసయాడు. తండ్రిపోయాక చదువుకు స్వస్తిచెప్పి ఆస్తి చూసుకుంటున్నాడు. కట్నం అడగలేదు. లీల తనకు నచ్చిందని చెప్పేశాడు. ప్రకాశం వాళ్ళ అభిప్రాయాన్ని తనకు ఉత్తరంద్వారా తెలియజేయ మన్నాడు. ఈ సంగతులు మాత్రమే చెప్పి కోటేశ్వర్రావు తన అడ్రసిచ్చి శలవు పుచ్చుకున్నాడు.

ఈ సంబంధం రావటం చూసి అందరికన్న సంతోషించినది ప్రకాశం భార్య. ఆవిడ అంతరిక్షయానం ఎక్కిన దానిలాగా పూర్తిగా భారరహితమైపోయి. "ఇంతకన్న మంచి సంబంధం వెయ్యేళ్ళు తల కిందుగా తపస్సు చేసినారాదు. మనచేతుల్లో ఏమీలేదర్రా. ఆ ఘడియవస్తే—" అంటూ ఏమేమో అనేసింది.

ప్రకాశం భారరహితస్థితివి అందుకోలేదు. అంతో ఇంతో తన బరువు పెంచుకుని, వంక లెంచటానికే ప్రయత్నించి ఉంటాడని తోస్తుంది. "ఎవరో పెళ్ళి చూపులకు వచ్చారట. ఎట్లా ఉన్నాడు కుర్రాడు ?" అని నేనడిగితే "ఏదీ, ఇంకా పూర్తి వివరాలు తెలియాలి" అన్నాడు ప్రకాశం నిబ్బరంగా.

లీల నడిగితే తనకేమీ తెలియదన్నది.

"కుర్రాడు చూపులకెట్లా ఉన్నాడు. అదైనా తెలీదా ?" అన్నాను.

"మనిషిలా గున్నాడు." అన్నది లీల.

"అదీ మెరుగే—కోతిలాగా లేదన్న మాట" అన్నాను.

"దానికేం తెలుస్తుం దన్నయ్యగారూ. కుర్రాడు విక్షేపంలా ఉన్నాడు. వంక పెట్టటానికి వీల్లేని సంబంధం. ఆ అబ్బాయిని చూస్తూనే పెళ్ళి చూపులకు వచ్చాడని అప్పుడే అనుకున్నా !" అన్నది ప్రకాశం భార్య. "సంబంధం నచ్చిందని రేపే ఒక ఉత్తరం ముక్క రాసి పడెయ్యండి" అని ఆవిడ ప్రకాశాన్ని హెచ్చరించింది.

"అన్నట్టు అతను రాసిచ్చిన అడ్రసేదీ ?" అన్నాడు ప్రకాశం.

★ ఒకడు స్నేహితుడి ఇంటికి వెళ్ళి ఆరేళ్ళ కుర్రాణ్ణి అడిగాడు : మీ నాన్న ఇంట్లో వున్నాడా ?"

కుర్రాడు లోపలికి వెళ్ళివచ్చి : "మా నాన్నగారు ఇంట్లో లేరని చెప్పమన్నారు."

"అయితే నేను రాలేదని చెప్పు.

ఆ కౌగిలితం ఎప్పుడు చేరిందో ఎలా చేరిందో లీల దగ్గిరకి చేరింది. దాన్ని అది ఎక్కడో భద్రంగా దాచింది. తండ్రి అడిగినమీదట దాన్ని తెచ్చి ఇచ్చింది.

ప్రకాశం దాన్ని ఎగాదిగా చూసి, "కానూరు అగ్రహారమా? ఇది ఏదండ కారణ్యంలో ఉన్నట్టు?" అన్నాడు.

"జిల్లాకు ఒకటి రెండు కానూర్లు ఉండవచ్చు" అన్నాను.

"జిల్లా, తాలూకా, వయా, వేరే పోస్టూ ఇన్ని వున్నాయి ఈ మహా నగరానికి ఏదో దిక్కుమాలిన పల్లెటూరై వుంటుంది. లీల అక్కడ కాపరం ఎలా చేస్తుంది?" అన్నాడు ప్రకాశం. వాడి బరువు చూస్తుండగానే రెట్టింపయింది.

అంత దాకా భారరహిత స్థితిలో వున్నవాడి భార్యకు కూడా కొంత బరువు ఏర్పడసాగింది. అంతరిక్ష యానం ఎత్తునుంచి దిగి వచ్చేస్తున్నట్టయింది.

"మీరు లేనిపోని వంకలన్నీ పెట్టటం మొదలెట్టకండి. నిక్షేపంలాటి సంబంధం!" అన్నదావిడ.

"శాస్త్ర గున్రం కట్టెయ్యి. తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి" అన్నాడు ప్రకాశం.

4

ఏ క్షణంలో ప్రకాశం ఆ మాట అన్నాడో గని. వా దన్నంతా అయింది. చాలా విషయాలు క్రమంగా తెలియ వచ్చాయి.

కోటేశ్వరరావుకు ఒక పెళ్ళి అయింది. నెల రోజులు కాపరం చేసి అతని భార్య పోయింది. అత నిప్పుడు చేసుకోవా లనుకుంటున్నది రెండో పెళ్ళి!

ఈ విషయం హెచ్చుగా ఆందోళన పరిచింది ప్రకాశం భార్యని. లీల ఆశ అంటూ పెట్టుకుని ఉంటే, దానికూడా ఆశాభంగం కలిగి ఉండొచ్చు. రెండో పెళ్ళి వాడనే పాయింటు మీద ఆవిడ కోటేశ్వరరావును వదులుకునే టందుకూడా సిద్ధపడింది.

ఒక నెలరోజులు కాపరం ఒక లెక్కలోది కాదనీ, దాన్ని గురించి అంత ఆందోళన పడనవసరం లేదని నే నావిడికి నచ్చచెప్ప యత్నించాను. "రెండో పెళ్ళివాడు" అన్నమాట ఆవిణ్ణి మహా బాధించినట్టు కనపడ్డది. లీల మనసును కెలికేసది ఆ మాటకాదు. సెకండ్ హాండ్ మొగుడు అన్నమాట. ఎవరి వర్జ్య పదాలు వాళ్ళ కుండటం సహజమేగద.

నన్ను కెలికేమాట "దత్తపుత్రుడు". కోటేశ్వరరావు దత్తు తీసుకున్న వాడే. ఈ సంగతి మొదటే తెలిస్తే నేను, అతను రెండో పెళ్ళివాడని వెంటనే ఊహించి ఉందును. కుర్రవాణ్ణి దత్తు తెచ్చుకునే వాళ్ళు, వాడిచేత బందు పరంలో ఎవతెనో చూసి దాని మెళ్ళో మూడుముళ్లూ వేయించకుండా వదిలి పెట్టరు. వాడికిష్టమున్నా లేకపోయినా; తనకు

కాబోయే పిల్లను చూసినప్పుడల్లా వాంతు లయినా సరే వాడు దాన్ని చేసుకుతీరాలి, చచ్చితీరాలి. ఇంపీరియలిస్టు దేశాల ఆర్థిక సహాయానికున్నట్టే, దత్తతకూ—డా తోకలుంటాయి.


ప్రకాశం వాళ్ళు నా సలహా అడిగి ఉంటే, దత్తుడయినందుకు ఈ సంబంధం వదులుకోమని సలహా ఇచ్చి ఉందును. వాళ్ళు నన్ను అడగాలేదు, నేను ఇవ్వాలేదు.

రెండోపెళ్ళి వాడయినా రానందుకు పరిమితంగా దిగులుపడి, సంబంధానికి మనసును సమాధాన పరుచుకుందామను కుంటుండగా ప్రకాశం భార్య మెదడులో ఇంకో వికారమైన మెరుపు మెరిసింది.

"కుర్రాడి జాతకంలో కుజ దోషం వుంటేమోనండీ. మా పెద్ద మేనమామ కిట్లాగే కుజ దోషం వుండి ఇద్దరు భార్యలు పోయాక, కుజదోషం వున్న దాన్నే చూసి చేశారు. ఎందుకన్నా మంచిదని మూడోపెళ్ళికి ముందు ఆయనచేత అరిటిచెట్టుకు తాళి కట్టించారు!" అన్నదావిడ.

"అఘోరించలేక పోయారు! కుజ దోషమట, కుజదోషం!" అని ప్రకాశం చిందులు తొక్కా—డు.

"దేన్నీ నమ్మకపోతే ఎలాగండీ?



కాస్త ఆ అబ్బాయి జాతకం తెప్పించి ఎవరికన్నా చూపిస్తేగాని నా మనస్సు కుదుటపడదు" అన్నదావిడ.

"వాళ్ళు తప్పుడు జాతకం పంపిస్తే ఏం చేస్తావు? నీ కూతురి జాతకం చూపించకుని దాని ఆయుర్దాయం గట్టిగా వుందో లేదో చూసుకోవటం తేలిక కాదూ?" అన్నాడు ప్రకాశం.

ప్రకాశం భార్య చివరకు ఆ పనే చేసింది. ఆవిడకు కుజదోషం భయం బాగా పట్టుకున్నది. అందుచేత లీల జాతకాన్ని ఒకరి కిద్దరు జ్యోతిష్కు-లకు చూపించింది. ఇద్దరూ లీలది దీర్ఘాయువనే చెప్పారు. ఒకరు సంపన్నుల ఇంటి కోడ లవుతుందని కూడా చెప్పాడు. ఆవిడ ఈ సంబంధానికి లైన్ క్లియ రిచ్చేసింది.

ప్రకాశమే ఇంకా ఎటూ తేల్చుకో లేదు. ఈ సంబంధానికి గట్టి అభ్యంత రం ఏం చెప్పాలో వాడికింకా తట్టనట్టు కనపడ్డాడు. శాస్త్రోక్తమైన పెళ్ళికి అభ్యంతరం చెప్పి చూద్దామని, తనకు మంత్రాలపెళ్ళి ఇష్టంలేదనీ, అందులో తనకేమీ నమ్మకం లేదనీ, కోటేశ్వర రావు వచ్చి ఓ పదిహేను రోజులు పట్నంలో కూర్చుంటే రిజిస్ట్రారుదగ్గిర పెళ్ళి చేద్దామనుకుంటున్నాననీ ఉత్తరం రాశాడు.

తనకు రిజిస్టరు పెళ్ళి అభ్యంతరం లేదనీ, ఆమాట అందామని తననోటి దాకా వచ్చికూడా, ఏమనుకుంటారోనని అనలేదనీ కోటేశ్వరరావు ఉత్తరం రాశాడు.

ఉత్తరం వచ్చిన మూడోరోజుకు అతనే దిగాడు. పెట్టె బేడాతో సహా.

అదే నేనతన్ని మొదటిసారి చూడ టం. మనిషిని చూసి వంక పెట్టటానికి లేదు. నా తల వెంట్రుకలంత మంది దంపతులను చూశాను. ఒకరికొకరు ఈడైనప్పుడు కూడా జోడుగా వుండటం చాలా అరుదు. కోటేశ్వర రావు లీలకు ఈడుగానూ, జోడుగానూ కూడా వున్నాడు.

అతను వచ్చిన రోజే రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళి పెళ్ళి దరఖాస్తు పడేస్తానని ప్రకాశాన్ని వెంటబెట్టుకుని బయలు దేరాడు.

ప్రకాశం భార్య నాతో, "చూడండన్నయ్యా, ఈ అబ్బాయి మీరు రాక ముందు చాలా మాట్లాడాడులెండి. అతని ధోరణి చూస్తే అతనీ పెళ్ళి రహస్యంగా చేసుకుంటున్నాడా అని నాకు అనుమానంగా వుంది. తాను పెళ్ళి ప్రయత్నాలు చేసుకోనవసరం లేదుట. తనవైపున పెళ్ళి కెవరూ రారుట. శుభలేఖలు కూడా అవసరం లేదంటా దేమిటండీ?" అని ఆందోళనతో అన్నది.

"ఇతన్ని గురించి మనకు తెలిసిందంతా ఇతను చెప్పిందేనా? లేక మూడో వాళ్ళ నుంచి తెలిసిం దేమైనా ఉందా?" అని అడిగాను.

"ఏదీ? మీ బావగారు మూడు తరాలు రాశారు. మొత్తం మూడింటికి జవాబు లిచ్చాడు. ఉత్తరాలు ఇంగ్లీషులోనే రాయమన్నాడు సుమండీ. ఇంతలో అతను

రానే వచ్చాడు. మూడో మనిషితో మాట్లాడేటందుకేదీ? అతనివైపు మగ వాళ్ళెవరూ లేరట. జాతకంలో కుజ దోషం వుందా అంటే తనకసలు జాతకమే లేదన్నాడు. ఎంత ఇంగిలీషు నాగరికతైనా కాబోయే అల్లుడి తాలూకు బంధువులతో మాట్లాడకుండానూ, చెందకుండానూ పిల్లనెట్లాయిస్తాం చెప్పండీ. పోనీ, మన సరసనే కాపరం పెట్టేమాటుంటే అతని బంధు వర్గంతో మన కేమిటనుకోవచ్చు. అలా కుదర దుట. పట్నంలో కాపరం పెట్టడట. అక్కడ భూములూ, పుట్రలూ తానే స్వయంగా చూసుకోవాలిట. లీలకు పల్లెటూరికాపరం తప్పేట్టులేదు. అంచే, ఈ సంబంధం అయేట్టుంటే. చెప్పుల్లోకాళ్ళు చెప్పుల్లో వుండగానే పెళ్ళి దరఖాస్తు వేస్తానని బయలుదేరాడు. నన్నెవరో తరుముతున్నట్టుందంటే నమ్మండి. దరఖాస్తు వేస్తే పెళ్ళి మానటానికుండదా?" అన్నది ప్రకాశం భార్య.

చిన్న డిటెక్టివు నవలలాగా తయారవుతున్నది లీలపెళ్ళి. ఈ మిస్టరీలో లీల తల్లి ఊహాకల్పన ఎంతో విజ్ఞయించటానికి నాకాధారం లేదు.

"ఇంతకూ మనకొచ్చిన భయమేమిటి? కీడెంచి మేలెంచటం తప్పు లేదుగా? ఇతను తనపెళ్ళి గోప్యంగా ఉంచుతున్నాడే అనుకుందాం. అందుకు తగిన కారణం ఉండనే ఉన్నది. అతను చేసుకుంటున్నది రెండోపెళ్ళి. మొదటిభార్య పోయింది. రెండోపెళ్ళి క్లుప్తంలో పోవాలనుకోవటంలో తప్పేమిటీ?"

"మొదటి పెళ్ళాం ఒకవేళ బతికే ఉంటే?" అన్నదావిడ.

"ఆ అనుమానం పూర్తిగా నిరాధారమేనని చెప్పగల్ను. అతను తన కదివరకు ఒకపెళ్ళి అయిందని చెప్పక పోతే మనం తెలుసుకోగలమా? అవొక పాయింటు. రెండోపాయింటేమిటంటే పెళ్ళాంమీద పెళ్ళాన్ని చేసుకోపోతున్నవాడు రిజిస్టరు పెళ్ళికి ఎంత మాత్రమూ ఒప్పడు. అందుచేత ఆ భయం మనకెంత మాత్రమూ అవసరం లేదు." అన్నాను.

రిజిష్టరు పెళ్ళి గురించి నేను మరి కొంత వివరించినమీదట నేను చెప్పింది నిజం కావచ్చునని ఒప్పుకుంది. కాని శంక అన్నది ఒకంతట తీరదు. ఒక దారి మూస్తే, మరో దారిన అది లోపలికి వస్తుంది. ప్రకాశాన్ని చూడరాదా? వాడి మనస్సు

★ మంగలి షాపులో ఒకడు గడ్డం గీయించుకుంటూ: "ఆగాగు. గాట్లు పెట్టేస్తున్నావ్."
మంగలి: "భయపడకండి. మా షాపులో గాటుకి అయిదు పైసలు ముదరా ఇస్తాం. ఇప్పుడే ఒహాయన ఎనభై పైసలు పుచ్చుకుపోయాడు"

ఇంకా పెళ్ళి గురించి స్థిరం కానేలేదు ప్రకాశం భార్య ఇంకో అనుమానం లేవదీసింది

తాను పెంపు డొచ్చాననీ, తనకు కట్టుకు పోయినంత ఆస్తీ అదీ ఉందం టున్నాడు గదా అన్నీ అబద్ధా లేనేమో ?

మన కిష్టం లేకపోతే మనమా మాట నమ్మనవసరం లేదుగా ? పెంపు డొచ్చిన వాడికి కొంతైనా ఆస్తి వుంటుంది గద ? ఏ ఆస్తీ పాస్తీ లేకుండా ఇంత చదువుకున్నవాడు ఆ చెక్కుమాలిన కుగ్రామంలో ఎందు కుంటాడూ ? అందులో పట్నం సంబంధం చేసుకున్నాకనైనా అత్తవారి అండన పట్నం చేరాలని గదా వుంటుందీ ? అదంతా అలా వుంచుదాం అతను తనకు పెద్ద ఆస్తి వున్నదని అబద్ధం చెప్పటంలో ఉద్దేశం ఏముంటుందీ ? కట్నం కోరే వాడైతే తన ఆస్తి పాస్తుల విషయమై అబద్ధ మాడినా అర్థం ఉంటుంది అతను కట్నాలూ కానుకలూ అడగలేదే ? అన్నాను

ప్రకాశం భార్య కొంచెం ఆలోచించి నేనన్నమాటలో పాయింటుందని ఒప్పు కున్నది ఆవిడమనసు పూర్తిగా కుదట పడిందని చెప్పలేను గాని కొంతతేలి కన పడ్డ మాట నిజం

తరవాత ప్రకాశాన్ని కదిలించి కోటేశ్వర్రావు గురించివాడిఅభిప్రాయం అడిగాను

హి ఈజ్ నైస్ ఫెలో బుద్ధిమం తుడు సాధువు ఒక్కదురలవాటులేదు అతను క్రిష్టియన్ కాలేజి స్టూడెంటట పట్నమంతా బాగా తెలుసు కాకపోతే పట్నంలో కాపరం పెట్టమంటే ఎంత మాత్రం కుదరదంటున్నాడు నూరెక రాల ఆస్తి సుక్షేత్రమైన మాగాణీ యాభై ఎకరాలుంటుందిట డామిట్ ఇవాళ లక్షలు చేస్తుంది అన్నాడు ప్రకాశం

పల్లెటూళ్ళో వుండటం పట్నం వాసం మరిగిన వాళ్ళకి కాస్త కష్ట మేనే లీల ఏమంటుంది ? అన్నాను

అదేమంటుంది ? నేనీ విషయం అతనితో అంటే కావలిస్తే అక్కడ విసుగెత్తినప్పుడల్లా లీల పట్నం రావచ్చు నన్నాడు ఆరు నెల్లక్కడా ఆరు నెల్లిక్కడా వుంటే సరిపోదా అన్నాడు

పోతే నా అనుమానమే దిగబడింది దత్త పుత్రుడికి రహస్యంగా పెళ్ళి చేసుకునే దమ్మెలా వచ్చింది ?

5

కోటేశ్వర్రావు పల్లెటూరి వాడైనా కూడా ఆధునిక వరుడిలాగే ప్రవర్తిం చాడు అతను లీల పరిచయం చేసు కున్నాడు వెకిలి వేషాలేమీ వెయ్య కుండా దాన్ని టాక్సీలలో షాపింగుకూ సినిమాలకూ తీసుకుపోయాడు సిని మాలమీదా సంగీతంమీదా డాన్సు మీదా లీల అభిప్రాయాలను ప్రమా

ణంగా తీసుకునేవాడు లాగుంది. ఒక సారి మా అందరి ముందరా, "లీల చాలా ఎకాంప్లిష్డ్ గర్ల్. సాధారణంగా అన్ని కళలలో ప్రవేశం వున్న ఆడపిల్లలుండరు" అన్నాడు,

మగవాడిలా ప్రశంసించటం ఏఆడదానికి బాగుండదు!

లీలకు అతనంటే చాలా ఇష్టమేర్పడ్డట్టు నాకేకాదు, ప్రకాశానికీ, వాడి భార్యకూ, కొడుకులకూ కూడా అనిపించింది. వాళ్ళకూడా అతను బాగా చదువుకున్న వాడనీ, చాలా విషయాలు తెలిసిన వాడనీ ఇంప్రెసయారు.


పెళ్ళి గడువు పదిహేను రోజులూ అతను ముళ్ళమీద వున్నట్టున్నాడు. పెళ్ళి ఎంత త్వరగా అవుతుందా అని అతను తొందర పడుతున్నట్టు మిగిలిన వాళ్ళ కనిపించిందిగాని, నా మటుకు నేను అతనిమాట నమ్మాను— తాను త్వరగా స్వగ్రామానికి తిరిగి వెళ్ళాలని అతనన్నాడు.

పెళ్ళి ఇంకా అయిదారు రోజులుందనగా ప్రకాశం శుభలేఖలు వేయించాడు. తనవైపు బంధువులకు తానే శుభలేఖలు స్వయంగా పంపుతానని కోటేశ్వర్రావు ఒక డజను మాత్రం తీసుకున్నాడు. వాటిని అతను పంపే వుండాలి పెళ్ళికి మాత్రం ఇతరచోట్ల నుంచి అతని బంధువులెవరూ రాలేదు.

రేపు పెళ్ళి అనగా కోటేశ్వర్రావు తనబంధువు లెవరో పట్నంలోనే చాకలిపేటలో ఉన్నట్టు చెప్పి, వాళ్ళను ఆహ్వానించి వచ్చాడు. వాళ్ళ కుటుంబం మటుకు పెళ్ళికి వచ్చారు.

రిజిస్ట్రారు ఇంటికి వచ్చి పెళ్ళి జరిపించి వెళ్ళాడు. సాక్షి సంతకాలలో నాదికూడా ఉన్నది.

పెళ్ళయిన సాయంకాలమే ప్రకాశం ఆటే ఆర్భాటంలేకుండా రిసెప్షను జరిపి.



ఓ వందమందికి భోజనాలు కూడా పెట్టాడు. పెళ్ళికానుకలన్నీ లీలకే వచ్చాయి.

పెళ్ళయిన మర్నాడే కోటేశ్వర్రావు తన ఊరికి బయలుదేరాడు—ఒంటరిగా. "పెళ్ళి చేసుకున్న వాడివి పెళ్ళాన్ని వెంట తీసుకుపోవే" మని ఎవరడుగుతారు. ఎలా అడుగుతారు. వారం పది రోజుల్లో తానే వచ్చి తీసుకుపోతానన్నాడు. ప్రకాశం మటుకు అతన్ని రెండు రోజులుండి మరీవెళ్ళమన్నాడు. కాని అతను వెళ్ళాలని మహాతొందరలో ఉన్నాడు. అందుచేత వెళ్ళనివ్వక తప్పలేదు.

అతను వెళ్ళినాక నాలుగైదు రోజులకు లీలకు అతని దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. రిజిస్టరు పెళ్ళి చేసుకున్నందుకు అతని బంధువులంతా కోప్పడ్డారుట. అది పెళ్ళేకాదనీ, తాము చూస్తూండగా పీటలమీద కూర్చుని, అగ్నిసాక్షిగా, మంత్రయుక్తంగా పెళ్ళి చేసుకు తీరాలని పట్టుబట్టుతున్నారుట. పై మాసంలో పెళ్ళి ముహూర్తం కూడా నిశ్చయమయిందిట. ఈ పీటలమీది పెళ్ళికి లీలను ఒప్పుకోమని బతిమాలుతూ అతను రాశాడు. లీల ఒప్పుకుంటూ మొగుడికి జవాబు రాసేసినాక అతను రాసిన విషయం అందరికీ చెప్పింది.

కోటేశ్వర్రావు లీలకు చేసిన ఈ సూచనలో నేను తప్ప మిగతా వాళ్ళెవరూ ఆసక్తి కనబరచలేదు. ప్రకాశం చీదరించుకుని, "అసలు పెళ్ళేమో అయేపోయింది. కావలిస్తే నీ మెళ్ళో మూడు మంగళసూత్రాలు కట్టుకోమను. నాకు మాత్రం ఈ మంత్రాల పెళ్ళితో ఎలాటి సంబంధమూ లేదు" అని కూతురికి చెప్పేశాడు.

ప్రకాశం భార్య నన్ను సలహా అడిగింది. "ఇలా పెళ్ళిమీద పెళ్ళి చేసుకోవటంలో తిరుగుడేమీ ఉండదుకద?"

ఉండదనీ. కొందరు విదేశాలలో కూడా ఇలా రెండురకాల పెళ్ళి చేసుకుంటారనీ. అందువల్ల పెళ్ళిముడి మరింత గట్టిగానే ఉంటుందిగాని, నష్టమేమీ ఉండదనీ ఆవిడకు నచ్చచెప్పాను.

లీలతో మాత్రం, "మీ ఆయన ఏ కారణం చేతనో ఇక్కడ జరిగిన పెళ్ళి గురించి వాళ్ళకు చెప్పకుండా దాచినట్టుంది. నీకా పల్లెటూళ్ళో జరగబోయేదే పెళ్ళి అని వాళ్ళు బహుశా అనుకుంటారు. ఇది నిజమైతే నా కాకకార్డు ముక్క మటుకు రాయి," అన్నాను.

లీల సరేనన్నది.

రెండో పెళ్ళి ఇంకా నాలుగు రోజులుండనగా కోటేశ్వర్రావు దిగాడు. అతనూ లీల చాలాసేపు గుసగుసలాడుకున్నారు. తరవాత అతను మర్నాడే లీలను తన వెంట తీసుకు పోతున్నట్టు చెప్పి, లీలవెంట ఎవరొస్తారని అడిగాడు.

అల్లుడు వచ్చినప్పటినుంచి చిట చిటలాడుతూ, కుత కుత లాడుతూ వున్న

ప్రకాశం, "ఎవరైనా ఒకరు రావలసిన అవసరం వుందా ఏమిటి?" అని అడిగాడు.

మామగారి పరాకుచూసి కోటేశ్వర్రావు ముడుచుకుపోవటం నేను కళ్ళారా మొదటిసారి చూశాను.

"కన్యాదానానికి ఎవరన్నా పీటల మీద_" అని అతను జంకుతూ ప్రారంభించేసరికి ప్రకాశం మరింత మండిపడి, "అనాధపిల్ల అని వాళ్ళతో చెప్పెయ్యి! దారిలో దొరికిందను!" అన్నాడు.

లీల శోకం లంకించుకుంది.

"ఏమిటండీ మీరు మరీనూ ... పిల్లవెంట నేనొస్తానే, నాయనా!" అన్నది ప్రకాశం భార్య.

"మామగారు కూడా వస్తే_" అని మళ్ళీ గొణిగాడు కోటేశ్వర్రావు.

ప్రకాశం ఇక కోపం పెంచుకునేటందుకు ఓపికలేక శాంతం అవలంబిస్తూ," చూడు, కోటేశ్వర్రావ్. నేను సీరియస్ మనిషిని. మన దేశంలో జీవితంతో ఆటలాడుకునే వాళ్ళున్నారని నాకు తెలుసు కాని నాకు ఆడుకునే తీరికలేదు. నా ఉద్దేశంలో ఈ మంత్రాల పెళ్ళి వుత్త బొమ్మల పెళ్ళి, ఆటవికుల సంబరం! తెలిసింది గాదూ! అలాటి నాన్సెన్స్‌తో నేను పుటప్ చెయ్యలేను_చెయ్యను. అదీ గాక....నువు మీ వాళ్ళ దగ్గిర ఏం నాటక మాడుతున్నావో నాకు తెలీదు. ఒకరకం పెళ్ళి అయిపోయిందని నువు వాళ్ళకు చెప్పి వుంటే మళ్ళీ కన్యాదానం సమస్యరాదు. నువు మీ వాళ్ళ దగ్గిర నీ యిష్టం వచ్చిన నాటక మాడుకో, నా అభ్యంతరం ఉండదు. కాని నేను వస్తానంటే వున్నమాట బయట పడుతుంది. నిజం చెప్పటానికి వస్తే నేను కంట్రోలు తప్పిన స్లాట్ మెషీనును. తెలిసిందిగాదూ?" అన్నాడు.

కోటేశ్వర్రావు తల వంచుకుని మౌనంగా మామగారి వుపన్యాసమంతా విని, చివరకు తల ఎత్తి నా కేసి చూశాడు. అతని కళ్ళలో, ప్రశ్న నాకు సరిగా అర్థం కాలేదు. అతనా క్షణంలో నన్ను వెయ్యగల ప్రశ్న లన్నిటికీ నాది ఒకటే సమాధానం_తల అడ్డంగా తిప్పాను.

లీల సన్నగా ఏడుస్తూనే వుంది.

"పోనివ్వండి. మా వెంట ఎవరూ రావద్దు. మీరన్నట్టు కన్యాదానం అన్నది అంత ముఖ్యమేమీ కాదు. ఆ సమయానికి ఎవరు పీటలమీద కూర్చున్నా సరిపోతుంది," అన్నాడు కోటేశ్వర్రావు ఎంతో శాంతంగా.

"అదేమిటి, నాయనా? పిల్లను ఒంటరిగా కాపరానికి పంపిస్తామా? నేను వస్తాను. మీ వాళ్ళు పెళ్ళికైనా వచ్చారుకారు. అయినా ఎలా వస్తారే? వాళ్ళలెక్కన ఇదసలు పెళ్ళే కాద ఇప్పుడంటే కొత్త పద్ధతులొచ్చి పడ్డాయి. నా చిన్నతనంలోపెళ్ళిళ్ళంటే ఎలా ఉండేవి! పెళ్ళికూతుర్ని చేసి కల్యాణం బొట్టు పెడితే ఎంత కునిష్టిది కూడా కళకళ్లాడుతూ ఎంతో యిదిగా

ఉండేది. స్నాతకంకాగానే కాశీయాత్రా, ఎదురోళ్ళలూ, ముహూర్తం అయాక తలంబ్రాలూ, రోజూ మేజువాణీలూ, పెళ్ళిపాటలూ, చెండ్లాటా, పల్లకి ఊరేగింపులూ, అలకలు తీర్చటమూ, బూజంబంతీ, నాగవల్లి, పాన్పూ, దంపారింపూ, అప్పగింతలూ — ఎన్ని వేడుకలు! ఎంతసరదా!" అన్నది లీల తల్లి.

"అవునవును! ఎన్ని పోట్లాటలు! ఎన్ని దెప్పులు! ఎన్ని సాధింపులు! ఎంత దుబారా ఖర్చు!" అన్నాడు ప్రకాశం.

ఆ రాత్రి నేను ప్రకాశం వాళ్ళింట్లోనే భోజనం చేశాను. భోజనం అయాక నేను మా ఇంటికి బయలుదేరుతుంటే బయటిదాకా సాగనంపటానికి వచ్చినట్టుగా కోటేశ్వరరావు వెంట వచ్చాడు. అతను నాతో ఏదో చెప్పదలిచాడని అర్థం చేసుకున్నాను. దారిలోనే అతను ఉపోద్ఘాతం లేకుండా మొదలు పెట్టాడు

"నేను చేసినపని చెడ్డదని మీరంతే పడతాను, బాబుగారూ. చేసిన పాపం చెబితే పోతుందనేది కూడా నిజంకాదు. కాని లీల నుంచికారే వారిలో ఎవరికో ఒకరికి కొన్ని విషయాలు చెప్పటం నా డ్యూటీ. మామగారు వినేస్థితిలో లేరు. అత్తగారు బొత్తిగా అమాయకురాలు. నాకు మీరే కనబడ్డారు." అని అతను ప్రారంభించాడు.

(ఇంకా వుంది)

కోరలున్న యీ రాత్రి చిక్కగా నిలబడిపోయింది. సత్యనారాయణ జీవితంలో అనేక రాత్రులు గడిచేయి. కాని ఈ ప్రళయ రాత్రిలో ఒక భయంకరమైన ప్రత్యేకత. ఒక అనిర్వచనీయమైన భయం గోడకొని పేరుకున్నాయి. ఈ భాకమైన రాత్రి తొలగిపోవాలి. జనపతెరలాంటి యీ దళసరి చీకటి కరిగి పాలలాంటి వెలుగు ప్రవహించాలి. అప్పుడే సత్యనారాయణకి మోక్షం. జీవితపు చీలిక బాటలమధ్య చేరిన సత్యనారాయణకు యీ రాత్రే ఒక భావి_ఒక బాట నిర్ణయిస్తుంది. అతని జీవిత నౌక యీ పెనుతుఫాను తప్పించుకొని దరి చేరడమో, లేక యీ సుడిగాలిలో విరిగి చెక్కలై పోవడమో యీ రాత్రే నిర్ణయిస్తుంది. ఈ రాత్రి నిక మోయలేననుకుంటున్న సత్యనారాయణ చీకటి ఎడారిలో సాగిపోతూనే వున్నాడు.

"యీ సీకట్లో నేన్రాలేన్రా సత్తెం, ఏలనుకెళ్ళి నువ్వే సూసుకురా" అన్న రాజమ్మ మాటలు అతన్ని వెంబడిస్తూనే వున్నాయి. రైలుస్టేషన్లో ట్యూబు లైట్లన్నీ కలిసినా అతన్ని అలుముకుంటున్న చీకటిని చింపలేవు. ప్రపంచం లోని అన్ని లైట్లూ ఒక్కసారి కూసినా అతని హృదయ ఘోషని మించలేవు.

ముందుకు దూసుకుపోతున్న సత్తెన్నారాయణ మనసులో జీవితపు పుటలు వెనక్కి తిరుగుతున్నాయి.

ఐదేళ్ళకింద పలుచని వెన్నెల్లో,



బీనా దేవి

నిర్జీవమైన హరికెన్ లాంతరు ఎర్ర వెలుగుల్లో, మునసబు రావయ్య యింటి ముందు, ఆశఫలించగా వచ్చిన నీరసం వల్ల గోడకు చేరబడిపోయిన రాజమ్మను "మరైతే ఏం చేస్తావే నీ మనవణ్ణి?" అని రావయ్య అడిగేడు. భయంతో గోడకు కరుచుకుపోయిన సత్తెన్నారాయణ యింకా గోడలోకి హొదుక్కుపోయేడు. జీవిత ప్రవాహంలో సునాయాసంగా కొట్టుకుపోవడమో, లేక తిరగబడి ఎదురీదటమో నిశ్చయించుకోలేని రాజమ్మ పెదవి విడలేదు.

"సికేంవే! చదివించు పైకి"

ప్రోత్సహించేడు రాఘవయ్య. ఐనా మాటాళ్ళేదు రాజమ్మ. దాంతో మరీ ఉత్సాహంతో, "చదివించు పైకి. నీకైనా ఏవంత పదిమందున్నారనీ? మిగిల్న వాడల్లా వాడొక్కడేగా? చదివించ్చది వించు" అని మొండిగా ప్రోత్సహించేడు రావయ్య.

దాంతో రెచ్చిపోయింది రాజమ్మ. "ఏటి సెప్పను మునిసీబ్బాబూ? నా బతుకిలా ఎండి మండిపోద్దనుకోనేదు. కట్టుకునోణ్ణి కాల్చేసుకున్నా. కన్న కూతుర్ని కాల్చేసుకున్నా. ఇందరు సచ్చినా నాకు సావురానేదు. నా కోసరం కాదు బాబూ నేబతికేది. మిగిలున్న ఆ నలుసు కోసరం" అని ఆగింది ఆప్యాయతో సత్తెన్నారాయణ్ని చూస్తూ. మళ్ళీ కట్టుకున్నవాడు జ్ఞాపకం రాగానే "ఆడికేం ఆడుపోనాడు. నా మెళ్ళోకి బందాలన్నీ సుట్టేసి. ఆడుసేసిన అప్పులే తీరసమంటావా? మిగిల్నోక్కడికీ అచ్చరమ్ముక్కే సెప్పించమంటావా? నువ్వేసెప్పు! ఇంతకీ యీడు సదువుకునేటి సేస్తాడంటావ్? ఉద్దేగాల్సేస్తాడా? ఊళ్లేల్తాడా? నా నీద నేను మునసబ్బాబూ యీ మొండి బతుకు. ఏటుందని సెప్పించమంటావ్ సదువు. ఏటుందని సెప్పించనీడికి సదువ్? నీకు తెలద్దేటుంది గనక? కమిసను కొట్టుకి బెల్లం తోల్నేదని సెప్పి సావుకోరు ఒడ్డీలకి ఒడ్డీలు కట్టినాను. పేగుల్తెంచుకుని కట్టిన సెల్లులు సూపక కోరటు కీడ్చినాడు. ఆడి జివ్వొండ_ఆడి కెలా అరుగుద్దో యీ అన్నేయ పాప్తన. ఏటంటే ఏం నాబం? ఇపు డెంతేడ్సి ఏం నాబం? ఇయేలో రేపో ఆ తూరుప్పొలం దప్పుకొట్టి పొట్ట నెట్టేసుకుంటాడు సావుకోరు. ఇకేటి మిగులుద్ది నాకు? మూల పొలం ముప్పాతికా! అంతేనా! అందిమి దొచ్చేదేటి? నాకు మిగిలేదేటి? దాంట్లో నీకు పన్నులే కట్టమంటావా? కరణమయ్య కట్నాలే సదించమంటావా? బేపనయ్య బాకీలే సెల్లు పెట్టమంటావా? సత్తెంకు సదువే సెప్పిచ్చమంటావా? ఇన్నిబోతే నాకేటి మిగులుద్ది. నువ్వే సెప్పు నాన్నగోరూ. ఎండుగడ్డి ఏరుకున్న గింజలూ తప్ప, ఏముందని సత్తెన్ని కాలేజీలో ఎట్టమంటావ్? ఆగిపోయింది రాజమ్మ.

నిలదీసి అడిగిన రాజమ్మను బుజ్జగించేడు రావయ్య. "మేమంతా లేవుంటే? అప్పుంచి నరుక్కొద్దాం. లక్షణంగా చదువుకుంటున్న వాణ్ణి మానిపించేస్తానంటావేంటే నువ్వు? వెనకాడక ముందు నువ్వు వాడిని కాలేజీలో చేర్చు. తర్వాత చూద్దాం. ఇంతకీ మా రాంబాబు కూడా తోడుంటాడుగా వాడికి. వాడేం ఒంటిగాడు కాదులే."

సత్తెనారాయణ ఎస్సెల్సీ పేసైన రాత్రి జరిగిన ఈ సంభాషణ అతన్ని తొట్రుపాటుతో కాలేజీలోకి నెట్టింది. తనపల్లెకి రెండుమైళ్ళ దూరంలో వున్న పట్టణంలో కాలేజీలో చేరేడతను.

నాలుగు నూలు చొక్కాలతో, మాసి చిరిగిన రంగు పంట్లాలతో,



రాంబాబు పుస్తకాలతో, మధ్యాహ్నం మందే కడుపుతో, దినానికి నాలుగు మైళ్ళ వడకతో, జీవితంలో ఒంటరితనంతో, పెరగని రాంబాబు పరిచయంతో పి. యు. సి. గడిచిపోయింది. రాంబాబు, సత్తెనారాయణా ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయ్యేరు.

ఆ సంవత్సరంలో సత్తెనారాయణ చూసిన సినీమాలు రెండు — అమెరికా గవర్నమెంటు ఖర్చువి. ఆ సంవత్సరంలో అతను కేంటీనుకెళ్ళింది మూడు సార్లు. మూడుమాట్లూ రాంబాబు ఖర్చునే.

సత్తెనారాయణ పి. యు. సి. పేసయ్యేక ఎవరి సలహా లేకుండానే అతన్ని బి. యే.లో ప్రవేశపెట్టింది రాజమ్మ. బి. యే. ప్యాసైతే "సబిన్స

పెట్రు పనిస్తారని ఎవరో అనగా ఎప్పుడో విందామె.

ఒకప్పుడు హెడ్ కానిస్టేబులుద్యోగం ఆమె దృష్టిలో బహుందొడ్డది. అల్లప్పుడు కలకత్తా మెయిల్‌కింద పడి చచ్చిపోయిన "మైనర్రాజు గోరి" అంటు మామిడితోటలో, "కాలుజారిన' చిట్టెమ్మ కూతురు ఉరిపోసుకుని చచ్చిపోయినప్పుడు, చిట్టెమ్మని ఖైదులో తోసింది హెడ్డే. మూడువందలు పుచ్చుకొని బైటకు తీసింది ఆ "ఏడ్డు బాబే."

"సంకురాత్తిరి" పండక్కి "సుక్కేడుక్క వేసుకున్న" మంగమ్మ మొగుణ్ణి కబందుళ్ళాటి "కనిస్టేబు" పట్టుకుంటే పద్దమ్మక్క "ఒగ్గిసిందీ ఆ ఏడ్డుబాబే". అంచేత తల్చుకుంటే తపస్సు మినహా హేడ్డుకి చేతకానిదేదీ లేదు రాజమ్మ దృష్టిలో. కాని ఇదంతా —

ఒకనాడు పాతబాకీ తీర్చనందుకు, తనని కొట్టిందే కొట్టేడని, తిట్టిందే బూతు తిట్టేడనీ, ప్రమాదవశాత్తు తన పశువుల పాక తగులడిపోతే కావాల్నే దానికి నిప్పు పెట్టేడనీ, బడ్డీకొట్టు బసవయ్య రౌడీ కోడిగాడిమీద "అబద్దీకపు రిపోర్టు" హేడ్డుకిచ్చేడు. హేడ్డు కూడా "నంచం కతికేసి న్నేయం అన్నేయం" అన్నది లేకుండా గొడ్డుని బాదినట్టు కోడిగాడ్ని బాదేసి "ఎస్పీవోడి స్టంటులా" వాణ్ణి కుళ్ళబొడిచేస్తూ వుంటే, వాడు వేసిన కేకలు "సీతామ్మోరి దుక్కం నాగ" ఊర్ని ఉదకబెట్టేసినాయ్." ఆ కేకలికి "ఇనసపెట్రు బాబు ఊళనుకి పరిగెత్తి కెళ్ళి ఫిస్తు యిప్పి దీశ గుద్దోటి గుద్ది కోడిగాణ్ణి యిడదీసిక పోతే కోడిగాడు అది గాబుల్లో కలిసిపోయిందును." అంతే కాకుండా కోడిగాడి "మాటిని, అదినాయం కనిపెట్టేసి అణ్ణి ఒగ్గేసి, తప్పుడు కేసిచ్చినందుకు బసవయ్య మీద కేసెట్టి అణ్ణి జైలుకి కట్టేనాడు దరమంజూ ఇనసపెట్రుబాబు."

ఈ ఉదంతం కోడిగాడి సుఖాతః విన్నప్పట్నించీ రాజమ్మ దృష్టిలో "ఏడ్డు పొట్టైలెతే ఇనసపెట్రుబాబు పులి. ఆకు పులైతే యీకు సింవం"గా మారి, కొండంత హేడ్డూ ఆర్నెల్లకింద చచ్చిన శవంలా కుష్కించి పోయేడు. ఇదంతా జరిగి "మొన్న కొత్తామాసకి నాలుగోవేలు నిండబడది." అప్పట్నించీ "సత్తుం" ఇనస్పెక్టరైతే యీ "ఔతారం సాలించేద్దామని రాజమ్మ అనుకుందేది. ఆమె అలా అనుకున్నదాని ఫలితమే సత్తెన్నారాయణ బి. యే. చదువు.

సత్తెనారాయణ బి. యే. చదివిన మూడు సంవత్సరాల్లోనూ ముగ్గుసార్లు ఆడపిల్లలు కోరుకొని అతన్తో మాటాడేరు, తమకేవో ఓటిమ్మమని. ఆ మూడు సంవత్సరాల్లోనూ అతన్తో ప్రిన్సిపాలుగారు రెండుసార్లు మాటాడేరు, మిగతా పిల్లలు చేసే స్ట్రయికులో పాల్గొంటే "ఫీ" కన్సెషను తీసేస్తామని చెప్పడానికి.

ఆ మూడు సంవత్సరాలూ రాజమ్మ చెమటోడ్చింది. ముసలి సంయుక్తలా నడుం బిగించింది. కత్తిపట్టిన ఝాన్సీ

లక్ష్మిలా లక్ష్యసాధనలో తానుఅహూతై పోడానికి సిద్ధపడింది.

ఆ మూడేళ్ళూ ప్రతిరోజూ చీకటున్నా వానొచ్చినా తెల్లవారుఝామున మూడింటికి లేచేది. సంగీత సాధనకి మాత్రం కాదు. "కోసెడు దూరం స్మైసేనం మలుపు ఒరుకు" పోయి పేడ ఏరి తెచ్చి వారానికి "యెయ్యేరె బాబూ యెయ్యి" పిడకలుపెట్టి అమ్మి ఊరు గొడ్లపాలన్నీ "కమిసను డబ్బులిక్కా" టొన్లో కొళ్ళరోళ్ళైపోయే వరకూ తిప్పి తిప్పి అమ్మి, దంపుడు బియ్యం దుఖాణంలో "వారానికి ఏడు బస్తాలు-రోజుకో బస్తాలెక్కాని" దంపి దంపి, "జొక్సనుకాడ కేపేసుకాటంపో" రోజుకి పచెడు మినపప్పు రుబ్బి రుబ్బి, అంట్లు తోమి, అగచాట్లుపడి, తాను సున్నమై ఎద్దులో ఎద్దయి "బూదేవత్తో కుమ్ములాడి," పండించుకున్న పదిగింజల్తో "సత్తుంని మూడు పూట్లకో పూ౦ పస్తెట్టి," సత్తెన్నారాయణ్ని చదివించింది రాజెమ్మ.

సత్తెన్నారాయణకి సబిన్సపెక్టరౌదామనీ, సూపరెంటౌదామనీ లేదు. కనీసం కలెక్టరౌదామనన్నా లేదు. అతనికి కోరికల్లేవు. వాంఛల్లేవు. భావి జీవితం గురించి గులాబీ కలల్లేవు. అతనికున్న ఒక్క ఆశయవూం బ్బీయే ప్యాసౌదామనే. తాను ప్యాసైతేరాజమ్మ కళ్ళల్లో నీటి ముత్యాలు చూద్దామనీ- ఆమె మొహంలో మెరిసే మెరుపులు చూద్దామని కూడా కాదు. తన పరీక్ష పోతే ఆమె మొహం చూళ్ళేడు. ఆమెకు తన మొహం చూపలేడు. తన పరీక్షపోతే రౌడీ వెధవ రామచిలుక పీక పిసికేసినట్టూ, పసిపిల్లను మంటల్లో తోసేసినట్టూ వుంటుంది రాజమ్మకు. రాజమ్మ బాధ తను చూళ్ళేడు. తన మట్టుకు తను పోషించుకోలేక కాదు. రాజమ్మ క్కావలసిన "మూడు ముద్దలూ" సంపాదించలే క్కాదు. పసిపిల్ల ఆడుకుంటున్న గాజు బొమ్మని తోలు జోడుతో తొక్కి పిండి చేసినట్టూ. యుద్ధానంతరం సైన్యంలోని తండ్రిరాక కెదురు చూస్తున్న పిల్లతో "మీ నాన్న చచ్చిపోయేడని" చెప్పినట్టూ వుంటుంది. రాజమ్మతో తన పరీక్ష పోయిందని చెప్పడం, అంతకంటె తన పరీక్ష పోయిన పక్షంలో "సత్తుంబాబూ! నీ పరిచ్చ పోతే నాను ఏటొడ్డు పాణ్ణాతిలో పడాల్సిందేరా బాబూ" అని ఆమె అనే పాడు నూతిలో ఆమెను తోసేస్తే ఆమె పట్ల దయచూపిన వాడౌతాడు.


సత్తెన్నారాయణెప్పుడూ రాజమ్మకి ద్రోహం చెయ్యలేదు. నేటివరకూ ఒక్క క్లాసూ తప్పలేదు. ఈ బి. య్యే. పరీ

శిక్ష, గుడ్డి రాక్షసుడి కంటికన్నులా వుండే బుడ్డిదీపం దగ్గర "రేత్తిరి మలి కోడి కూసే"దాకా చదివేవాడు. తన వయసువాళ్ళకు కలిగే కోర్కెలు తనకి కలక్కుండా వాటిపీక నొక్కి చంపేసేడు. "నన్ను సబిన్స్పెక్టరూ చెయ్యక్కర్లే, సూపరెంటూ చెయ్యక్కర్లే. జీవితంలో యీ తుదిపరీక్ష నెగ్గించు భగవాన్" అని, చావు బతుకులమధ్య తపనపడుతున్న ముక్కుతల్లిని బతికించమనే ఏమిమిదేళ్ళ పిల్లలా దీనాతి దీనంగా ప్రార్థించేడు.

"పరీక్షపాసైతే సత్తెన్ని సివాచలం కొండకి అంపుతా" అన్న రాజమ్మ మొక్కు చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. "మూడూళ్ళ సూసైటి నీ కొండకొచ్చి జుట్టిచ్చేస్తా వెంకటేశ్వరా" అని తనూ మొక్కుకున్నాడు.

* * *

మెదళ్లో చిక్కుపడే ఆలోచనల్తో, కడితో పేరుకొని వున్న మేఘాల క్రింద, రాంగన్న పులుల్లా వున్న చెట్లమధ్య, నిర్ధైర్యం తెప్పిస్తుంటూ, సాధ్యపడని సాహసాన్ని సాధిస్తూ నడిచిపోతున్నాడు సత్తెన్నారాయణ.



తడిసిన నల్ల కంబళిముక్కల్లా తేలుతున్నాయి మేఘాలు.

రాక్షస సంతర్పణలో కూర్చున్న ముసలి రాక్షసుల్లా వున్నాయి రోడ్డు ప్రక్క చెట్లు.

మీదనున్నవాళ్ళ పాప భారానికి కుంగిపోయి చెయ్యెత్తితే అందేట్టుంది ఆకాశం.

రైలుస్టేషను చేరేక గుర్తొచ్చింది సత్తెన్నారాయణకి, తను దబ్బు మరిచిపోయేనని. "ఛీ! అపశకునం" అనుకుంటూ థర్డ్ క్లాస్ వెయిటింగ్ హాల్లో బెంచీమీద కూలబడి పోయేడు.

అప్పటికప్పుడే పొలు లొచ్చేసింది. సత్తెన్నారాయణ గుండెలు చప్పుడు చేస్తూ. గొంతులో కొట్టుకొనే గుండెతో, ఏ క్షణాన రక్తం వరదకి పగిలి పోతాయో అనిపించే నరాల్తో, భయానికి తట్టుకోలేని ఎముకల్తో, ఆశ నిరాశల కత్తెర్లో తెగిపోతున్న హృదయంతో, తనకు తెలిసిన స్టూడెంట్లెవరైనా న్యూస్ పేపరు తెస్తారేమోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు సత్తెన్నారాయణ.

అతని తెలిసిన వాళ్ళు చాలా మంది పేపర్లు తెచ్చారు. "నీకేం ఫస్టుక్లాస్ ... ..."

ఆ్రత్రంగా చూసేడు. ఏవో అర్థంకాని నంబర్లు — గుర్తులేని అంకెలు అతని కళ్ళముందు తిరిగి పోతున్నాయి.

ముగ్గురు దేముళ్ళకూ దయ నిండు కుంది.

ముక్కోటి దేవతలకూ కరుణ కలగలేదు.

సింహాద్రి అప్పన్న అంకెలు వేశేడు. భూదేవి, శ్రీదేవీ సమేతుడైన శ్రీనివాసునికి సత్తెన్నారాయణ జాట్టక్లేకపోయింది.

సత్తెన్నారాయణ నంబరు పేపర్లో లేదు.

* * *


"ఎక్కడా తెలకుండా కుట్టేసినా దొరె దాట్రు—పెద్ద సెయ్యి" అన్నారు. అంతా మెయిల్‌కింద పీకపెట్టి చచ్చిపోయిన సత్తెనారాయణ శవాన్ని పంచాయితీ, పోస్టుమార్టమ్ ఎగ్జామినేషనూ అయ్యేక రాజమ్మకి యిచ్చినప్పుడు.

* * *

ఇది జరిగిన రెండు రోజులకు....
విసిరేసిన ఎంగిలాకుల్లా ఊరవతల వున్న రాజమ్మ గుడిసెలో,

ఏదో అడవిలో జీర్ణశిథిలాలయంలో అజ్ఞాత భక్తుడు వెలిగించిన దీపకళికలా వెలుగుతున్నది ప్రమిదలోని వత్తి.

ఎన్నో శతాబ్దాలువెనక సుంధరంగా మలచబడి, ఎండపేల్చగా, వానచీల్చగా,



గాలికోసేయగా మిగిలి, అన్యమతస్థుల చేత విరగ్గొట్టబడిన వికృత శిల్పంలా నేలని పడివుంది రాజమ్మ.

ఆర్నెల్లు ప్రతిరాత్రి నీట్లోనూ పగలు ఎండలోనూ పెట్టిన పాత చెప్పులా వుందామె మొహం.

ఉడతలు పీకిపీకి వదలగా, ఎలకలు కొరికిన తాటెంకలా వుందామె జుట్టు.

బ్రతికుండగానే చెదలు తినేసినట్టుందామె శరీరం.

ఆమె గుడిశంతా తుప్పట్టిన ఇనప ముక్కలా వుంది.

అర్ధరాత్రైనా ఆమె కంటికి నిద్ర గాని, నీరుగాని రాలేదు. ఆశృతతో వచ్చిన రాంబాబుని చూసి కూడా ఆమె కదల్లేదు.

ఆనందంతో తొట్రుపడుతూ "మన సత్తెన్నారాయణ ప్యాసయేడు రాజమ్మా! ఫేసైపోయేడు" అని, నిర్జీవంగా పడున్న రాజమ్మని చూసి ఒక్కసారి ఆగిపోయేడు రాంబాబు.

మళ్ళీ తనంతతానే ప్రారంభించేడు "ఏదో తప్పైందిట — యూనివర్సిటీ లోనే — అంటే కాలేజీ — పెద్దకాలేజీ లోనే ఏదో పొరపాటై పోయిందిట. పొరపాటంతా వాళ్ళదే! ఇదుగో యిప్పుడే పేపర్లో పడింది చూడు రాజమ్మా మన సత్తెం ప్యాసై పోయేడు - తప్పంతా వాళ్ళదే - ఆ కాలేజీ వాళ్ళదే, మన సత్తెం తప్పేమీ లేదు రాజమ్మా" అని, రాజమ్మ కదలడం చూసి హఠాత్తుగా ఆగిపోయేడు.

రాజమ్మ బైటకు చప్పుడయ్యే కీళ్ళతో లేచి గోడకి చేరబడి కూర్చుంది. బైటికి కనపడనంత లోతుగా వున్న తన కళ్ళతో రాంబాబుని తీక్షణంగా చూసి "తప్పంతా అదిదే బాబూ! అదిదే!! అదిపుటకే...అదు పుటడవే అది తప్పు" అని చూపు మరల్చి దూరంగా నిశీధంలోకి చూస్తూ "మాలాటోళ్ళని పుట్టించడవే అదితప్పు" అంది చెయ్యెత్తి ఆకాశం వేపు చూపిస్తూ.

***

చందా దారులకు మనవి

పాత చందా దారులు తిరిగి చందా పైకం పంపే టప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు, "జ్యోతి"

3. రాకెట్లకు అంతస్థు లెందుకు?


డాక్టర్ మహీధర నళినీమోహన్


"నాలుగు అంతస్థుల రాకెట్టు ఒకటి చంద్రమండలం మీద వెళ్ళి పడింది!" అని రేడియో వార్త విని ముక్కుమీద వేలు వేసుకున్నాడు ఆశ్చర్యం దాచుకోలేని అమాయకు డొకడు. అతడి ఆశ్చర్యాని కేమిగాని, ఒక్క సందేహం. అసలు రాకెట్టని అంతస్థులుగా విభజించడం ఎందుకు? పోయదలచుకున్న ఇంధనమంతా ఒకే ఒక గొట్టంలోపోసి, వత్తి వెలిగిస్తే ఏం పోయింది? అసలు నాలుగు అంతస్థులే ఎందుకు కట్టాలి? పది అంతస్థులు చెయ్యకూడదూ?

దానికి నా సమాధానం—పదికాదు. పాతిక అంతస్థుల రాకెట్టు అయినా కట్టవచ్చు సిద్ధాంతరీత్యా. అసలు అంతస్థులుగా ఎందుకు విభజించాలో తెలిస్తే, ఎన్ని అంతస్థులు చెయ్యాలో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఒక ఉదాహరణ చూపిస్తాను.

నున్నని రైలు పట్టాలమీద ఒక "ట్రాలీ"బండి ఉంది. దానిమీద ఒడ్డు సత్తువ బాగా ఉన్న ఆసామీ ఒకడు నిలుచుని ఉన్నాడు. ఆ బండిమీదనే ఒక పక్కన ఇటుకల దొంతర పేర్చి ఉంది. ఆ బండిమీదనుంచి కిందికి దిగకుండా, గడ కర్రవంటి సాధనాలు ఉపయోగించకుండా, ఆబండిని నడుపుకు పోవడం సాధ్యమేనా?

"రాకెట్టు ఎల్లా ఎగురుతుంది?" అన్న వ్యాసం అర్థమైతే ఈసమన్యను సాధించడం చాలా సులభం. ఆ మనిషి ట్రాలీమీది దొంతరలోనుంచి ఒక ఇటుక తీసి బలంకొద్ది విసిరేడను కుందాం. ఇటుకకు వ్యతిరేక దిశలో ట్రాలీ దొర్లుతుంది "ప్రతిక్రియ" వల్ల. ఇటుక బరువు ట్రాలీబరువుతో పోల్చి చూస్తే చాలాతక్కువ కనుక ట్రాలీ బహు నెమ్మదిగా దొర్లుతుంది. ట్రాలీకి, రైలు పట్టాలకీ మధ్య రాపిడి ఎంతమాత్రమూ లేదని మాటవరుసకు అనుకుంటే, ఒకసారి కదిలిన ట్రాలీఆగిపోదు. అంతలో మరో ఇటికతీసి విసిరితే, ట్రాలీవేగం





ఇంతకు ముందుకన్న రెట్టింపు అవుతుంది. ఆగకుండా వెంటవెంటనే ఇటుక మీద ఇటుకతీసి సత్తువకొద్ది విసిరేస్తూ ఉంటే, ట్రాలీ అంతకంతకు వేగం పుంజుకుంటుంది. విసిరినకొద్దీ ఇటుకల దొంతర తరిగి, ట్రాలీబరువు తగ్గిపోతూ ఉంటుంది. మొట్టమొదట విసిరినఇటుక కన్న చివర చివరికి వచ్చినకొద్ది విసిరిన ఇటుకలవల్ల ట్రాలీ వేగం మరింత పెరుగుతుంది.

దీనికీ రాకెట్టుకీ బహుదగ్గర సంబంధం వుందని అర్ధం అయింది కదూ! ట్రాలీయే రాకెట్టు. ఇటుకలే రాకెట్టు నుంచి బయటికిపోయే వాయువులు. రాకెట్టులో రసాయనశక్తి వాయువులను బయటికి నెట్టేస్తుంది. ఇక్కడ ఇటుకలను మనిషి విసిరేస్తున్నాడు. రెండింటిలోనూ ప్రతిక్రియ వల్లనే గమనం సాధ్యం అవుతుంది.

ట్రాలీ సాధ్యమైనంత ఎక్కువ వేగంతో ప్రయాణం చెయ్యాలంటే రెండే రెండు పద్ధతులున్నాయి.

1. ఇటుకలను మరింతశక్తితో విసరడం.

2. ట్రాలీమీద మొట్టమొదటే ఇటుకలను మరింత ఎక్కువగా పేర్చుకుని వుంచడం.

ఇటుకలను రెట్టింపువేగంతో విసిరితే ట్రాలీ వేగం కూడా పూర్వంకన్నా రెట్టింపు అవుతుంది. ఈ సంగతి తెలుసుకోడానికి క్లిష్టమైన గణితం అవసరంలేదు. ట్రాలీమీద నిలుచున్న మనిషి ఇదివరకే తన సత్తువ అంతా ఉపయోగించి ఇటుకలను విసురుతూ వున్నట్టయితే "మరికాస్త గట్టిగా విసరవయ్యా!" అంటే అతనికి సాధ్యం అయ్యే పనికాదు. (అలా అనడం ధర్మమూ కాదు.)

కనుక ట్రాలీవేగం పెంచాలంటేఇటుకలు మరిన్ని పేర్చుకుని బయలుదేరడం తప్ప గత్యంతరంలేదు.

సరిగ్గా రాకెట్లలో కూడా ఇదే ఇబ్బంది. రాకెట్టు అంతిమవేగం బయటికి వచ్చే వాయువుల వేగంమీదా, నిలువచేసి పట్టుకు వెడుతూన్న ఇంధనపు పరిమాణంమీదా ఆధారపడి ఉంటుంది. ఇంధనం కాలుతూ ఉన్నంతసేపూ రాకెట్టు వేగం పెరుగుతూనే ఉంటుంది. రాకెట్టు నాజిలునుంచి బయటికివచ్చే వాయువుల వేగం ఉపయోగించిన ఇంధనపు రసాయన ధర్మాలను బట్టి ఉంటుందని క్రిందటి వ్యాసంలో తెలుసుకున్నాం. ఫ్లోరిన్, హైడ్రోజన్లను కలిపి మండిస్తే గంటకు 8500 మైళ్ళ వేగంతో వాయువులు నాజిలునుంచి బయటికి వస్తాయి. ఇప్పటివరకూ తెలిసిన ఇంధనా లన్నింటిలోనూ ఈ మిశ్రమానికే నిర్గమన వేగం ఎక్కువ. కాని, ఈ మిశ్రమం మండినప్పుడు పుట్టే అపారమైన ఉష్ణోగ్రతలో (సుమారు 4000 డిగ్రీలు సెంటీగ్రేడు) సక్రమంగా పని చేయగల మోటార్లు మనకు లేవు. ఆ వేడికి మోటారు, నాజిలు వగైరాలన్నీ కరిగి, దగ్ధమై పోతాయి. ముందు ఆ వేడిలో నిలవగల

వస్తువులను వెనక్కి వట్టుకోవాలి. అంతవరకూ ఇంతటి మహావేగాన్ని సృష్టించగలశక్తి ఉండికూడా ఉపయోగించుకోడానికి లేదు. ప్రస్తుతం చాలా భాగం రాకెట్లలో ఆల్కొహాలు, పెట్రోలు కలిపి, దానిశక్తిని తగ్గించడానికి నీరు కలిపి వాడుతున్నారు. కనుక నిర్గమన వేగం 5000 మైళ్ళకు మించదు.

సరే, నిర్గమన వేగాన్ని ఇంతకన్న పెంచడానికి సాధ్యంకాదూ అని తేలిపోతే, ఆ ఇంధనాన్నే మరికాస్త అదనంగా తీసుకువెళ్ళాలి. తప్పదు. సరే ఎంత తీసుకువెళ్ళాలి ? నీకు ఎంత వేగం కావాలో దానినిబట్టి ఉంటుంది.

దీనికి సమాధానం కోసం మళ్ళీ మన ట్రాలీబండి ఉపమానం దగ్గరకు వద్దాం.

ఉదాహరణకి ట్రాలీ, దానిమీద నిలువబడ్డ మనిషీ కలిసి మొత్తం 200 పౌనుల బరువు అనుకుందాం. ఇటుకలను గంటకు 20 మైళ్ళ వేగంతో ఆ వస్తాదు విసురుతున్నాడనుకుందాం. ట్రాలీ వేగం ఇటుకల వేగానికి సమానం కావాలంటే (అంటే ట్రాలీ 20 మైళ్ళ వేగాన్ని అందుకోవాలంటే) 344 పౌనుల బరువైన ఇటుకలు తీసుకు వెళ్ళాలని గణితం చెపోంది. అంటే ఇటుకల బరువుకి ట్రాలీ బరువుకి (మనిషితో కలుపుకుని) 1.72 రెట్లు వుంటే ట్రాలీ వేగమూ, ఇటుకల వేగమూ సరిసమానం అవుతాయి.

మీకు 20 మైళ్ళ వేగం చాలదు. 40 మైళ్ళ వేగంతో (అంటే ఇటుకలకి రెట్టింపు వేగంతో) ప్రయాణం చెయ్యాలంటే సాధ్యమవుతుందా ? అసాధ్యమేమీ లేదు. ట్రాలీ బరువుకి 6.4 రెట్ల బరువైన ఇటుకలు తీసుకు వెడితే సాధ్యమే. అంటే 1280 పౌనుల బరువైన ఇటుకలు ముందుగానే పేర్చుకుని బయలు దేరాలన్నమాట !

అబ్బే ! ఇదీ చాలదు. ఇటుకలకు మూడురెట్ల వేగంతో (గంటకి 60 మైళ్ళ వేగంతో) ట్రాలీ పరుగెత్తాలంటేనో ? అప్పుడు ట్రాలీ బరువుకి 19 రెట్ల బరువైన ఇటుకలు (3800 పౌనులు) తీసుకు వెళ్ళాలి ! ఇంత బరువును ఆ ట్రాలీ ఆపుకోవద్దూ ?

రాకెట్టులోనూ సరిగ్గా ఇదేసూత్రం రాకెట్టు బరువుకి 6.4 రెట్ల బరువున్న ఇంధనం నిలువ చెయ్యడం అంత సులభమేమీకాదు గాని, అసాధ్యం

★ అప్పారావు : "ఏమయ్యా ! ఈ రామారావ్ నెలకి వెయ్యిరూపాయలు సంపాయిస్తాడుగదా ! ఎప్పుడూ డబ్బులేదు, డబ్బులేదంటాడు. ఏం చేస్తాడో ఆ డబ్బంతా ?"

సుబ్బారావు : "ఏం, నీకేమన్నా బాకీ వున్నాడా ?"

అప్పారావు : "ఉహుం. నేనే అతని దగ్గర అప్పు తీసుకోవాలని ..."

మాత్రంకాదు. కాని, 19రెట్ల బరువున్న ఇంధనంతో రాకెట్టును నింపడం ప్రస్తుతానికి అసాధ్యమే. ఒక్కటన్ను బరువున్న ఖాళీ రాకెట్టులో 19 టన్నుల బరువున్న ఇంధనం పొయ్యాలంటే రాకెట్టును పలుచని ముచ్చి బంగారపు రేకుతో చెయ్యాలి. పైగా ఆ ఒక్క టన్నులోనే బలమైన మోటార్లు, సమాచారాన్ని సేకరించడానికి యంత్రాలు, ఆజ్ఞలను అందుకుని శిరసావహించడానికి రేడియో పరికరాలు, అంతరిక్ష నావికులు .. అన్నీ ఇమిడి పోవాలి. ఈ పని ఇంతవరకూ ఎవ్వరూ చెయ్యలేదు.

గంటకు 5000 మైళ్ళ నిర్గమన వేగం కలిగిన ఇంధనాన్ని రాకెట్టు బరువుకి 6.4 రెట్లు నింపుకుని బయలుదేరితే, రాకెట్టు 10 000 మైళ్ళ వేగాన్ని చేరుకోగలుగుతుంది. ఇంత కన్న ఎక్కువ వేగాలను అందుకోవడం ఇప్పట్లో ఈ పద్ధతుల వల్ల అసాధ్యం.

ఇంతవరకూ గమనించని ఇబ్బందులు రెండుఉన్నాయి. మొదటిది గాలి వల్ల కలిగే నిరోధం. గాలి రాపిడివల్ల రాకెట్టు వేగం 10 $^{o}/_{o}$ దాకా తగ్గిపోతుంది. చిన్న రాకెట్లు అయితే మరింత తగ్గుతుంది.

రెండవది భూమ్యాకర్షణశక్తి. ట్రాలీబండి ఉపమానంలో బండి నేల బారుగా కదులుతుంది. కనుక భూమ్యాకర్షణ దానిని ఏమీ చెయ్యదు. కాని, రాకెట్లు భూమికి సమాంతరంగా ప్రయాణం చెయ్యవు. అవి ఇంధనమిందు ది ట్టని బావుగా ఎగురుతాయి కనుక. భూమి వాటిని కిందికి దిగలాగేస్తూ వేగాన్ని తగ్గించేస్తుంది_ఈ రెండింటి ప్రభావంవల్లనూ రాకెట్టు అంతిమవేగం ముందర అనుకున్న దాంట్లో సుమారు 70 $^{o}/_{o}$ మాత్రమే ఉంటుంది. అంటే గంటకు ఏడెనిమిదివేల మైళ్ళ వేగాన్నిమాత్రమే రాకెట్టు అందుకోగలదు. ఎంత పెద్ద రాకెట్టును తయారుచేసినా నిర్గమన వేగం, ఇంధనపు నిష్పత్తి ఇల్లాగే ఉన్నంతకాలమూ, వాటి అంతిమ వేగంలో మార్పేమీరాదు. కాని, అయితే రాకెట్టు పెద్దది అయినకొద్దీ అది మోసుకు వెళ్ళగలిగిన "పేలోడ్" (రాకెట్టుతీసుకువెళ్ళే పరికరాలు, జంతువులు వగైరా ఉపయోగకరమైన భారం) అధికం అవుతుంది. అంతేకాని అంతిమవేగం మారదు.

రాకెట్టు భూమిచుట్టూ ప్రదక్షిణాలు చెయ్యాలంటే గంటకు 18000 మైళ్ళ వేగాన్ని అందుకోవాలి. భూమ్యాకర్షణను జయించి చంద్ర మండలానికి గాని, మరో గ్రహానికిగాని ప్రయాణం చెయ్యాలంటే గంటకు 35వేల మైళ్ళకు పైబడ్డ వేగం అవసరం ! మరి మనకున్న రాకెట్లతో ఈ వేగాలను అందుకోవడం అసాధ్యమేనా ? అయితే భూప్రదక్షిణాలు చేసినస్పుత్నిక్కులూ, చంద్రుడిమీద వాలిన లూనిక్కులూ ఆ పని ఎల్లా చెయ్యగలిగేయి ?

ఈ పనులు సాధించాలంటే రాకెట్టును అంతస్థులుగా విభజించాలి !


7000 మైళ్ళ వేగంతో ప్రయాణం చెయ్యగల పే.ధ్ధ రాకెట్టు ఉందనుకో. దాని ముఖానికి పరికరాలకు బదులుగా 7000 మైళ్ళ వేగంతో ప్రయాణం చెయ్యగల చిన్న రాకెట్టును తగిలిస్తే? పెద్ద రాకెట్టు కొంత ఎత్తు (50, 60 మైళ్ళు) ఎగిరి ఇంధనం అయిపోయేసరికి 7 వేల మైళ్ళ వేగాన్ని అందుకుని, చిన్న రాకెట్టుతో తనకున్న సంబంధం విడగొట్టుకుని, కిందపడిపోతుంది. అప్పటికే చిన్న రాకెట్టు మొదలు పెడుతూనే 7 వేల మైళ్ళ వేగంతో బయలుదేరింది కనుక దాని ఇంధనం పూర్తి అయేసరికి 14 వేల మైళ్ళ వేగం (7000+7000) అందుకుంటుంది! ఏభై అరవై మైళ్ళ ఎత్తున గాలి రాపిడి చాలా తక్కువ కనుక, పెద్ద రాకెట్టుకిగల వాయు నిరోధం తనకు లేకపోవడం చేత, ఈ చిన్న రాకెట్టు పైన చెప్పిన వేగంకన్న మరికాస్త అధికవేగాన్ని అందుకుంటుంది.

ఈ చిన్న రాకెట్టు నెత్తి మీద పరికరాల స్థానంలో, వాటి బరువుకి సమానమైన చిన్నారి రాకెట్టు మరొకటి _7 వేల మైళ్ళ వేగంతో స్వయంగా ప్రయాణం చేయగలదానిని _ కూర్చోబెడితే, ఈ చివరి అంతస్థు 21 వేల మైళ్ళ వేగాన్ని అందుకుంటుంది. భూప్రదక్షిణాలు చెయ్యడానికి ఈ వేగం చాలు.

భూమ్యాకర్షణను జయించాలంటే, అంతకన్న చిన్నది మరో నాలుగో అంతస్థును జత చెయ్యాలి. ఈ అంతస్థుల సంఖ్యకు సిద్ధాంతరీత్యా పరిమితి అంటూ ఏమీలేదుకాని క్రింది అంతస్థులు మరింత మరింత పెద్దవి అవుతూ ఉండాలి. ఉదాహరణకి 112 పౌనుల బరువున్న పరికరాలను చంద్రుడి మీదికి విసరాలంటే నాలుగో అంతస్థు ఒక టన్ను బరువు, మూడో అంతస్థు 19 టన్నుల బరువు, రెండో అంతస్థు 330 టన్నుల బరువు, మొదటి అంతస్థు 7600 టన్నుల బరువు వుండాలి సుమారుగా!

నిర్గమన వేగాన్ని 5 వేల మైళ్ళ నుంచి 10 వేల మైళ్ళకు పెంచడం సాధ్యం అయితే, ఇదే పని చెయ్యడానికి 20 టన్నుల బరువున్న రెండు అంతస్థుల రాకెట్టు చాలు!

★★★



విజేత

యద్దనపూడి సులోచనారాణి

(గత సంచిక తరువాయి)

46

వాసు స్కూలుకు వెళ్ళిపోయాడు.

మాధవ్ యీ మధ్య పూర్తిగా యింటిపట్టున వుండటం మానేశాడు. సంధ్యకోసం కట్టిస్తున్న యిల్లుకూడా పూర్తికావస్తోంది. ఒకసారి యీ యింట్లోంచి కాలుబైట పెట్టటంఅంటూ జరిగితే అది శాశ్వతంగా తన జీవితం నుంచే నిష్క్రమించటం అని అతనికి తెలుసు. కొత్త యింట్లోకి వెళ్ళగానే ఆ యింటి తలుపులు తన ముఖంమీద టపీమని మూసెయ్యటానికి సంధ్య ఏ మాత్రం సంకోచించదు. ఓటమి ఒప్పుకోటానికి యిష్టపడని అంతరాత్మ ఎదురుతిరుగుతోంది. బలవంతంగానైనా సరే సంధ్యని పొంది తీరాలని పట్టుబడుతోంది. లేకపోతే యిన్నాళ్ళ యీ నిరీక్షణకి, ప్రాణం అంతా చిక్కపట్టుకుని భరించిన యీ సహనానికి అర్థమే లేదంటోంది. చరమ జీవితం అంతా అశాంతితో, వెలితిగా బ్రతకటంకోసమేనా గతాన్నంతా గరళంలా మింగుతూ వచ్చింది అంటూ నిలదీసి ప్రశ్నిస్తోంది, చాలా రోజులనుంచి అతను మనసుని అదుపాజ్ఞలలో వుంచుతూ వచ్చాడు. ఈనాడు ఆ మనసే ఎదురు తిరిగి అతన్ని శాసించటం మొదలు పెట్టింది. నువ్వు చూపిన అనురాగం అర్థం చేసుకుని అర్ధాంగి అవటానికి యిష్టపడకపోతే అధికారం చూపి బలవంతంగా బానిసగానైనా సరే ఆకట్టుకోమని హెచ్చరించసాగింది. అనుక్షణం దగ్గరగా వుంటే సంధ్యని పొందలేకపోయిన అతని అహం ఏ అత్యాచారానికి తెగబడుతుందో అని భయపడి దూర దూరంగా వుండసాగాడు. ఎప్పుడో ఏ పది, ఇరవై రోజులకో ఓ పూట వచ్చి వుండి బాబుని చూసి, ఇంట్లోకి కావాల్సిన అవసరాలు తీర్చి వెళ్ళిపోతున్నాడు.

దాదాపు ఇరవై రోజుల తర్వాత హైదరాబాదునుంచి ఆ రోజే యింటికి వచ్చిన మాధవ్ సాయంత్రం అవుతుండగానే నది ఒడ్డున షికారు తిరిగి రావటానికి వెళ్ళిపోయాడు.

అతను తిరిగి వచ్చేసరికి ఇంట్లోంచి కేకలు వినిపిస్తున్నాయి. ఎన్నడూ లేంది సంధ్య గొంతు బిగ్గరగా వినిపిస్తోంది. మాధవ్ అప్రయత్నంగా వంట యింటి వైపు నడిచాడు. అతని చెవులు శ్రద్ధగా ఆలకిస్తున్నాయి.

"పీపుబద్దలు కొట్టాలి. జున్ను ఒక్కసారిగా అంత తినేస్తే జబ్బు చేస్తుందని చెప్పలేదూ ?" చెయ్యి ఎత్తుతూ అంటోంది సంధ్య.

"కొత్తావంటే చూస్కో మరి. నాన్నతో చెప్తా." బాబు తల్లని చూపిస్తూ బెదిరించాడు. వాడి మూతినిండా బుగల వరకూ జున్ను అంటివుంది. స్టూలుమీద నిలబడివున్నాడు. దానిమీదకి ఎక్కి ఆల్మైరా తలుపులు తెరిచినట్టున్నాడు.

క్షణంసేపు వాడి వైపు తీవ్రంగా కోపం నటిస్తూ చూసిన సంధ్య వాడి ముఖమూ, ఆ నిలబడిన తీరు చూసి ఆపుకోలేక ఫక్కుమని నవ్వేసింది. నవ్వేస్తూనే రెండు చేతులు జాపి వాడిని దగ్గరకు లాక్కుని నుదుటిమీద గట్టిగా ముద్దు పెట్టుకుంది. బాబు కూడా నవ్వుతున్నాడు.

"ఛీ—పో—నీ ఎంగిలంతా నా కంటించకు—" మళ్ళీ కోపం గుర్తు చేసుకుంటూ దూరంగా తోసింది. బాబు వదలేదు. సంధ్య మెడచుట్టూ చేతులు పెనవేసి బుగ్గమీద ముద్దిచ్చాడు. వాడిని మోచేతి దూరంలో నిలబెట్టి క్షణంసేపు తదేకంగా చూసిన సంధ్య వెంటనే దగ్గరకు లాక్కుని గుండెలకి హత్తుకుంది. బాబు కిలకిలా నవ్వుతున్నాడు. మాధవ్ చప్పున వెనక్కి తిరిగి వచ్చేశాడు. వాళ్ళిద్దరూ కలిసి ఆనందంగా ఏకమైవున్న ఆ చిత్రం అతని హృదయం మీద ఎన్నటికీ చెరగనంత గాఢంగా హత్తుకుపోయింది. కొన్ని రోజుల నుంచి అతన్ని రాత్రింబవళ్ళు వేధిస్తున్న సమస్యకి సమాధానం లభించింది. బాబు సంధ్యకి ప్రాణంతో సమానం అయిపోయాడని దానికి ఏ మాత్రం సందేహంలేదు. తండ్రిని గుర్తు చేయకుండా వాడు వాడుగానే సంధ్య మనసులో స్థానం ఏర్పరుచుకోగలిగాడు. వాడిని అలా అలా అనామకుడిగా వదిలేయటమే మంచిది. మళ్ళీ నీ కొడుకే అని చెప్పి పరిస్థితులు ఎలా వుంటాయో చూసే ఓపికగాని, వాటి ఎగుడు దిగుళ్ళని భరించే శక్తిగాని అతనికిక లేదు. తండ్రి లేకపోతే బాబు సంధ్యకి మరింత చేరువవుతాడు అనటం అతిశయోక్తికాదు.

నిశ్శబ్దంగా యింట్లోంచి వెళ్ళిపోయిన మాధవ్ తిరిగి తిరిగి రాత్రి చాలా పొద్దుపోయింతర్వాతగాని యింటికి చేరుకోలేదు.

* * *

ఆయాకి రెండు రోజులనుంచి ఒంట్లో బాగాలేదు. అలాటి సమయాల్లో సాధారణంగా యింటిపనంతా సంధ్య మీదనే పడుతుంది. ఆ రాత్రి తన మంచంమీద నిద్రపోయిన బాబుని మాధవ్ గదిలో పడుకోబెట్టటానికి తీసుకు వెళ్ళింది సంధ్య. ఊళ్ళో వున్నప్పుడు బాబు తండ్రి దగ్గరే పడుకోవటం అలవాటు.

నిద్రపోతున్న బాబుని భుజంమీద వేసుకుని తీసుకెళ్ళేసరికి మాధవ్ టేబిల్‌ముందు కూర్చుని వ్రాసుకుంటున్నాడు. బాబుని పడుకోబెట్టి, వచ్చినంత నిశ్శబ్దంగానూ వెళ్ళిపోబోయింది.

"సంధ్యా !" వున్నట్టుండి వెనక నుంచి వినిపించింది.



చెయిపట్టి లాగినట్టే ఆగిపోయింది సంధ్య.

"నేను రేపు వూరు వెడ్తున్నా."

వింటూ నిలబడిపోయింది.

"డబ్బదీ బీరువాలో పెట్టాను__"

అతను వాక్యం పూర్తిచేయనేలేదు.

"ఆయాని పంపిస్తా" అంటూ గుమ్మం దాటబోయింది.

"ఆగు. ఈసారి నీకే అప్పగించ దల్చుకున్నాను." అతని స్వరం చాలా నిర్వికారంగా, నిశ్చలంగా వుంది.

"బహుశా నేను చాలా రోజుల వరకూ తిరిగిరాను. ఏదయినా కావా లంటే గోవిందుచేత కంపెనీకి కబురు చెయ్యి."

సంధ్య గుమ్మంలో అలాగే నిలబడి వింటోంది.

గదిలో నిశబ్దం ఏర్పడింది.

క్షణాలు గడిచినాయి, నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చింది అతని స్వరం. "సంధ్యా! నేను చాలా దూరం వెడు తున్నాను. బాబు జాగ్రత్త!"

సంధ్య తిరిగి చూడకుండా, వుండ లేక పోయింది. ఏమిటీ అతని వుద్దే శ్యం? ఎందుకీ అప్పగింతలు?

భుజంమీదుగా కొద్దిగా తలతిప్పి చూసిన సంధ్యకి మాధవ్ లాంతరు వత్తి తగిస్తూ, ఎక్కిస్తూ దానివైపే రెప్పవాల్చకుండా చూస్తూ కన్పించాడు.

ఆశానిరాశల్లా వస్తూపోతున్న ఆ వెలుగు నీడల మధ్య అతని ముఖంలో

ప్రశాంతతతోపాటు ఏదో కఠినత్వం కూడా కన్పిస్తోంది.

సంధ్యకి ఏదైనా చెప్పా లనిపిం చింది. కాని ఏం చెప్పాలో తోచక నోరు పెగల లేదు.

"అంతే. యింకేంలేదు." అని అతను మళ్ళీ రాసుకోటంలో మునిగి పోయాడు.

ఇక నువ్వు వెళ్ళవచ్చు అన్నట్టుంది అతని స్వరం. తర్వాత ఆగదిలో యింకా ఎలా నిలబడటం. సంధ్య అందుకే మెల్లిగా బైటకి వచ్చింది. కాని కాలు ముందుకు సాగలేదు. ఈ రోజు అతనికి ఏమైంది? ఎందుకలా మాట్లాడుతున్నాడు? తొణుకు, బెణుకులేని ఆ కంఠస్వరం, రాయిలా కఠినంగా వున్న ఆ ముఖం గుర్తుకు రాగానే సంధ్య మనసంతా ఎలాగో అయింది. సాధారణంగా అత నలా వుండడు. బిజినెస్‌లో ఏమైనా నష్టం వచ్చిందా? లేక పాత స్నేహా లేమైనా వురితాళ్ళలా మెడకి బిగుసుకు పోతుంటే ఎలా వదిలించుకోవాలో తెలియక తికమక పడుతున్నాడా? ఏమిటి అసలు కారణం? వస్తుతః అతను ఎలాటి వాడయినా కానీ! విశిష్టమైన అతని వ్యక్తిత్వం అంటే ఆమెకి గౌరవం వుంది. అతనిలో ఆ స్త్రీ లోలత్వమే లేకపోతే పురుష జాతికే మణిపూస లాటివాడు. అయినా మనిషి అన్న తర్వాత ఏదో రకమైన బలహీనత లేకుండా ఎలా వుండటం! అతని ప్రవర్తనకి స్వయంగా అతనే కారణం కాకపోవచ్చు. అది వంశ పారం పర్యంగా లభించిన రసత్వమేమో! మాధవ్ తాత ము... ఎవరయినా స్త్రీ వ్యసనానికి బానిసలేమో! ఒకొక్క-సారి అలా కూడా అవుతుంది.

ఇన్నిరోజుల యీసాన్నిహిత్యంలో మానసికంగా అతనిపట్ల ఎంతద్వేషం వున్నా ఒక్కనాడు కూడా అతని ముఖంమీద తేలికగా మాట్లాడలేక పోయింది. అప్పుడప్పుడుఏమిటి తనలో యీ బలహీనతకి కారణం అని తర్కించుకునేది కూడా. ఎంత వెతికినా సమాధానం దొరికేదికాదు. చివరికి 'కొంతమంది మనుష్యలంతే. వాళ్ళెంత దుర్మార్గులైనా ముఖంమీద పట్టుకుని హీనంగా దూషించలేం. వాళ్ళ ముఖ వర్చస్సు అలాటిది' అని సరిపెట్టు కునేది. అతను ఎలాటి వాడయినాకానీ సుఖంగానే వుండాలి. అతనిమూలంగా తన జీవితం ఛిన్నాభిన్నమై ధూళిలో కలిసిపోయిన మాటనిజమే. అయినా సరే అతనుహాయిగా, నిశ్చింతగావుండా లనే తను కోరుకునేది. జరిగిందేదో కేవలం తన దురదృష్టంవల్లే జరిగింది. అని ఎందుకు అనుకోకూడదు! ఈ జీవితం అంటే ఏమిటి? మన పాప పుణ్యాలు బేరీజువేసి భగవంతుడు మన చేతికిచ్చి పంపే చద్దిమూట. ఒక్కొ-క్కళ్ళ మూటలో పంచ భక్ష్య పరమాన్నాలుంటాయి. మరికొంతమంది మూటలో చాలీచాలని మెతుకు లే వుంటాయి. ఇంకా కొందరి మూటల్లో పుచ్చిపురుగులుకారుతున్న కుళ్ళిపోయిన పళ్ళే వుంటాయి. ఎవరిగీత వాళ్ళది. నా కన్యాయం జరిగింది అని గుండెలు

బాధుతుంటే ఏం లాభం ? ఈ జీవితంలో లేదని ఏడిచే కాలంలో [illegible]వం తయినా సరే మంచిమాటలకి, మంచి పనులకి వినియోగిస్తే కనీసం వచ్చే జన్మయినా మంచిది దొరుకుతుంది. దొరుకుతుందనే ఆశ కలుగుతుంది. మాధవ్‌ని తను ఎందుకు ద్వేషించాలి ?

మొట్టమొదటిసారిగా తనకు అలాంటి ఆలోచన రాగానే సంధ్య కెలాగో అనిపించింది. చాలాసేపటి నుంచి అతని గదిబైట నిలబడిపోయాను అనే సంగతి కూడాగుర్తుకు రావడంతో సిగ్గుపడి గబ గబా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

మంచంమీద కూర్చుని పడుకోబానికి దిండ్లు సరిచేసు కుంటుండగా గదిలో చిన్న స్టూలుమీద పెట్టిన మరచెంబు మీద కళ్ళు వాలగానే [illegible] మంచి నీళ్ళు పెట్టలేదని గుర్తు [illegible] వచ్చింది. రాబు అర్ధరాత్రివేళ లేచి తప్పకుండా నీళ్ళు అడుగుతాడు. ఆ సమయంలో నిద్రకళ్ళతో అతను లేచి యిబ్బంది పడాలి. అసలే ఎలాగో వున్నాడు.

సంధ్య మంచినీళ్ళు తెచ్చేసరికి గది తలుపులు బార్లా తెరిచే వున్నాయి. లోపల లాంతరు వెలుగుతూనే వుంది. మాధవ్ మాత్రం టేబిల్‌మీదకి ఒరిగి పోయి దానిమీద రెండు చేతులు జాచుకుని మోచేతి దగ్గర ముఖం దాచుకుని వున్నాడు. అనుకోకుండా అతన్ని ఆ విధంగా చూడటంతో వులిక్కిపడిన సంధ్య తెల్లబోయి

జరిగిన కథ

పుణ్యానికిపోతే పాప మెదురవుతుందట. ఒకనాటి భయంకర రాత్రి ఆపదలో చిక్కుకున్న సంధ్య అనే యువతికి సహాయపడబోయిన మాధవ్‌ను ఆమె అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ తర్వాత కొన్నేళ్ళకి ఆమె ఆతనికి రైల్లో ఒంటరిగా తారసిల్లుతుంది. అతనితో ఆమెపై పగ పెల్లుబుకి ఆమెను మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఆ సంధ్యే అతడు నివసిస్తున్న వూరిలో తటస్థపడుతుంది. తన జీవితం లోకి మళ్ళీ మళ్ళీ ప్రవేశిస్తూ, తనపై విపరీతమైన ద్వేషం చూపుతున్న ఆమెను తనదిగా చేసుకోవాలని యత్నిస్తాడు. కుంటివాడైన ఆమె తమ్ముడు వాసుకు, కాలు నయంచేస్తాడు. తనవల్ల ఆమెకు జన్మించిన కుమారుడు ఎవరివద్దనో పెరుగుతున్నట్టు తెలుసుకుని వాడిని ఇంటికి తీసుకు వస్తాడు. కాని ఆ పిల్లడు తన పుత్రుడేనని సంధ్యకు తెలియదు.

గుమ్మంలో అలాగే బొమ్మలా నిలబడి పోయింది. ఇదేమిటి? ఏమైంది యితనికి. ఎందుకలా వున్నాడు అన్న ప్రశ్నలు వెంటనే వచ్చినాయి. ఇది వరకు అవిటి తనంతో మంచంలో వున్నప్పుడు, వాసు కూడా యిక యీ బ్రతుకు యింతే అని గుర్తుకు వచ్చినప్పుడు అచ్చు యిలాగే నిరాశా నిస్పృహాలతో నిర్జీవంగా ఓ ప్రక్కకి ఒరిగిపోయేవాడు. భగవంతుడిదయవల్ల, మాధవ్ పుణ్యమా అని వాసుమళ్ళీ మామూలు మనిషి అయ్యాడు. అంటే మాధవ్‌కూడా అప్పటి ఆ వాసులానే భరించలేని ఆవేదనతో, ఆలోచనని తప్పించుకోలేక నరకం చూస్తున్నాడా! ఏమిటి అతనికున్న సమస్య? అసలీ మధ్య తరచుగా యిలాగే కన్పిస్తున్నాడు. కారణం ఏమిటి? చేతినిండా పుష్కలంగా డబ్బుంది. సంఘంలో బోలెడంత పలుకుబడి వుంది. ఎంతో మంది స్నేహితులున్నారు. జీవితాన్ని అన్ని విధాలా అనుభవ యోగ్యం చేసుకోటానికి యింతకంటే అవకాశాలు యింకేం కావాలి? వీటన్నిటిని తోసి రాజనేంతటి బలీయమైన ఆ బాధ ఏమిటి? ఎవరికోసం? సంధ్యదృష్టి చెదిరిన అతని జుట్టుమీద పడింది. మొదటిసారిగా అతన్నితాకి ఆ జుట్టుని సరిచెయ్యాలని, హృదయపూర్వకంగా రెండు చల్లటి మాటలు చెప్పి సేదతీర్చాలని అనిపించింది. మోచేతులవరకూ ముడుచుకున్న షర్ట్‌స్లీవ్స్ అలాగే వున్నాయి. ఫోంచేసిన తర్వాత వాటిని సరిచేసుకోవాలనే గుర్తు కాని, ఓపికగాని లేనట్టున్నాయి.

సంధ్య మెల్లిగా చప్పుడు కాకుండా లోపలికివచ్చి మంచినీళ్ళచెంబు టేబిల్ మీద పెట్టింది. దీపపు వెలుగులో దగ్గరగా కన్పిస్తున్న అతని ముఖంలో అలసట, ఆవేదన స్పష్టంగా ప్రస్ఫుటమౌతున్నాయి.

మంచినీళ్ళు పెట్టిన శబ్దం వినగానే మాధవ్ వులిక్కిపడి తలెత్తి చూశాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఆ క్షణంలో అతని ముఖంలో కన్పించిన భావనచూసి సంధ్య గుండెలు అవ్యక్తమైనబాధతో విలవిలలాడినాయి. భయంకరమైన వ్యధతో క్రుంగిపోయి, అశాంతిని, వంటరితనాన్ని తప్పించుకోలేక, జీవితం అంటే విరక్తి పుట్టి ఆత్మహత్యకి సిద్ధం కాబోతున్న మనిషిలా వున్నాడు.

సంధ్య పెదవులు అస్పష్టంగా కదిలాయి. కాని శబ్దం పైకి రాలేదు. మాధవ్ మొదట సంధ్యని అంత దగ్గరగా చూడగానే తెల్లబోయాడు. చాలాసేపటి నుంచి పరధ్యానంగా ఎక్కడో వున్నట్టున్న అతనికి క్షణం సేపు తను చూస్తున్నది కలో నిజమో అర్థం గాలేదు. అప్రయత్నంగా అతని చేయి ముందుకు కదిలి సంధ్య చేతిని పట్టుకోబోయి అంతలోనే ఆగి యధాస్థానంలోకి వచ్చేసింది.

"సంధ్యా!" అంటూ లేచి సరిగ్గా కూర్చున్నాడు.

సంధ్యకి మొదటిసారిగా అతనంటే



వున్న ఏవగింపు రూపు లేకుండా, ఛాయ మిగలకుండా అతి విచిత్రంగా మాయమైంది. అతని చేతిని తనే అందుకుని రెండు చేతుల్తో పట్టుకుని "ఏమిటి మిమ్మల్ని క్రుంగదీస్తున్న ఆ బాధ? నాకు చెప్పండి. నన్ను కూడా పంచుకోనివ్వండి" అని అడగా లని బలంగా అన్పించింది. మరో నిముషం అయితే అడిగేసేది కూడా. కానీ మాధవ్ సంధ్య పెదవి కదిపే అవకాశమే యివ్వకుండా కుర్చీలోంచి లేచి దూరంగా వెళ్ళిపోతూ "సంధ్యా! ఈ రోజు బాబు నా దగ్గిర వద్దు. నీ గదిలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టుకో!" అన్నాడు. అదే కంఠం. అదే నిర్లిప్తత.

సంధ్య అనదల్చుకున్న మాటలు నాలిక చివరే ఆగిపోయాయి.

మౌనంగా వెళ్ళి బాబుని తీసుకో బోయింది.

"నువ్వాగు. నేనేతీసుకువస్తా. నా

చేతుల్లో వన్నే తీసుకొచ్చి పడుకో బెట్టవే!" మాధవ్ వారిస్తూ మంచం దగ్గరికి వచ్చాడు.

అతని ప్రవర్తన ఏమాత్రం అర్థంగాని దానిలా అతని ముఖంలోకి వింతగా చూసింది. మాధవ్ ఆ చూపులు పట్టించుకోనట్టే ఎటుచూడకుండా బాబుని చేపనెత్తి భుజంమీద వేసుకున్నాడు.

సంధ్య గదిలోకి తీసుకువచ్చి పడుకోబెట్టి వెళ్ళబోయేముందు ఒక్క నిముషం ఆగి వాడినిపరీక్షగా చూశాడు. ఆ చూపుల్లో ప్రియాతి ప్రియమైన దాన్నేదో ఆఖరిసారి మరొక్కసారి కళ్ళారా చూసుకుంటున్న అనుభూతి వుంది. ఒకసారి బాబువైపు మరోసారి సంధ్యవైపు మార్చి మార్చి చూసిన అతను 'వస్తా' అంటూ వెళ్ళిపోయాడు మధ్యలో గుమ్మంచగ్గిర అరసెకను ఆగి "నేను తెల్లవారు ఝామున వెళ్ళి పోతాను. నువ్వు నిద్రలో వుంటావు. అందుకని యిప్పుడే చెప్తున్నా" అన్నాడు సంధ్య ఏదో చెప్పాలని పెదవులు తెరిచేలోపల అతను తలుపులు చేరవేసి వెళ్ళిపోనే పోయాడు.

47

తెల్లవారు ఝామున లేచి మాధవ్ వంట యింటివైపు వచ్చేసరికి సంధ్య అప్పటికే లేచి అక్కడ పని చూస్తోంది.

"నువ్వా!" అయా అనుకుని చొరవగా లోపలికి రాబోతున్న మాధవ్ గుమ్మంబైటే నిలిచిపోతూ విస్మయంగా చూశాడు.

"ఆయా లేవబోతుంటే నేనే వద్దన్నాను." మరుగుతున్న నీళ్ళు దించి ఫిల్టర్‌లో పోస్తూ అంది సంధ్య. పయిట నడుం చుట్టూ తిప్పి దోపుకుంది. పొడుగాటి జడ నడుస్తున్నప్పుడు కలిగే కదలికవల్ల అటు యిటు వూగుతోంది. రాత్రి నిద్రవల్ల చెదరిన వెంట్రుకల్లో ఒకటి రెండు చెంపల మీదుగా పడుతున్నాయి. వెనకనుంచి సంధ్యని తిలకిస్తున్న మాధవ్ లోపలికి రావాలో, లేక వెనక్కి వెళ్ళిపోవాలో నిర్ణయించుకోలేక తటపటాయిస్తూ నిలబడ్డ చోటే ఆగిపోయాడు.

"మీరు గడ్డం చేసుకోవటం పూర్తి చేస్తే - స్నానానికి నీళ్ళు కాగినాయి" పాలగిన్నె పొయిమీద పెడుతూ అంది సంధ్య.

అతను ఎప్పుడు వూరు వెళ్ళాలన్నా ప్రయాణం చేసేముందు స్నానంచేసి బైలుదేరటం అలవాటు గమ్యం చేరుకున్న అరగంట, గంటలో మళ్ళీ చేస్తాడు. ఈ అలవాటు ఎప్పుడయిందో అతనికే గుర్తులేదు

మాధవ్ గడ్డం చేసుకుంటుండగా సంధ్య స్నానానికి నీళ్ళు సిద్ధంచేసింది. అతను స్నానం ముగించి బట్టలు వేసుకోవటం పూర్తిచేసుకుని వంటయింటివైపు వచ్చేసరికి కాఫీకప్పు తెచ్చి అందిచ్చింది. కాఫీకప్పు అందుకునేటప్పుడు వేళ్ళు తగలకుండా జాగ్రత్తపడ్డాడు కానీ ఆమె ముఖంలోకి మాత్రం చూడకుండా వుండలేక పోయాడు

తలెత్తి తనవైపు సూటిగా చూస్తున్న ఆ కళ్ళలో ప్రశాంతత తప్ప అతనికి కనిపించలేదు.

మాధవ్ కాఫీకప్పు తీసుకుని పెరటి వైపు గుమ్మం దగ్గరగా వచ్చి నిల బడ్డాడు. పల్లెటూరి వాతావరణంలో తెల్లవారు ఝామున నిశ్శబ్దం, అందం వీటిని స్వయంగా అనుభవించాల్సిందే తప్ప చెప్తె తెలియదు. దొడ్లో గుబురుగా పెరిగిన చెట్టుకి విరగబూసిన నంది వర్ధన పూలు వెన్నెలతో పోటీ పడతా మంటున్నాయి.


"ఇంకో కప్పుకావాలా ?—" వెనక నుంచి అడిగింది సంధ్య

మాధవ్ కావాలన్నట్టు తలూపాడు.

సంధ్య మాధవ్ కప్పులో కాఫీ పోసి యిచ్చి, తాను అందిన కప్పు తీసుకుంది.

"నువ్వు తాగావా ?" అప్రయత్నంగా అడిగాడు.

సంధ్య లేదన్నట్టు తలూపి ఇంకో కప్పుతో తెచ్చుకుని వచ్చి మాధవ్ కెదురుగుండా నిలబడింది. కాఫీకప్పుల మీదనుంచి ఇద్దరికళ్ళూ కలుసుకున్నాయి. చూపులు బంధించుకున్నాయి ఒకళ్ళని ఒకళ్ళు చూసుకుంటూ అలాగే నిలబడి పోయారు. దూరంగా అప్పుడే మేల్కొంటున్న కోళ్ళ కొక్కొరొకో అన్న కూతలు, చెట్లమీద నిద్రలేస్తున్న పిట్టల కలకలం తప్ప యింకే శబ్దమూ లేదు. సంధ్య ముఖం ప్రశాంతంగా నిర్మలంగా, దొడ్లో రాత్రి పూచిన



తడిసిన నంది వర్ధనపు పువ్వులా వుంది. తనపైపు రెప్పవాల్చకుండా చూస్తున్న ఆ కళ్ళలో లీలగా ఆపేక్ష కూడా తొంగి చూస్తోంది. రాత్రంతా నిద్రపోయి ఎరుగని తన కళ్ళు భ్రమ పడుతున్నాయేమో అనుకున్నాడు మాధవ్. తను ఎలాగూ తిరిగిరావటం లేదు. వెళ్ళిపోయేముందు అతి నిర్మలంగా, అతి ప్రశాంతంగా వున్న యీ సమయంలో సంధ్యని ఒక్కసారి దగ్గరకు తీసుకుంటే! ఎలాటి ఉద్రేకం లేకుండా స్థిరమైన మనసుతో ఒక్కసారి ఆ భుజాలచుట్టు చేతులువేసి దగ్గరకు లాక్కుని హృదయానికి హత్తుకుంటే! "నువ్వు నా దానివి కాకపోయినా, కాలేకపోయినా నేను ఎప్పటికీ నీ వాడనే! ఇంకెన్ని వేయిరెట్లు బాధపెట్టినాసరే జన్మజన్మాలకి, యుగయుగాలకి నాకు నువ్వే కావాలి." అనిచెప్తే! ఎప్పటిలా సంధ్య నిర్లక్ష్యంగా కఠినంగా వుంటే బహుశా అతను సందేహించేవాడు కాదేమో! కానీ సంధ్య కళ్ళలో కన్పిస్తున్న యీ నూతనమైన ప్రశాంతత అతన్ని బెదిరించి దూరంగా నిలబెట్టింది. అలా మామూలుగా, ఏ చిరాకులేకుండా వున్న సంధ్యని చూడటం అతనికిది మొదటి సారి. ఎంతబాగుంది. ఎంత అమాయకురాలిలా, సౌజన్య మూర్తిలా వుంది. తమాషా! ఎప్పుడూ ఆకళ్ళమీద ఆవరించుకుని వుండే విషాద చ్ఛాయకూడా యిప్పుడు లేదు.

"రాత్రి మీరు ఎందుకలా వున్నారు?-" వున్నట్టుండి అడిగింది సంధ్య.

మాధవ్ వులిక్కిపడ్డాడు. "ఎలా వున్నాను?" అన్నాడు.

"ఎలాగో వున్నారు."కాఫీ కప్పులోకి చూస్తూ అంది

మాధవ్ ముఖం తిప్పుకుని పైట వెన్నెల్లోకి చూస్తుండిపోయాడు. అతనికి వెంటనే సంధ్య రెండు భుజాలు పట్టుకుని గట్టిగా వూపి "నే నెలావుంటే నీ కెందుకు? నీ కేమైనా అన్పిస్తుందా? చెప్పు." అని అడగా లనిపించింది. హఠాత్తుగా సంధ్య చూపుతున్న యీ మనువు అనిశ్చెలాగో వుంది. బహుశా రాత్రి తనని అలా చూడటం వల్ల జాలి పడుతోందేమో! అది కేవలం జాలే అయితే అంతకంటే భరించరాని అసహ్యం యింకోటిలేదు. జాలికంటే సంధ్య చూపే ద్వేషమే తనకి బాగుంటుంది. ఆ ద్వేషంలో ఇద్దరిమధ్య ఓ బంధం వుంది కాబట్టి.

మాధవ్ తను అడిగిన ప్రశ్నకి జవాబు ఇవ్వకపోగా గిరుక్కున ముఖం త్రిప్పుకోవటం చూడగానే సంధ్య మనసు చిన్నబోయింది, ఔను. తను అడిగినదానికి వెంటనే సమాధానం చెప్పాలని ఎక్కడుంది? వెంటనే కాదు, అసలు సమాధానమే చెప్పనవసరం లేదు అనిబాధలు పంచుకోటానికి. అడక్కపోయినా ఆదరం చూపించటానికి ఎవరు తను! బంధువా? స్నేహితురాలా ఆప్తురాలా! ఎవరని? ఆ యింట్లో తన స్థానం గుర్తురాగానే హద్దుమీరి ప్రవర్తించానేమోనని అభిమానపడి సిగ్గుతో తల దించుకుంది.

దాదాపు అరగంట పోయిన తర్వాత

అతను ఆయాని కూడా లేపి వెడుతున్నానని చెప్పి బైటకి వచ్చాడు. గోవిందు అప్పటికే సామానది కారులో పెట్టి అంతా సిద్ధం చేశాడు. ఆయా లేచి రాబోతుంటే మాధవ్ ఆప్యాయంగా భుజంమీద తట్టి వద్దని వారించాడు. ఆరోగ్యం జాగ్రత్త అని హెచ్చరించాడు. అతని కంఠం గంభీరంగా వున్నా, కను కొలకులు తడి అవటం ఎవరూ గ్రహించలేదు. అదే గదిలో మరో వైపునున్న మంచం మీద బాబు ఓ ప్రక్కకు వత్తిగిలి పడుకుని గాఢ నిద్రలో వున్నాడు. క్షణంలో సగంసేపు వాడిమీద నిల్చింది అతని దృష్టి. మరుక్షణమే తల తిప్పుకుని బైటకి వచ్చాడు. తన వెనకే వస్తున్న సంధ్యని వద్దని చెప్పాలని ఎంతగా అన్పించినా చెప్పలేకపోయాడు.

సగం దిగువవున్న మెట్లమీద మళ్ళీ యిద్దరూ ఆగిపోయారు సంధ్య పై మెట్టుమీద వుంది. క్రింద మెట్టుమీద వున్న మాధవ్ ఆగి సంధ్య వైపు చూశాడు. మళ్ళీ ఒకే ఒక నిమిషం కాలం నిల్చిపోయింది. పైనుంచిపడుతున్న వెన్నెల్లో సంధ్య కాటుకకళ్ళు మెత్తగా నవ్వాయి. అతని గుండె లయతప్పింది. ఏదో చెప్పటానికి తెరుచుకోబోయిన పెదవులు అంతలోనే ఆగిపోయినాయి. వెంటనే గిరుక్కున తిరిగి చకచకా మెట్లుదిగి వెళ్ళి కారులో కూర్చున్నాడు. సంధ్యయింకా అక్కడే బొమ్మలా నిలబడి చూస్తోందని అతనికి తెలుసు. అయినా ఎలాటి స్పందన కలగలేదు. ఇదే చిరునవ్వు, ఇంకా స్తపసుపే కొన్ని నెలలక్రితం సంధ్య ముఖంలో కన్పించినట్టయితే సంధ్యని బలవంతంగానైనాసరే తన దానినిగా చేసుకుని తీరేవాడు. ఇప్పుడు వేరు. చాలా సేపటినుంచి మంచుముద్ద మధ్య నొక్కిపట్టిన శరీరంలా అతని మనసుకూడా మొద్దుబారిపోయివుంది. ఏ అనుభూతి లేదు బాధగాని, ఆవేదనగాని అసలే లేదు ఎంతో ప్రయత్నంమీద, ఎంతో సాధనవల్ల అతనీ జడత్వానికి రాగలిగాడు. కారు కాంపౌండ్ గేటు దాటింది. తూర్పున చీకట్లు చెల్లాచెదురవుతున్నాయి. ప్రపంచం అంతా ఎర్రటి కాంతితో అదోరకంగా వుంది. కారు వీధి మలుపుకూడా తిరిగింది. మాధవ్ వెనక్కు జేరగిలబడి కాళ్ళమీద చేతులానించుకున్నాడు. చాలారోజుల నుంచి యావచ్ఛక్తిని వినియోగించి చిక్కబట్టుకున్న బాధ ఒక కన్నీటి బొట్టుగా మారి, బలవంతాన మూయటానికి ప్రయత్నిస్తున్న బరువైన రెప్పలకి తిరగబడి బైటకి జారింది.

కమల : ఈ మగాళ్ళు వాళ్ళలోవాళ్ళు ఏం మాట్లాడుకుంటారో !"

విమల : "ఆడవాళ్ళు మాట్లాడుకునేవే మాట్లాడతారనుకుంటాను."

కమల : "ఛీ ఛీ. అసయ్యం."

48

మాధవ్ వెళ్ళి దాదాపు రెండు నెలలు అవుతోంది. ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో కూడా జవాబులేదు. ఆయా ఒకటే ఖంగారు పడుతోంది గోవిందు నేత కంపెనీకి కబురుచేస్తే బిజినెస్ టురుమీద కలకత్తా దగ్గర ఏదో ఊళ్ళో వున్నాడని చెప్పారు. అతను ఎక్కడున్నా ఏం చేస్తున్నా బాబు క్షేమం అడుగుతూ వుత్తరం యిన్నాళ్లు వ్రాయకపోవటం సంధ్యకి కూడా ఆశ్చర్యంగానే వుంది. ఆఖరిరోజున అతని ప్రవర్తన, ఆ మాటలు గుర్తుకొస్తే ఎలాగో అనిపిస్తోంది. ఇల్లు కట్టటం పూర్తయిపోయింది కాని మాధవ్ రాందే అతనికి చెప్పందే యెలా వెళ్ళటం అంటోంది ఆయా.

మాధవ్ వుత్తరంకోసం ప్రతిరోజు మధ్యాహ్నం ఎదురు చూడటం సంధ్య దినచర్యలో ఒక ముఖ్య భాగమై పోయింది. ఆరోజు మాధవ్ పేరుమీద యింకెవరో వ్రాసిన వుత్తరం వచ్చింది. అతని వుత్తరం కోసం ఎదురుచూస్తున్న సంధ్య చిరాకులో అది ప్రక్కన పడేసింది.

సాధారణంగా ఎప్పుడో తప్ప అతనికి ఎక్కడి యీ యింటికి వుత్తరాలు రావు.

"తెరిచిచూడు. ఎవరు వ్రాశారో, ఏమైనా ముఖ్యమైన పనేమో!" అంది ఆయా. సంధ్య వుత్తరం తిప్పి తిప్పి చూసింది. ఫ్రమ్ అడ్రస్ లేదు. దస్తూరి అందంగా చిన్నగా కోమలంగా వుంది.

"తీసిచూడు. తప్పేముంది." ఆయా రెండోసారి హెచ్చరించటంతో సంధ్య అయిష్టంగానే తెరిచింది. అందులో ఇంగ్లీషులో యిలా వుంది.

మిస్టర్ మాధవ్!

నేను యీ కొత్త హాస్పిటల్‌కి మారిన తర్వాత బొత్తిగా నీ సంగతులు ఏమీ తెలియటంలేదు. మీ హాస్పిటల్ ఎలా నడుస్తోంది? చి॥ బాబు ఎలా వున్నాడు? వాడిని చూసి చాలా రోజులైంది. ప్రస్తుతం నా ఆరోగ్యం అంతగా బాగుండటంలేదు డాక్టర్లు ఎక్కడైనా ప్రశాంతంగా వున్నచోట నిర్మలంగా కనీసం రెండు మూడు వారాలయినా గడిపి విశ్రాంతి తీసుకోమని మరీ మరీ హెచ్చరిస్తున్నారు. నాకు తెలిసినంతవరకూ అలా శాంతిని ప్రసాదించే స్థలాలుగాని. మనుష్యులు కాని లేరు నువ్వుండేచోటు పల్లెటూరు అని. మీ యిల్లు చాలా విశాలమైనదని. చాలా సౌకర్యంగా వుంటుందని నీ మాటలద్వారా చాలాసార్లు విన్నట్టే నాకు గుర్తు నీకు అభ్యంతరం ఏమీ లేకపోతే నేను వచ్చి వారం పది రోజులపాటు వుంటాను. బాబుతో కొద్దికాలం సరదాగా గడిపినట్టూ వుంటుంది, నాకు విశ్రాంతీ లభిస్తుంది. నాకీ సంగతి వెంటనే తెలియ జేయి. నా రాకకి అభ్యంతరం చెప్పవనే గాఢంగా నమ్ముతూ,

ఇట్లు,
సిస్టర్

ఉత్తరాన్ని రెండుమూడు సార్లు

చదివి నొసలు చిట్లిస్తూ ఆలోచన్లో పడి పోయింది సంధ్య.

"ఎవరి దగ్గరనుంచి?" ఆయా ఆదుర్దాగా అడిగింది.


సంధ్య చెప్పింది.

"అయితేవెంటనే రమ్మనమనిరాయి. ఆయన లేకపోతేనేం? పాపం ఆవిడ అంత యిదిగా రాస్తుంటే! మనం మనుష్యులం కాదా? అస లాయన వెళ్ళి చాలా రోజులయింది. కాబట్టి యీ పూటో రేపో రావచ్చుకూడా. ఒకవేళ ఆయన రాడే అనుకుందాం. రాక పోయినా ఫర్వాలేదు. యీ లంకంత కొంపలో కాస్త సందడయినా వుంటుంది."

అంటూ సంధ్య ఆరోజే జవాబు వ్రాసేవరకూ ఆయా వదిలి పెట్టలేదు.

"మాధవ్ వూళ్లో లేరు. అయినా ఫర్వాలేదు. మీ రాకకి ఏం అభ్యంతరం లేదు. తప్పకుండా రండి. రెండువారాలు కాదు, నాలుగువారాలు రెస్ట్ తీసుకున్నా మాకు ఇబ్బందిలేదు. నేను బాబుకి ఆయాగా వుంటున్నాను. ఈ ఇంట్లో ప్రస్తుతం నేను మా అమ్మ తప్ప యింకెవరూ లేరు. బాబు అల్లరి మీరు స్వయంగా కళ్ళతో చూడవలసిందే. మీరు ఫలానరోజు వస్తానని టెలిగ్రాం ఇస్తే స్టేషన్‌కి కారు పంపిస్తాను. కారు నంబరు మీకు తెలిసే వుంటుంది." అని తప్పకుండా రమ్మన మంటూ మరీ మరీ ఆహ్వానిస్తూ జవాబు వ్రాసింది సంధ్య. ఆవిడ రాకవల్ల ఇంటికి కాస్త సందడి వస్తుందని ఆయా ఆలోచిస్తుంటే, మెల్లిగా ఆవిడద్వారా బాబు పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకో వచ్చునని సంధ్య ఆశించింది.

(సశేషం)



'శమిత'

తులసీ కృష్ణ

'ఇంకా సర్దవలసిం దేమి'న్నట్లుగా ఆలోచించింది శారద. ఇంకేమీ లేదు, ఇంకేమీలేదు. కానీ, యేదో సర్దవలసినట్లుగానే తోస్తోంది. అదే మిటో జ్ఞప్తి రావటంలేదు.

శ్రీహరి వేసుకున్న పడక్కుర్చీ, విడిచేసిన చొక్కా, బల్లపైనున్న 'సిగరెట్ యాష్ ట్రే' అన్నీ ఒక్కొ కటి ఒక్కొక శ్రీహరిలా తోచి చీకా కేసింది.

అయిపోయింది. ఇంకో అర్ధగంట మాత్రమే టైముంది. అంతటితో ఆ గుచ్చి గుచ్చి చూసే వాటికీ తనకూ యే సంబంధం ఉండదు. వీటిని గురించిన ఆలోచనల భారం తనమీద ఉండదు. ఇంతే కదా యీ జీవితం? మమకారం వున్నన్ని నాళ్ళు చీపురు కట్ట గూడా దాచుకోవలసిన వస్తువు లానే కనబడుతుంది.

శ్రీహరిమీదా, యీసంసారం మీదా విరక్తి కలిగింది తనకు. గడచిన నాలు గేళ్ళపాటు కాలమూ, యీ విరక్తిని బల పర్చేందుకే వినియోగింపబడింది. అందులో యెక్కడేనా నవ్వుకున్న గుర్తులూ, సంతోష మనుభవించిన స్మృతులూ, వుంటే వాటిని పోషించిన ఉదారత శ్రీహరిది కాదు. యధార్థం తెలీని మనస్సు వూహించిన, అంద మైన, ఆశావహమైన వూహ అది. అది అసలు సంతోషం కానేకాదు. సంతోష మనుభవించడం దాకా యెందుకు? సంతోష మనుభవించాలనే కోర్కె కూడా లేనంతటి చైతన్య శూన్యురాల్ని చేశాడీ శ్రీహరి!

ఎప్పుడోవస్తాడు! సంతోషమంతా స్నేహితులకు పంచేసి, పుట్టెడు విసు గుతో పెళ్ళాన్ని ముంచెత్తటానికి. అప్పుడేమౌతుంది?

మూసి వుంచిన తలుపులు, మూసు కున్న అతని హృదయ ద్వారాన్ని తెఱచి, అతని తప్పుల్ని యెత్తి చూపు తోంటే పశ్చాత్తాప పడతాడు, తనంత నిర్లక్ష్యం చెయ్యదగ్గది కాదని తెలుసు కుంటాడు. కానీ, తనకేమీ సంబంధం లేదు. అతని బాధకు, తను వోదార్పు నందించలేదు. ఇంక 'తను' — తనే! తానులో, అతను, లేడు. తన 'డిగ్రీ' ప్రయోజనంతో అతి విశాలమైన, సమ్మోహనమైన స్త్రీ స్వాతంత్ర్య లోకంలోకి అడుగిడ బోతోంది. ఈ పూర్వాశ్రమ జీవితంలోని నిరాశలు, నిట్టూర్పులు, కన్నీళ్ళ నించీ అప్పుడు తనకు విముక్తి కలుగుతుంది.

ఆమె లేచి అటూ యిటూ తిరిగింది. హఠాత్తుగా యేదో మఱచి పోయిన విషయం జ్ఞప్తికొచ్చి నట్లయింది. అవును, యిదేనేమో? ఇది చెయ్యక పోవడం వల్లనేమో యెక్కడో, యేదో వెలితి కన్పిస్తోంది. ఆమె చిన్న కాగితం

ముక్కలు చించి, 'సూట్ కేస్' తాళం తెరిచి పెన్నందుకుని వ్రాయసాగింది.

శ్రీ హరిగారికి,

నేను వెళ్ళిపోతున్నాను. ఈ జన్మకి మీతో గడిపిన పాతికేళ్ళ సాంసారిక జీవితం చాలు! దాన్ని గురించి వ్యాఖ్యానంచేసి పెంచటం, తెంచుకోవాలనుకున్న నా కిష్టంలేదు. అందమైన, విశాలమైన యిల్లు, దాచుకోటాని కూడా వోపికలేనన్ని సిల్కు చీరెలు! జీవితం విలువైనదే, కానీ, పంజరం బంగారందైనంత మాత్రాన, బంధించబడిన పక్షికేమీ లాభం లేకపోవటమేగాక, పైగా వెక్కిరింపుగా తోచి, దాని కింకా కుమిలింపు కావొచ్చు!

ఇంతకు క్రితమే నన్ను చూడాలని మా జనార్దనం బావొచ్చాడు. ప్రస్తుతం యిద్దరం కలసి మా పుట్టింటికి వెళ్ళుతున్నాము. అక్కడ కొంత కాలం ఉంటాను.

ఇట్లు,
శారద.

ఆమె వ్రాసింది ఒక్కసారి చదువుకుని డ్రాయర్ సొరుగులో పడవేసి, మూయకుండా అలాగే వుంచేసి, దాని పైన ఓ సిగరెట్ పాకెట్ వుంచేసింది.

సామాన్లు బైటచేర్చి - తలుపులేసి, తాళం పక్కింటామెకిచ్చి,ఆయనొస్తూనే భద్రంగా అందించమని చెప్పాలనుకుంది. కానీ, యిప్పుడాలోచిస్తే అందులో యిబ్బంది వుంది. ఆమె అడిగే అర్థంలేని ప్రశ్నలకు, అబద్ధపు జవాబులు చెప్పవలసి వుంటుంది. అదీ కాక, యెవరో అన్నట్లు 'లేచివెడుతూ మొగుడికి వంకాయవండిపెట్టమందట అలాగుంది.

వస్తోన్న 'రిక్షా' వాపి, ఐదునిముషాల్లో 'స్టేషన్' చేరుకుంది. రైలు అరగంట లేటవటం యేదో అపశకునంలా తోచింది. తనపేరు మీదుగా పిలుపువిని వెనక్కిచూస్తే, పరిచయమైన, 'పద్మనాభం, అనే కుర్రవాడు! ఉత్సాహంతో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. ఒకానొక సమయంలో పద్మనాభం, అనే కుర్రవాడడిగే మామూలు ప్రశ్నలకు, యింతగా ఆలోచించవలసి వుంటుందనీ, యింత సందేహావడవలసి వుంటుందనీ, యింతకు ముందెన్నడూ తోచలేదామెకు!

ఇంత ధైర్యంచేసి, యిన్నాళ్ళ దాంపత్య బంధాన్ని తెంచెయ్యటానికి సిద్ధపడి, ముందున్న సుదూరమైన జీవిత పథం వెంట, వొంటిగా పయనించటానికి సాహసించిన తను, యీ కుర్రవాడి దగ్గర యింత పతనం చెందటం తట్టుకుంటే, ఆమె కేదో భయం, నిస్పృహ, తనమీద తనకే అవిశ్వాసం కలుగుతోంది.

అలజడిపడే హృదయాన్ని సరిదిద్దుకోటానికి, ఆమె వెయిటింగ్ రూముకి వెళ్ళబోయి ముందుకు చూచి వులికి పడింది. జనార్ధనం బావ, మరో అతని చేయి పట్టుకుని, 'ప్లాట్ ఫారమ్' ఆ చివరినించీ వస్తోన్నాడు!

ఆమె చప్పున 'దొంగ' దాక్కొన్నంత వడిగా, 'వెయిటింగ్ రూమ్'లో దూరింది. వాళ్ళిద్దరూ అలా వచ్చి శారద కెదురుగా మాట్లాడుకుంటో న్నారు. శారద మరోవేపు తల త్రిప్పి, అద్దంలో చూస్తోంది. ముఖమంతా వాడి, తనది కానట్లే వుంది.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటూనే యింకా ముందు కెళ్ళిపోయారు. వాళ్ళ మాటల్లో జనార్దనం బావ తనువెళ్ళబోయే రైలు కోసమే వున్నట్లు తెలుసుకుంది. ఎంత చిత్రం? రెండేళ్ళనించీ కనపడని బావ, యివాళ తనెక్కబోయే రైల్లోనే ప్రయాణించటానికి, (ఒక్క రైల్లోనేయేం, ఒక్క చోటికే కావొచ్చు!) వచ్చాడు! బహుశా మామూలు సంఘటనే కావొచ్చు! కానీ, యిదేదో మెరుపులా హృదయాన్ని చీలుస్తోంది. ఎన్నో అనుభవాల, తెలుల కావలి రహస్యాన్ని వెలికి తేవాలని తీవ్రయత్నం చేస్తోంది! ఆ సంఘర్షణలో ఆమె తల తిరిగిపోయింది.

ఏమిటి? — అదేమిటి?

'ఇంత క్రితమే నన్ను చూడాలని మా జనార్దనం బావొచ్చాడు! ప్రస్తుతం మేమిద్దరం కలసి —' అవును, ఎందుకలా అబద్ధం వ్రాయవలసి వచ్చిందితాను? దానర్థమేమిటి? వీళ్ళెప్పుడయినా, శ్రీహరిని వీలైనంత 'హింస'కు గురి చేయాలన్న నీచమైన ఆలోచనా? లేక, — లేక, శ్రీహరితో దాంపత్యం త్యజించాలనీ, ద ని పర్యవసానం, జనార్దనం బావతో పారిపోవడమే ననే ఆలోచన, తనలో దాక్కొనివుందా?!

మరిప్పుడీ ఆలోచన యెందుకని కలుగలేదు? జనార్దనం బావతో కలసి వెళ్ళలేదనీ, తనొక్కతే వెళ్తోందనీ, తనకు మాత్రమే పరిమితమైన ఆత్మతృప్తి కారణంగా యిదేమీ స్ఫురించ లేదా? మరిప్పుడు — తనలో యెప్పుడో పడిన దోషంకూడా, ఈ క్షణంలో పెరిగి విజృంభించి, తన్నులోబఱచుకోటమేనా? — వీల్లేదు. ఆమె 'సూట్ కేస్' అందుకుని స్టేషన్ బైటికి చేరుకుంది. ఇల్లు చేరుకుంటున్న ఆమెలో ఒకేవిషయం రొద చేస్తోంది. శ్రీహరి వచ్చి, తను వ్రాసిన కాగితం చదివి వుంటే, ఈ 'కత' కు ముగింపేమిటి?

ఆమె మూసిన తలుపులు, ఆమే మళ్ళీ తెరిచేసింది. సొరుగులో వున్న కాగితం తీసి చించి చెత్తబుట్టలో పడవేసింది. ఎక్కడి వక్కడ సర్దేసి, జబ్బుపడి లేచిన దానిమల్లే, ఆయాసంతో, పడకుర్చీలో వాలిపోయింది. గోడనున్న గడియారం అయిదున్నర చూపెడు తోంది. 'ఒక్కగంట' — అనుకుంది.

ఒక్క గంటలో, యుగాలనాటి తన లోపలి పేడి పై కుబికి, భూమి కంపించి, క్రుంగిపోటానికి యత్నించి, ఏ బలంతో మళ్ళీ తన 'వునికి'ని సాధించుకో గలిగిందో, మరో గంటకు యింటికి చేర్చిన శ్రీహరికి తెలీనే తెలీదు —

***

మిస్ శోభాదేవి

పెనుమర్తి సూరి

"వచ్చావా శోభా! ఇందాకటి నుంచీ నీ కోసమే వెయిట్ చేస్తున్నా" అంటూ అప్పుడే లేడీస్ వెయిటింగ్ రూములోకి వస్తున్న శోభ దగ్గరకి వెళ్ళింది పార్వతి.

వెయిటింగ్ రూమంతా గరల్ స్టూడెంట్లతోటి హడావిడిగా ఉంది. ఫైనల్ బెల్‌కి ఇంకా పది నిమిషాలు పైముంది.

"ఏమిటోయ్ గిరాకీ! చాలా హుషారుగా ఉన్నావే! ఏమిటి విశేషం?" అక్కడే వున్న ఒక కుర్చీలో కూర్చుంటూ అడిగింది శోభ.

శకుంతలతో నీ తరపున పది రూపాయలు పందెం వేశానోయ్."

"నా తరపునా!"

"అదేనోయ్. రేపు సాయంత్రం టెన్నిస్ ఫైనల్సుగా, మీ అన్నయ్య గెలుస్తాడని నేను, ప్రసాద్ గెలుస్తాడని శకుంతల పదిరూపాయలు పందెం వేసుకున్నాం."

"చంపావ్ పో. మా అన్నయ్య ఈ మధ్య సరిగ్గా టచ్‌లో లేడు కదోయ్"

"అదేమిటోయ్ అట్లా అంటావ్. నీ మీద భరోసాతో నేను పందెం కాస్తేనూ!"

"నేను ముందరే చెప్పానోయ్ శోభా. మీ రామం అన్నయ్య గెలవ లేడని" వాళ్ళ దగ్గరికి వస్తూ అంది శకుంతల. "ప్రసాద్ ఇప్పుడు డెడ్లీ ఫారమ్‌లో ఉన్నాడు. అతన్ని ఎవ్వరూ గెలవలేరు. అది కాకుండా మీ బ్రదర్ ఈ మధ్య టచ్‌లో లేడుగదా!"

"అయితే నా పది రూపాయలకు నీళ్ళు ఒదులుకో వచ్చంటావా శోభా." నీరసంగా అడిగింది పార్వతి.

శకుంతల ఫక్కుమని నవ్వింది. "మహ చక్కగా వదులుకోవచ్చు. ప్రసాద్ తప్పకుండా గెలవడమే కాకుండా స్ట్రెయిట్ సెట్స్‌తో గెలుస్తాడు."

శోభకి ఎక్కడలేని పౌరుషం వచ్చింది. "నాన్సెన్స్! మా అన్నయ్యని మరీ అంత తేలిగ్గా తీసెయ్యకు. ఎంత టచ్‌లో లేకపోయినా ప్రసాద్‌ని కొట్ట కలడులే."

"నిజం," ఎగిరిగంతేసింది పార్వతి. "నిజంగా గెలుస్తాడంటావా? అఫ్ కోర్స్ నువ్వన్నావంటే దానికి తిరుగు లేదనుకో...."

"ఏమిటే పార్వతీ! ఏమిటా తిరుగు

లేక పోవడం! "అప్పుడే రూములోకి అడుగు పెట్టిన రాధ అడిగింది.

వెంటనే శకుంతల అడిగింది. "నువ్వు చెప్పవోయ్ రాధా. రేపు టెన్నిస్ ఫైనల్సుగా. ప్రసాద్ గెలుస్తాడంటావా? రామం గెలుస్తాడంటావా?"

"ఇంకా అనుమానం దేనికి. ప్రసాదే."

"నేనూ అదే అన్నాను. కాని రామం గెలుస్తాడని నాతో పది రూపాయలు పందెం వేసింది పార్వతి."

"అయితే ఇంకాయేం! ఆ పది రూపాయలు వచ్చేసినట్లే లెక్క వేసుకో." నవ్వుతూ అంది రాధ.

శోభకి ఒళ్ళు మండింది. "పోనీ నువ్వుకూడా ఒక పది సంపాదింతువుగాని బెట్ కాయరాదూ?"

"తప్పకుండానూ. పది రూపాయలు వస్తూంటే ఒద్దంటానా! నీతోనే పందెం పది రూపాయలు. సరేనా?"

సరేనని ఒప్పుకుంది శోభ.

అక్కడే కూర్చున్న అమృత కూడా ప్రసాద్ గెలుస్తాడని పది రూపాయలు పందెం కాస్తానంది ఎవ్వరితోనైనా సరే. వెంటనే స్వర్ణ రామం గెలుస్తాడని ఆ పందానికి ఒప్పుకుంది. స్వర్ణకి అసలు టెన్నిస్ విషయం తెలియకపోయినా శోభ అంటే పడని నమ్మకం. ఆ విషయమే పైన పెట్టింది. "శోభ ఎట్లా అంటే అట్లా అయితీర వలసిందే. శోభ వాళ్ళ అన్నయ్య గెలుస్తాడంది కాబట్టి అతనే గెల్చి తీరుతాడు."

చివ్వరికి ఈ పందాల్లోకి దాదాపు అక్కడున్న ఆడపిల్ల లందరూ దిగారు. కొంతమంది ప్రసాద్ గెలుస్తాడని పందెం వేశారు. శోభమీద నమ్మకంతో రామం గెలుస్తాడని కొంతమంది కాశారు. ఈ హడావిడిలో ఫైనల్ బెల్ అయేటప్పటికి ఒక్కరొక్కరే తమ తమ క్లాసులకి వెళ్ళడం మొదలెట్టారు. శోభా, పార్వతి కూడా లేచారు. పార్వతి తన క్లాసుకి పోబోతూ "శోభా పది రూపాయిల సంగతి దేముడెరుగు. ఇప్పుడు ఇదొక 'ప్రిస్టేజి క్వశ్చన్' అయింది. మీ బ్రదర్‌కి చెప్పు. ఎట్లాగేనా జాగ్రత్తగా ఆడి రేపు గెలిచేటట్టు చూడు. లేకపోతే మన పరువు పోతుంది" అంది.

"చూదాం కానీ" అంటూ శోభ కూడా తన క్లాసులోకి వెళ్ళింది.

ఆడపిల్లలు ఈ విధంగా పందాలు వేసుకున్నారన్న విషయం ఫైల్డ్ ఫైర్‌లా కాలేజీ అంతా వ్యాపించింది. వెంటనే మగ పిల్లలు కూడా పందాలు మొదలెట్టారు. ఉత్త కాపీ రాయుళ్ళాయెను. కొంతమంది రామం వైపు కొంతమంది ప్రసాద్ వైపు, పందాలు కాశారు. ఈ వార్త రామానికి, ప్రసాద్‌కి కూడా తెలిసింది. ప్రసాద్ విని నవ్వుకున్నాడు. రామానికి మాత్రం ఒళ్ళు మండింది. విచారించగా తెలిసింది ఈ పందాలు అనేవి అసలు శోభ వల్లనే మొదలైనాయని. శోభ మీద ఎంతేనా కోపం వచ్చింది.

సాయంత్రం ఇంటికి వెళ్ళి శోభను చూసేటప్పటికి ఆ కోపమంతా



కట్టలు తెంచుకుని బైటి కొచ్చింది. "ఏమే శోభా! ఏమిటిది? నీకేం మతిపోయిందా! ఈ పందాలేమిటి? ఇదంతా నువ్వే మొదలెట్టా వంటున్నారంతా. నీ కేమేనా బుర్ర ఉందా" అంటూ కేకలేయడం మొదలెట్టాడు.

శోభ నవ్వింది. "అదేమిట్రా! అట్లా అంటావ్? అవును నువ్వు గెలుస్తావని పందెం వేశాను. నా మీద నమ్మకంతో నా ఫ్రెండ్సు పందెం కాశారు. ఏం! కొంపతీసి ఓడిపోతావా ఏమిటి?"

"ఏడవలేక పోయావ్. నేనేమో ఈ మధ్య సరిగ్గా టచ్‌లో లేనాయెను. ప్రసాద్ బాగా ప్రాక్టీసులో ఉన్నాడు. నే నెట్లా గెలుస్తా ననుకున్నావ్?"

"నాన్సెన్స్. అయినా నువ్వే గెలుస్తావని నాకుంది. అసలు అదికాదు. నువ్వు ఎట్లాగేనా సరే, గెలిచి తీరాలి. ఇది ఇప్పుడొక ప్రిస్టేజి క్వశ్చన్ అయి కూర్చుందిరా! బాబ్బాబు!! ఎట్లాగేనా సరే రేపు నువ్వు గెలవాలి. లేకపోతే నా పరువు వుండదు." రామం గెడ్డం పుచ్చుకుని బతిమాలుతూ చెప్పింది శోభ.

"నీకు బుద్ధిలేదే అమ్మాయ్" అంటూ శోభ చెయ్యిని విసురుగా తోసేసి రాకెట్ పుచ్చుకుని క్లబ్ కి వెళ్ళాడు ప్రాక్టీస్‌కోసం.

మరునాడు కాలేజీలో స్టూడెంట్లు ఎక్కువగా ఆ రోజు జరగబోయే టెన్నిస్ మ్యాచ్ గురించే మాట్లాడుకోడం మొదలెట్టారు. 'రామం పెద్ద ఆటగాడేకాని, టచ్‌లో లేడోయ్' అని కొందరు. ప్రసాద్ ప్లేలో పవర్ లేదని కొందరు, అయినా బేస్‌లైన్ ప్లేలో గట్టివాడని మరికొందరు. కాని రామానికి ఉన్న స్టామినా ప్రసాద్‌కి లేదని కొందరు. స్టామినా ప్రశ్నే లేదు. స్ట్రెయిట్ సెట్స్‌తో రామంమీద గెలుస్తాడని కొందరు — ఈ విధంగా ఎవరికి తోచినట్లు వాళ్ళు కామెంట్ చెయ్యడం మొదలెట్టారు. సాయంత్రం నాలుగంట లెప్పు డవుతుందా అని కూర్చున్నా రంతా.

అంత ఆత్రంతో నిరీక్షించిన సాయంత్రం అవనే అయింది. చాలా మంది స్టూడెంట్లు టెన్నిస్ కోర్టుకి జేరుకున్నారు. శోభ, పార్వతి, శకుంతల, అమృత, స్వర్ణ మొదలైన చాలా మంది ఆడపిల్లలు కూడా అక్కడికి చేరుకున్నారు.

రామం, ప్రసాద్‌లు కోర్టులోకి వస్తున్నప్పుడు అందరూ కరతాళ ధ్వనులతో వాళ్ళని ఆహ్వానించారు. ప్రసాద్ అందర్నీ నవ్వుతూ విష్ చేశాడు. రామం మాత్రం అందరివంకా కోపంగా చూడ్డం మొదలెట్టాడు. ముఖ్యంగా శోభ వంక మరీ కోపంగా చూశాడు.

కొద్దిసేపట్లో ఆట ప్రారంభమయింది. కాని ఎంతో 'టెన్షన్' ఉంటుందనుకున్న ఆట చాలా పేలవంగా జరగటం మొదలెట్టింది. రామం ఆట మరీ అధ్వాన్నంగా ఉంది. అతని సర్వీస్‌లో

'పవర్' లేకపోడమే కాకుండా చాలా భాగం డబుల్ ఫాల్ట్సు అవుతున్నాయి. మొదటి సెట్టు ప్రసాద్ 6.0 తో గెలిచాడు. ఎంతగానో ఆశించిన ప్రేక్షకులందరికీ చాలా ఆశాభంగం అయింది.

రెండో సెట్ మొదలయింది. కాని రామం ఆటలో మాత్రం మార్పు లేదు. 'డబుల్ ఫాల్ట్సు' మామూలుగానే ఉన్నాయి. 'రాలీస్' కూడా సరిగాలేవు. తేలిగ్గా తియ్యవలసిన బంతుల్ని కూడా మిస్ అవుతున్నాడు. బేస్‌లైన్‌వైపు బంతి వస్తే ఎత్తడానికి కూడా ప్రయత్నం చెయ్యడం లేదు.

శోభకి ఈ ఆట చూస్తూంటే ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లనిపిస్తున్నది. పార్వతి నెమ్మదిగా శోభచెవిలో అన్నది.

"ఏం శోభా ! ఏమిటే ఈ ఆట ! మీ వాడు అట్లా ఆడుతున్నాడేం ? శకుంతల చెప్పినట్లు స్ట్రెయిట్ సెట్స్ తప్పదల్లే వుంది. కనీసం ఒక సెట్టైనా గెలుస్తే బాగుణ్ణు. లేకపోతే మనం రిడిక్యులస్ అయిపోతాం."

శోభకి ఏం చెప్పాలో అర్థం కాలేదు. రామం ఆట చూస్తుంటే ఎక్కడలేని కోపం వస్తున్నది. కాని ఏం చెయ్యలేక అట్లానే చూస్తూ కూర్చుంది.

రెండో సెట్టు కూడా 6.1 స్కోరుతో ప్రసాదే గెల్చాడు. ప్రేక్షకు లందరూ ప్రసాద్‌ని మెచ్చుకోవడం మొదలెట్టారు.

"నేను చెప్పలా, స్ట్రెయిట్ సెట్స్ అని" నవ్వుతూ అంది, శకుంతల. "ఒచ్చేసెట్ 6.0 తో గెలుస్తాడు చూడండి."

పాపం రామం వైపు పందెం కాసిన పార్వతి, స్వర్ణ మొదలైన వాళ్ళు తెల్లముఖం వేశారు. "మన పది రూపాయలకు నీళ్ళు ఒదులుకోవచ్చు." అని పైకే అనుకున్నారు.

శోభకి వీళ్ళ మాటలు వింటూంటే ఒళ్ళు ఉడుకెత్తిపోయి ఏడుపు పర్యంతం అయింది. ఒకసారి రామం వంక చూసింది. రామం అప్పుడే జగ్‌లో నీళ్ళు గ్లాసులో పోసుకుంటున్నాడు. శోభ కుర్చీలో నించి లేచింది. "ఏం శోభా ! లేచావ్ ?" అని పార్వతి అంటున్నా వినిపించుకోకుండా, రామం దగ్గరికెళ్ళి 'ఫెడీ ఫెడీ' మని ఈ చెంపా ఆ చెంపా వాయించింది.

"ఇడియట్ ! ఫూల్ ! ఏం ఆటరా అది ? నువ్వాడుతున్నది టెన్నిసా, లేక ఆడపిల్లలాడుకునే చెమ్మ చెక్కా ? రాస్కెల్ ! అంత ఆడలేని వాడివి అసలు కోర్టులోకి ఎందుకొచ్చావ్ ? ఛీ ! సిగ్గులేదూ నీకు" అంటూ తిట్టడం మొదలెట్టింది కోపంతో ఊగిపోతూ.

ప్రేక్షకు లందరూ ఈ హఠాత్పరిణామం చూసి ప్రాన్పడి పోయారు. రామం ఒక చేత్తో గ్లాసు, ఇంకో చేత్తో శోభ వాయించిన చెంప పుచ్చుకుని, శోభవంక ఇంతంత గుడ్లు చేసుకుని చూడ్డం మొదలెట్టాడు. కల్లో కూడా ఊహించి ఉండడు ఇల్లాంటి పరిణామం. నోటమాటలేక అట్లాగే శో వంక చూస్తూ ఉండిపోయాడు'

శోభ మాత్రం ఇంకా కోపంతో ఊగిపోతూనే వుంది. "ఛీ" నా పరువు తీసేస్తున్నావ్. ఇంటి దగ్గర అన్ని కబుర్లు చెప్తావ్. వింబుల్డన్ గెలుస్తా చూస్కో అంటావ్. లేవర్, ఇమర్సన్ నా ముందు బలాదూర్ అంటూ కూస్తావ్. ఈ ఆటతోనేనా నువ్వు వింబుల్డన్ గెలిచేది? సిగులేదూ! నీ మీద నమ్మకంతో నేను పందెం వెయ్యడమే కాకుండా నువ్వు తప్పకుండా గెలుస్తావని నా ఫ్రెండ్స్‌ని కూడా పందెం కాయమన్నాను. నా తలెత్తుకోకుండా చేస్తున్నావ్. అంత ఆడలేకపోతే ఇంకా ఇక్కడెందుకూ? ఆ మూడో సెట్టు ఆడకుండానే ఒదిలేసి వెళ్ళిపోరాదూ! ఇంకా ఆ శ్రమ కూడా దేనికీ?"

ప్రేక్షకు లందరూ కిమ్మనకుండా చూస్తూ కూర్చున్నారు ఆశ్చర్యంగా. రామం ఒకసారి చుట్టూ ఉన్న ప్రేక్షకులవైపు చూశాడు. అందరూ ఎంతో కుతూహలంగా చూస్తున్నారు రామం వంక. మళ్ళీ ఒకసారి శోభవంక చూశాడు. శోభ గుడ్లలో నిప్పులు కురుస్తున్నది.

అంతే. మంచినీళ్ళు త్రాగకుండానే ఆ గ్లాసుని నేలకేసి విసిరి కొట్టాడు. గ్లాసు పగిలిపోయి ముక్కలు ముక్కలైంది. తన రాకెట్‌ని తీసుకుని వెనక్కైనా చూడకుండా కోర్టులోకి వెళ్ళాడు. శోభ గబగబా వెళ్ళి మళ్ళీ తన సీట్లో కూర్చుంది.

మూడో సెట్టు ప్రారంభమయింది. ఈసారి రామం ఆట ఇదివరకటికీ మల్లే లేదు. ఏ ఒక్క బంతినీ మిస్ అవడంలేదు. సర్వీసులో ఒక్క డబుల్ ఫాల్టు కూడా ఉండటంలేదు. సర్వీస్ చేస్తూంటే ఆ బంతి 'ఛన్' మని రాకెట్‌లా దిగుతున్నది. ప్రసాద్ దాన్ని ఎత్తలేక సతమత మవుతున్నాడు. ఒకవేళ ఎత్తినా మరుక్షణంలోనే రామం నెట్ దగ్గర ప్రత్యక్షమయి, పవర్‌ఫుల్‌గా హిట్ చేస్తున్నాడు. ప్రసాద్ నిస్సహాయంగా చూడ్డమే కాని ఏం చెయ్యలేక పోతున్నాడు. ఆ సెట్‌ని రామం 6-0 స్కోరుతో గెలిచాడు.

ఒక్కసారిగా ప్రేక్షకు లందరూ గొల్లు మన్నారు. కరతాళ ధ్వనులు రెండు నిముషాల వరకు అట్లాగే వుండిపోయాయి. మొదట్లో ఆగించిన టెన్షన్, టెంపోలు ఇప్పుడొచ్చాయి. ప్రతి వాళ్ళూ రామాన్ని పొగడ్డం మొదలెట్టారు. పావతి సంతోషంలో గంతులేయడం మొదలెట్టింది. "శోభా! శోభా! మీ అన్నయ్య ఫారంలో పడ్డాడోయ్ అబ్బ! ఏం ఆడుతున్నాడోయ్! ఆ ప్రసాద్ మొఖం చూడు, ఎట్లా అయిపోయిందో! అబ్బ! టెరిబుల్!" అంటూ శోభభుజం పట్టుకుని ఊపడం మొదలెట్టింది.

మళ్ళీ ఆట ప్రారంభం అయింది. నాలవ సెట్టు. కాని రామం ఆట మాత్రం ఏ మాత్రమూ తగ్గలేదు. ప్రసాద్ బేస్‌లైన్ దగ్గరికి బంతిని కొడ్తూంటే, ముందరే ఊహించినట్లు రామం అక్కడ ప్రత్యక్ష మవుతున్నాడు. కోర్టులో ప్రతిచోటా తనే ఉన్నట్లు ఆడుతున్నాడు. ప్రసాద్‌ని ఏం మూల

నించీ ఆ మూలకీ, ఆ మూలనుంచీ ఈ మూలకు చెడుగుడు ఆడిస్తున్నాడు తన ప్లేస్‌మెంట్స్‌తోటి. రామం సర్వీస్ చేసినప్పుడల్లా ప్రేక్షకులు గొల్లుమంటున్నారు ఎప్రిసియేషన్‌తోటి. ఒక్క సర్వీసు కూడా మిస్ అవటం లేదు. సర్వీసు చేస్తే బంతి బులెట్‌లా దిగుతున్నది. ఆ సెట్‌ని రామం 6-1 స్కోరుతో గెలిచి స్కోర్‌ని ఈక్వల్ చేశాడు.

మళ్ళీ ప్రేక్షకులు గొల్లుమన్నారు. ఈసారి చప్పట్లు అయిదు నిముషాల వరకు ఆగలేదు. అందరూ రామాన్ని తెగ మెచ్చుకుంటున్నారు. పార్వతి సంతోషానికి ఇక హద్దేలేదు. ఉక్కిరి బిక్కిరై పోతోంది. "శోభా! మీ అన్నయ్య మన పరువు కాపాడాడోయ్. అబ్బ! ఏం ఆట! ట్రెమెండస్! ఏం, శకుంతలా! మాట్లాడవ్. స్ట్రెయిట్ సెట్స్ అన్నావ్‌గా. ఇప్పుడేమంటావ్? ఏయ్! స్వర్ణా! మన పది రూపాయలు పోలేదోయ్ పైగా మనకే పది రూపాయిలు వచ్చేటట్లున్నాయి. బలే బలే! మా శోభ ఆటంతా ఒక్కసారి తలక్రిందులు చేసేసింది" ఇంకా ఏమిటేమిటో చెప్పేస్తోంది హుషారుగా.

రిఫరీ పది నిమిషాలు విశ్రాంతి టైముగా డిక్లేర్ చేశాడు. ప్రసాద్ తన కార్నర్‌కి వెళ్ళి ముఖం తుడుచుకుని ఒక గ్లాసు మంచినీళ్ళు తాగాడు. కాని రామం మాత్రం కోర్టులో నుంచి కదల్లేదు. అట్లాగే అక్కడే రాకెట్ పుచ్చుకుని నిలబడ్డాడు రొప్పుతూ. చుట్టూరా ఇంత గందరగోళంగా వున్నా ఏమీ పట్టించుకున్నట్లు కనపడటం లేదు.

శోభ గబగబా వెళ్ళి జగ్‌లో నీళ్ళు గ్లాసులో పోసి తీసుకొచ్చి రామానికి ఇవ్వబోయింది. రామం ఇంకా కోపంగానే వున్నాడు. గ్లాసుని విసిరి అవతల పారేశాడు. శోభ ఆశ్చర్యపోతూ చూసింది. ప్రేక్షకులందరూ స్తబ్ధులై రామాన్ని, శోభని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు.

శోభ చాలా బాధ పడింది. రామానికి శోభ మీద కోపం కాస్తంత కూడా తగ్గలేదు. 'నాకేం నీళ్ళూ గీళ్ళూ అందించాల్సిన పనిలేదు. పోయి నీ చోట్లో కూర్చో' అన్నాడు కోపంగా.

శోభ మళ్ళీ వెళ్ళి ఇంకో గ్లాసులో మంచినీళ్ళు పోసుకొచ్చింది.

"ఒరేయ్ ఎందుకురా అంత కోపం? నేను నీ చెల్లెల్ని కాదురా! నా మీదెందుకురా కోపం? నేనేం చేశాను? ఈ మంచి నీళ్ళు త్రాగరా. ప్లీజ్! లేకపోతే నేను చాలా బాధ పడ్తానురా. ప్లీజ్! అన్నయ్యా! నా తప్పేమైనా వుంటే క్షమించరా. నీ చెల్లెలిమీద అంత కోపం దేనికిరా? నువ్వే ఇంత కోపంచేస్తే ఇక నేనేమై పోతానురా!" నెమ్మదిగా బతిమాలడం మొదలెట్టింది ముఖం ఎంతో విచారంగా పెట్టి.

రామం ఒకసారి శోభ ముఖంలోకి చూశాడు. తను ప్రాణాలనైనా అర్పించే ఆ ముఖం విచారంగా వుండడం చూసి ఒక్కసారిగా నీరు కారిపోయాడు.

మాట్లాడకుండా గ్లాసు అందుకుని నీళ్ళు తాగడం మొదలెట్టాడు.

శోభ ముఖంలోకి సంతోషం వచ్చింది. "నాకు తెలుసు. మా అన్నయ్యకి నా మీద కోపం రాదని. వచ్చినా వెంటనే పోతుంది. మా అన్నయ్య చాలా మంచివాడు. నేనంటే ఎంతో ప్రేమ. కదు రా . అన్నయ్యా ?" నవ్వుతూ అంది రామం ముఖంలో మార్పు గమనించి.

రామం ఒక్కసారి నవ్వాడు. గంటన్నర తరువాత నవ్వు ముఖం పెట్టింది ఇప్పుడే. ప్రేక్షకులు ఒక్కసారి చప్పట్లు కొట్టారు. రామం ఉలిక్కిపడి చుట్టూ చూశాడు. ఇంత వరకూ ఏ లోకంలో ఉన్నాడో, ఇప్పుడే ఈ లోకంలో పడ్డాడు. జరిగిందంతా ఒక్కసారి తలుచుకుని శోభవంక చూశాడు. శోభ నవ్వుతూ అక్కడే నిలబడింది. మనస్ఫూర్తిగా తను కూడా నవ్వాడు

"దొంగపీనుగా ! వేషాలు బాగా నేర్చావ్. నా చెంపలు రెండూ వాయించావు కదూ ! ఇంటికి పద. నీ పని చెప్తా" నవ్వుతూ అన్నాడు గ్లాసు అందిస్తూ.

"ఏం చేస్తా వేమిటి ? కొడ్తావా ?" గ్లాసు అందుకుంటూ అంది నవ్వుతూ.

"కొడ్తావా అని ఇంకా నెమ్మదిగా అంటున్నావా ? కాళ్ళు చేతులు విరిచేస్తాను. చూస్తూ ఉండు" తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నాడు రామం.

శోభ గలగలా నవ్వింది "నువ్వేం కొట్టవు. నాకు తెలుసు. ఎందుకో చెప్పనా"

"ఏం ! ఎందుకు ?"

"అది రహస్యం. చెవి పట్టు. చెవిలో చెప్తాను" అంటూ రామం చెవిలో చెప్పింది. "నన్నెందుకు కొట్టనంటే, ఇవ్వాళ ఇంటి కెళ్ళిన తరవాత ఏం చెంపల్నయితే వాయించిందో ఆ చెంపల్ని నీ చెల్లెలు తన రెండు చేతుల్లోకి తీసుకుని వాటిమీద రెండు స్వీట్ కిసెస్ పెడ్తుంది. తెలిసిందా."

"ఆ ! నిజంగా !" సంతోషంతో గట్టిగా అరిచాడు రామం.

"ఇష్ !! ఏమిటట్లా గాడిదలా అరుస్తావ్. నిజంగానే చెప్తున్నాను." నవ్వుతూ తిరిగి తన సీటుకి వెళ్ళి కూర్చుంది.

పార్వతి గబగబా వచ్చి శోభకి ఒక ముఖ్య విషయం నెమ్మదిగా చెప్పింది. "శోభా ! ఈ ఫైనల్ సెట్ మీ వాడు ఏం చేస్తాడో, ప్రసాద్ చాలాధైర్యంగా వున్నాడు. 'నేను కొంత కేర్లెస్‌గా ఆడడం వల్ల రెండు సెట్లు పోయాయి. మొదటి రెండు సెట్లు చాలా తేలిగ్గా గెలవడం వల్ల కేర్లెస్‌గా ఆడాను. కాని ఫైనల్ సెట్ తప్పకుండా గెలుస్తాను. నా ప్రాణం ధారపోసైనా సరే, ఈ సెట్ రామాన్ని గెలవనీయను' అంటున్నాడు. ఈ సెట్‌ని కూడా మీ వాడు గెలిచాడంటే ఎంతో బాగుంటుంది."

వెంటనే శోభ 'అన్నయ్యా'! అంటూ కేకేసింది. ఏమిటన్నట్లు శోభ వైపు చూశాడు రామం.



"ఇందాక ఇస్తానన్నానే. దానికి ఒక కండిషన్ ఉంది. అది అయితేనే ఇచ్చేది."

"ఏమిటది ?"

"ఈ సెట్ కూడా నువ్వే గెలవాలి. లేకపోతే ఇయ్యను. తెలిసిందా."

"ఆల్ రైట్. అట్లాగే గెలుస్తాలే"

"గెలుస్తాలే అంటే లాభంలేదు. గెల్చి తీరాలి. మిస్టర్ ప్రసాద్ కూడా తనే గెలుస్తానంటున్నాడట మరి"

రామం చిరునవ్వు నవ్వాడు. "ఆదేదో ఇస్తానని ఆశ పెట్టావుగా. దాని కోసమేనా ఈ సెట్ గెల్చి తీరుతాను. ప్రసాద్ కాదుకదా సాక్షాత్తూ ఆ వింబుల్డన్ ఛాంపియన్ రాయ్ ఇమర్సన్ వచ్చి ఆడినా ఈ సెట్ నా మీద గెలవలేడు, సరా ?"

శోభ తృప్తిగా నవ్వుకుంది. స్నేహితురాండ్రందరూ శోభని చుట్టుముట్టారు. "ఏమిటోయ్ అది, ఏమిస్తానన్నావ్. మాకు చెప్పవ్" అంటూ అడగటం మొదలెట్టారు. శోభ "అది సీక్రెట్. ఎవ్వరికీ చెప్పకూడదు" అంది. పార్వతి కూడా రహస్యంగా అడిగి చూసింది తనకేనా చెప్పమని. కాని శోభ సమాధానం మాత్రం అదే. "సీక్రెట్. చెప్పకూడదు."

రిఫరీ విజిల్ వేశాడు, ఫైనల్ సెట్ మొదలుపెట్టే టైమయిందని. ప్రసాద్, రామం కోర్టులో ప్రవేశించి తమ తమ స్థానాల్లో నుంచున్నారు. రిఫరీ ఆటని ప్రారంభం చెయ్యబోతూ ప్రేక్షకుల్ని ఉద్దేశించి అన్నాడు "ఈ ఫైనల్ సెట్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. ఇద్దరూ పెద్ద ఆటగాళ్ళే. ఇద్దరూ మంచి పట్టులో ఉన్నారు ఈ సెట్ గెలవాలని. దయచేసి ఎవ్వరూ రాలీస్ మధ్యలో గొడవ చెయ్యవద్దు. ఎంకరేజిమెంట్లు, కామెంట్లు ఒద్దు. అట్లా చేస్తే వాళ్ళకి కాన్సెన్ట్రేషన్ పోతుంది. కాబట్టి గొడవ చెయ్యకండి" తరువాత రామంవైపు తిరిగి "సర్వీస్ నీది. కమాన్. స్టార్ట్" అన్నాడు.

ఫైనల్ సెట్ మొదలయింది. అనుకున్నట్లే ఈ సెట్ చాలా ఇంటరెస్టింగ్గా ఉంది. రామం ఎంత గొప్పగా ఆడుతున్నాడో ప్రసాద్ కూడా అంత గొప్పగానూ ఆడుతున్నాడు. ప్రసాద్ సర్వీస్ స్వతహాగా వీక్‌గా ఉండేది. కాని ఈ సెట్‌లో ప్రసాద్ సర్వీసు కూడా పవర్‌ఫుల్‌గా ఉంది. రామం సర్వీసయితే స్వతహాగానే పవర్‌ఫుల్. ప్రతి పాయింటుకోసం ప్రాణాలు ధారపోసి ఆడుతున్నట్లు కనపడుతున్నారు. ప్రేక్షకులందరూ మునికాళ్ళమీదున్నట్లు కూర్చున్నారు. ఎవరు గెలుస్తారో చెప్పడం చాలా కష్టం అనిపిస్తున్నది.

మొదలు పెట్టి నలభై నిముషాలయినా ఆట ఎటూ తెగటంలేదు. గేము సర్వీసు చేస్తున్నవాళ్ళకే ఒస్తున్నది. మొదటి గేము రామం గెలిచి స్కోరు 1-0 చేశాడు. ప్రసాద్ రెండో గేము గెలిచి స్కోరు 1-1 చేశాడు. మూడోది మళ్ళా రామం గెలిచి 2-1 చేశాడు. నాల్గోది ప్రసాద్ గెలిచి 2-2 చేశాడు. ఇట్లా సర్వీస్‌తో గేములు నడుస్తున్నాయి. ఇట్లా నలభై నిముషాల తరువాత స్కోరు 12-12 లో వుంది. ఇద్దరూ బాగా అలసిపోయారు. రామం కంటె ప్రసాద్‌కి స్టామినా తక్కువ కావడంవల్ల ప్రసాద్ రామంకంటె బాగా అలసి పోయాడు.


ఇరవై ఐదో గేము రామం సర్వీసుది. రామం ఎంతో జాగ్రత్తగా ఆడుతూ రెండు డ్రాప్ షాట్స్, ఒక ప్లేస్‌మెంట్ తో ఆ గేము గెలిచి స్కోరును 13-12 చేశాడు.

ఇరవై ఆరో గేము మొదలెట్టారు. ఇది ప్రసాద్ సర్వీసుది. ఈ గేము గెలిచి సెట్ సంపాదించి ఛాంపియన్‌షిప్ గెలవాలని రామం. ఈ గేము తను గెలిచి స్కోర్‌ని ఈక్వల్

చెయ్యాలని ప్రసాద్ దృఢ నిశ్చయాలతో ఆడుతున్నారు. సర్వీస్ ఎడ్వాంటేజి ప్రసాద్‌కి ఉన్నా రామం పట్టుదలతో ఆడుతూ మూడుసార్లు 'జ్యూస్' చేశాడు. రిఫరీ 'జ్యూస్' అన్నప్పుడల్లా ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ రామాన్ని మెచ్చుకుంటున్నారు. మూడో సారి జ్యూస్ అయిన వెంటనే రామం మొదటిసారిగా 'వాకౌట్' చెయ్య గలిగాడు. ఫైనల్‌గా రామం కోర్టులో వెనకాల ఉన్నాడు కదా అని ప్రసాద్ 'డ్రాప్' వేశాడు. కాని రామం సుడిగాలిలా నెట్ దగ్గరికి పరుగెత్తుకు వచ్చి తన శక్తినంతా ఉపయోగించి హిట్ చేశాడు. ఆ బంతి బౌండ్ పడి గాల్లోకి పదిహేను అడుగులు లేచి ప్రసాద్‌కి అందకుండా పైనుంచి వెళ్ళిపోయింది. ఆ గేము కూడా రామం అట్లా గెలిచి 14-12 స్కోరుతో ప్రసాద్‌ని ఓడించి ఛాంపియన్‌షిప్ గెలిచాడు.

ప్రేక్షకు లందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు. ప్రసాద్ కూడా సంతోషంతో నెట్ పైనుంచి దూక్కుంటూ ఒచ్చి రామాన్ని కౌగలించుకొని "కంగ్రాచ్యులేషన్స్. నీ ఆట అద్భుతం. యూ ఫుల్లీ డిజర్వ్ ది విన్" అన్నాడు. రామంకూడా 'నువ్వు మాత్రం తక్కువ ఆడావా ఏమిటి? నువ్వు తిప్పలు పెట్టావ్ నన్ను. ఈ సెట్ గెలిచేటంత వరకూ నమ్మకం లేకపోయింది' అన్నాడు నవ్వుతూ.

ప్రేక్షకు లందడూ వాళ్ళిద్దర్నీ చుట్టుముట్టారు. ఇద్దరూ కూడా చాలా బాగా ఆడేరని మెచ్చుకోడం మొదలెట్టారు. శోభ సంతోషంతో గబగబా వచ్చి రామం చెయ్యి పుచ్చుకుని నిలబడింది. ప్రసాద్ శోభవంక చూసి నవ్వుతూ రామంతో అన్నాడు. "మిస్టర్ రామం!



నువ్వు ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి. ఇవ్వాళ నా మీద గెలిచింది నువ్వు కాదు. మీ సిస్టర్ మిస్ శోభా దేవి. ఆమే కనక ఇవ్వాళ ఇక్కడ లేకపోతే నువ్వు స్ట్రెయిట్ సెట్స్‌తో ఓడిపోయేవాడివి. ఆ విషయం మాత్రం నువ్వు ఒప్పుకోవాలి."

రామం తన చెయ్యి పుచ్చుకుని నిలబడ్డ శోభవంక చూశాడు. శోభ సిగ్గుతో తల దించుకుంది. "యు ఆర్ పర్ఫెక్ట్లీ కరెక్ట్ మిస్టర్ ప్రసాద్. ఈ గెలుపు మా శోభదే. ఐ ఎగ్రీ విత్ యూ" అన్నాడు నవ్వుతూ.

ప్రసాద్ మళ్ళీ అడిగాడు. "బై ది బై మిస్టర్ రామం. క్యూరియాసిటీ వల్ల అడుగుతున్నాను. ఈ ఫైనల్ సెట్ నా శక్తినంతా ఉపయోగించిఆడాను. నువ్వు గెలవగలవని ఎప్పుడూ అనుకోలేదు. నువ్వు గెలిచావంటే అర్థం నువ్వెంతో కాన్సెన్ట్రేట్ చేసి ఆడావన్నమాట. ఈ సెట్ నీ లైఫ్ అండ్ డెత్ అనుకుని ఆడావు. దానికి కారణం ఒక్కటే కన పడుతోంది. ఈ ఫైనల్ సెట్ నువ్వు గెలవకపోతే మీ సిస్టర్ నీకు ఇదివరకు ఇస్తానన్న దేదో ఇవ్వనన్నారు. నువ్వు దాన్నే మనసులో పెట్టుకుని ఆడావని నా ఉద్దేశం. అందుచేతే ఈ ఫైనల్ సెట్ గెలవ గలిగావు. మీసిస్టర్ ఇస్తానన్న దేమిటో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది!"

చుట్టూరా ఉన్న ప్రేక్షకులు కూడా అదే అడిగారు. "అవునండీ, మిమ్మల్ని అంత ప్రెజ్ టేకింగ్‌గా ఆడించిన ఆ వస్తువు. మీ సిస్టర్ ఇస్తానన్నది ఏమిటండీ? మాకు కూడా చాలా కుతూహలంగా ఉంది తెలుసుకోవాలని. చెప్పండీ."

రామం నవ్వాడు. శోభని చూపిస్తూ "ఇస్తానన్నవాళ్ళు పక్కనే వున్నారుగా. దాన్నే అడగండి" అన్నాడు.

"ఏమండీ! మిస్ శోభాదేవీ! ఏమిస్తానన్నారండీ?" అంటూ శోభని అడగడం మొదలెట్టారు అందరూ.

శోభ బిత్తర పోయింది. తను ఇస్తానన్న దేమిటో తలపుకు ఒచ్చేటప్పటికి ఎక్కడలేని సిగ్గూ ఒచ్చింది. "అబ్బే !... ఏం లేదండీ ఉత్తినే అన్నా అంతే " అంటూ మాట మార్చబోయింది.

పక్కనే వున్న పార్వతి "నాకు తెలుసు ఏమిస్తానందో. నాకు చెప్పింది" అంది.

వెంటనే అందరూ పార్వతిని అడగడం మొదలెట్టారు. శోభ పార్వతి వంక కోపంగా చూసింది. పార్వతి నవ్వుతూ "ఆ ఏముంది! ఇంటికెళ్ళిన తరువాత ఇంకోసారి ఈ దవడా ఆదవడా వాయిస్తానంది. అవంటే వాళ్ళన్నయ్యకి చాలా ఇష్టమట." అంది.

అందరూ ఒక్కసారి నవ్వారు. ప్రసాదు, రామంతో సహా.

'ఛ!' అంటూ చెయ్యెత్తి, పారిపోతున్న పార్వతి వెంట పడింది మిస్ శోభాదేవి.

***

"పదండి మాస్కోకు"

జగ్గయ్యతో ప్రత్యేక గోష్ఠి

సినిమా

భారత విప్లవవీరుడు సర్దార్ భగత్ సింగ్ జీవిత చిత్రం "షహీద్" (హిందీ)తో పాటు, ఆంధ్రదేశపు ఉప్పు సత్యాగ్రహ గాధ (1930) కల "పదండి ముందుకు" మాస్కోలో సెప్టెంబర్‌లో జరుగనున్న అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనానికి పంపడం తనకే కాక ఆంధ్ర దేశానికే గర్వకారణమని "పదండి ముందుకు" చిత్రం ముఖ్యనటుడు, సంభాషణ కర్త, గేయకర్త శ్రీ కొంగర జగ్గయ్య అన్నారు.

1962లో తయారైన జాగృతి చిత్ర వారి చిత్రాన్ని మాస్కో ప్రతి కోసం 16,000 అడుగుల నుంచి 10,000 అడుగులకు తగ్గించారు.

ఇందుకోసం నృత్యాలు, కొన్ని పాటలు, కొన్ని ప్రక్క కధలు తొలగించారు.

శ్రీశ్రీ రచించిన "పదండిముందుకు" పాట, దాశరథి రచించిన "మేలుకో, సాగిపో, బంధనాలు తెంచుకో" పాట, జగ్గయ్య రచించగా మహమ్మద్ రఫీ పాడిన "మంచికి కాలం తీరిందా, మనిషికి హృదయం మాసిందా" అన్న పాట మాత్రం వుంచారు.

నిడివి తగ్గింపు, పునఃసంపుటీకరణ ఎడిటర్ సంజీవి చేశారు.

సబ్ టైటిల్సు వేయిస్తున్నారా? అని అడుగగా వాటిని ఇంగ్లీషులో వేయించడం తమకు సాధ్యపడ వచ్చునని, కాని రష్యనులలో ఆంగ్లం తెలిసినవారు చాలా కొద్దిమంది కాబట్టి ఇంగ్లీషు సబ్ టైటిల్సు వేసీ ప్రయోజనం లేదన్నారు.

ఈ రచన చేస్తున్న సమయానికి "పదండి ముందుకు" చిత్రంతోపాటు చిత్ర ప్రతినిధులుగా దర్శకుడు వి. మధుసూధనరావు, నటులు జగ్గయ్య, గుమ్మడి రష్యాకు వెళ్ళవచ్చునని తెలిసింది.

సోవియెట్ రష్యాలో మొత్తం మూడు వారాలపాటు చిత్రోత్సవం జరుగుతుంది. దాదాపు అన్ని రిపబ్లిక్‌లలోను చిత్రం బహుశా ప్రదర్శించబడవచ్చు. అన్ని రిపబ్లిక్‌లకు ఆంధ్ర ప్రతినిధులు సోవియెట్ ప్రభుత్వ ప్రతినిధులుగా వెళ్ళవచ్చు.

సరిగా ఒక సంవత్సరం క్రింద 1965 సెప్టెంబర్‌లో "కీలుబొమ్మలు" ప్రతినిధులుగా పి. గంగాధరరావు,

కె. జగ్గయ్య, పి. ఎస్. ఆర్. ఆంజనేయులు ఐర్లెండు వెళ్ళినప్పుడు అక్కడ నుంచి మాస్కో కూడా వెళ్ళారు. జగ్గయ్య తనకు లభించిన ప్రభుత్వ ఆతిథ్యం గురించి "జ్యోతి" ప్రతినిధితో ముఖ్యంగా ప్రస్తావిం. మాస్కో నగరంలోని "యుక్రేన" అనే హోటలులో తనకు గది ఏర్పాటు చేశారని, తనకై ఎల్లవేళలా ఒక టేబిల్ తన అతిధులకని ఎనిమిది కుర్చీలు విడిగా వుంచేవారని, వాటిపై భారత పతాకం పెట్టి వుంచేవారని అన్నారు. తిరిగి ఒక సంవత్సరానికి, సెప్టెంబర్‌లోనే మాస్కో వెళ్ళబోవడం బట్టి తనకు సెప్టెంబర్ బాగా కలసి వచ్చిన నెలగా చెప్పవచ్చు నన్నారు.

అటుపిమ్మట మా గోష్ఠి యిలా సాగింది.

ప్రశ్న: "పదండి ముందుకు" అన్న అర్థం వచ్చే కొత్త టైటిల్ పెట్టారా?

జవాబు "పిల్గ్రిమ్స్ మార్చి" అనే పేరు పెట్టాను.

ప్ర కారణం?

జ గాంధీజీ దండి సత్యాగ్రహాన్ని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఒకసారి ప్రస్తావించి "పిల్గ్రిమ్ ఆన్ ది మార్చ్" అని అన్నారు మన ఆంధ్ర సత్యాగ్రహానికి నెహ్రూ మాట పెట్టాలనుకొన్నాను.


ప్ర సబ్ టైటిల్సు లేక, వ్యాఖ్యానంలేక తెలుగు సినిమాను రష్యనులకు చూపితే ఏమి తెలుస్తుంది?

జ: ఆంధ్ర సంస్కృతిని, రాజకీయ, చలన చిత్రవిశేషాలను తెలిపే ఒక సంపుటిని ఆంగ్లంలో ప్రచురించాము.



"నాట్యవిశారద" పద్మ

అమెరికాలో పర్యటించి వచ్చిన నర్తకి పద్మ ఇటీవల మద్రాసులో భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యాన జరిగిన ఉత్సవంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. ఆమెకు "నాట్యవిశారద" బిరుదును బహూకరించారు.



కృష్ణసాయి ఫిలిమ్స్‌వారు శ్రీధర్ దర్శకత్వంలో
హైదరాబాద్‌లో నిర్మించిన "మనసే మందిరం" చిత్రం
ప్రారంభోత్సవ సందర్భంలో తీసిన చిత్రం

రామారావు స్వంత సాంఘికం

ఎన్. ఏ. టి. రామకృష్ణ కంబైన్స్ వారి **"ఉమ్మడి కుటుంబం"** ఈ సంచిక వెలువడే సరికి శబ్దదశ దాటి దృశ్య దశవరకు వస్తుంది. రామారావు, రేలంగి, ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, సావిత్రి, కృష్ణకుమారి, ఎస్. వరలక్ష్మి, ఎస్. విజయలక్ష్మి తారాగణంలో ముఖ్యులు. సాంకేతిక వర్గ వివరమిది: నిర్మాత: ఎన్. త్రివిక్రమరావు. దర్శకుడు: డి. యోగానంద్, ఛాయాగ్రహణం—రవికాంత్, సంభాషణలు—సముద్రాల జూనియర్, పాటలు—సి. నారాయణరెడ్డి, కొసరాజు, కళ: ఎస్. కృష్ణారావు. సంగీతం: టి. వి. రాజు.

"వుయ్ ఆర్ సెవెన్"

"వుయ్ ఆర్ సెవెన్" అనే ఆంగ్ల గేయం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ప్రసిద్ధ మోనోయాక్టర్ ఆర్. కె. రావు కళా జీవిత రజతోత్సవం ఆ మధ్య విజయ నగరంలో జరిగింది. గుమ్మడి అధ్యక్షత వహించారు. రమణారెడ్డి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆర్. కె. రావుకు ఆరుగురు సోదరులు. వారందరూ కలసి "కుక్కపిల్ల దొరికింది" ప్రదర్శించారు. ఆ హాస్య నాటిక రచించింది రావికొండలరావు.

జయంతి తారాగణం

జయంతివారి జానపదం తారాగణ నిర్ణయం దశకు వచ్చింది. రామారావు, బి. సరోజతోపాటు పద్మనాభం, రాజ నాల మొదలైనవారు తారాగణంలో వుండవచ్చునని తెలుస్తున్నది. సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభంకావచ్చు. దర్శకుడు: కె. వి. రెడ్డి, రచన: పింగళి నాగేంద్రరావు, సంగీతం: పెండ్యాల.

"దైవశాసనం"

నిర్మాత శ్రీ పి. సత్యనారాయణ సమర్పించు "దైవశాసనం" త్వరలో ఆంధ్రలో విడుదల అవుతుంది. బి. సరోజాదేవి, కన్నాంబ, దేవిక, శివాజీ గణేశన్ మున్నగువారు నటించిన ఈ చిత్రానికి రచన శ్రీ శ్రీ సాగించారు.

"మనసే మందిరం"

నిర్మాత శ్రీ యర్రా అప్పారావు శ్రీ కృష్ణసాయి ఫిలిమ్స్ పతాకంక్రింద "మనసే మందిరం" అనే సాంఘిక చిత్రాన్ని నిర్మించారు. అతిత్వరలోనే విడుదలకు సన్నాహమౌతున్న ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, సావిత్రి, గుమ్మడి, శాంత కుమారి, రేలంగి, చలం, గిరిజ, శారద ప్రభృతులు నటించారు. శ్రీధర్ దర్శకత్వంలో ఈ చిత్రం ఒకే ఒక సెట్‌లో 25 రోజులలోనే పూర్తయింది. స్టుడియో: శ్రీ సారధి.

"భువన సుందరి కథ"లో కొత్త సుందరి

శ్రీదేవి ప్రొడక్షన్స్ వారి ద్వితీయ కానుక "భువన సుందరి కథ" అతి త్వరలో సెట్స్‌కు వెళ్ళేందుకు సర్వ సన్నాహాలు చేస్తున్నారు. ఎన్. టి. రామారావు కథానాయకుడుగా నటించబోవు ఈచిత్రంలో కథానాయిక పాత్రకు చక్కన్ని యువతి కోసం అన్వేషణ ప్రారంభించారు. దర్శకుడు శ్రీ పి. పుల్లయ్య. నిర్మాత శ్రీ తోట సుబ్బారావు. "పరమానందయ్య శిష్యుల కథ" చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులందరూ ఈ చిత్రానికిఉంటారు. ఈ జానపద కథా రచయిత: జీ.వి.జి. కృష్ణ, రచన: బి. ఎల్. ఎన్. ఆచార్య.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road, Governorpet, Vijayawada-2

Regd. No. H368 JYOTI SEPTEMBER

కృష్ణసాయి ఫిలింస్ వారి...

మనసే మందిరం

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీధర్

నిర్మాత: యర్రా అప్పారావు

...శ్రీ ఫిలింస్...

